# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 208 | హైదరాబాద్ | సోమవారం 09-02-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

చరిత్రలో బూతులు మాట్లాడే ఏకైక మంత్రిగా రేవంత్ రెడ్డి మిగిలిపోతాడు: కేటీఆర్

## గిరిజన ఆశ్రమ పాఠశాలలో

# ఫుడ్ పాయిజనింగ్..

## విచారణకు ఆదేశించిన సీఎం చంద్రబాబు

- దేవరపల్లి గిరిజన ఆశ్రమ హాస్టల్‌లో ఫుడ్ పాయిజనింగ్
- 92 మంది విద్యార్థులకు వాంతులు, కడుపునొప్పి
- ఘటనపై విచారణకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని సీఎం హెచ్చరిక
- విద్యార్థులందరి ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడి





11లో



11లో

## ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్నిప్రమాదం ఆ వార్తలు నమ్మొద్దన్న శిఖా గోయల్



11లో

పొలాల్లో కూలిపోయిన విమానం...

## ముందే దూకేసిన కెప్టెన్, ట్రైనీ పైలట్!

## భారత్-మలేషియా బంధానికి తమిళమే వారధి : ప్రధాని



11లో

- భారత్, మలేషియాలను తమిళ భాష కలుపుతోందన్న ప్రధాని మోదీ
- ఇరు దేశాల మధ్య ఆడియో విజువల్ ఒప్పందంపై హర్షం
- మలేషియాలో 12,000 మందితో ప్రధాని మోదీ భారీ సభ
- మలేషియా ప్రధానికి ఎంజీఆర్ పాటలంటే ఇష్టమన్న మోదీ







# బిల్డ్ నౌ' కాదు.. బ్రైబ్ నౌ'!

- ఏఐ ముసుగులో అధికారుల 'అరాచకం'.. పారదర్శకతకు 'పాతర'
- షార్ట్‌ఫాల్ పేరుతో బ్లాక్‌మెయిల్ దందా.. దిక్కులేక నిర్మాణదారులు, బిల్డర్ల విలవిల!
- వన్‌టైమ్ పర్మిషన్ అన్నారు.. వందసార్లు తిప్పుతున్నారు!
- ఏఐ అంటే పారదర్శకత అనుకుంటే.. అది అధికారుల జేబుల 'ఏటీఎం' అయింది!
- షార్ట్‌ఫాల్ పేరుతో బ్లాక్‌మెయిల్.. కమీషన్ ఇస్తేనే సాఫ్ట్‌వేర్‌కు 'కన్ను' తెరుచుకుంటోంది!
- నియమాలు సామాన్యుడికి ఉచ్చు.. ఏజెంట్లకు మాత్రం కాసుల మెచ్చు!
- నిర్మాణ రంగం కుదేలవుతున్నా.. పాలకుల నిమ్మకు నీరెత్తిన తీరు వెర్రి తలలు వేస్తోంది!
- టెక్నాలజీ సాక్షిగా సాగుతున్న ఈ 'దోపిడీ'కి అడ్డుకట్ట పడేదెప్పుడు?

12లో

యాసంగి రైతు భరోసాపై కీలక అప్‌డేట్..

## నిధుల విడుదల ఎప్పుడంటే..!




11లో

భారత శక్తి®

# ఎప్‌స్టీన్ ఫైల్స్.. అంతులేని కధ

ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జెఫ్రీ ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం సెగలు ఇప్పుడు ఒక్కొక్క దేశాన్ని తాకుతున్నాయి.. అమెరికాలో సంచలనం సృష్టించిన జెఫ్రీ ఎప్‌స్టీన్ కేసులోని రహస్య పత్రాలను 'ఎప్‌స్టీన్ ఫైల్స్' అంటున్నారు. ఇటీవల అమెరికా ప్రభుత్వం ఈ పత్రాలను బహిర్గతం చేయడంతో ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఎప్‌స్టీన్ అమెరికన్ బిలియనీర్. మైనర్ బాలికలను లైంగిక అక్రమ రవాణా చేసినట్లు నిర్ధరణ అయింది. 2019లో ఎప్‌స్టీన్ జైలులో ఉండగానే ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సేకరించిన కోర్టు పత్రాలు, సాక్ష్యాలు, విమాన ప్రయాణ వివరాలు, కాంటాక్ట్ లిస్టులను ప్రభుత్వం విడతల వారీగా విడుదల చేస్తూ వస్తోంది.అమెరికా, బ్రిటన్ ఇలా ఎన్నో దేశాలను వణికిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లోని కుబేరుల్ని సైతం షేక్ చేస్తున్న అంశం ఎప్‌స్టీన్ ఫైల్స్. చాలా ఏళ్లుగా ఈ విషయంలో చర్చ జరుగుతూనే ఉన్న.. ఇటీవల వరుసగా ఇందులోని విషయాలు బయటకు వచ్చాయి. అప్పటివరకు వీటి గురించి బహిరంగంగా మాట్లాడని సెలబ్రిటీలు, సెలబ్రిటీలు భార్యలు కూడా ఇప్పుడు మాట్లాడుతున్నారు. ఇప్పుడు ఈ రొచ్చు బాలీవుడ్‌కి తాకింది. హిందీ సినిమాకు చెందిన ఇద్దరి పేర్లు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉన్నాయంటూ ప్రచారం జరుగుతోంది. వారే దర్శక నటుడు అనురాగ్ కశ్యప్, దీపక్ చోప్రా. దీంతో ఇప్పుడు బాలీవుడ్‌లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ఓ ఈవెంట్ కోసం అనురాగ్ కశ్యప్ 2017లో బీజింగ్ వెళ్లారంటూ పుకార్లు వచ్చాయి. వీటిపై అనురాగ్ కశ్యప్ స్పందించి ఖండించారు. "వక్తగా నాకు నెలకు చాలా ఆహ్వానాలు వస్తుంటాయి. అరుదుగా వాటిపై స్పందిస్తుంటా. అయితే నా జీవితంలో ఇప్పటివరకూ బీజింగ్ వెళ్లలేదు" అని క్లారిటీ ఇచ్చేశారు. ఇక దీపక్ చోప్రా మాట్లాడుతూ నేనెప్పుడూ నేరపూరిత కార్యకలాపాల్లో భాగం కాలేదు. ఎప్‌స్టీన్‌తో నా పరిచయం పరిమితమైనది. వివాదాస్పద లైంగిక నేరాల ఘటనతో నాకు సంబంధం లేదు అని చెప్పేశారు.అయితే ఈ పత్రాల్లో ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తుల పేర్లు ఉండటం కలకలం రేపుతోంది. అయితే, ఒక వ్యక్తి పేరు ఈ ఫైల్స్‌లో ఉన్నంత మాత్రాన అతను నేరం చేసినట్లు కాదు. కొందరు కేవలం ఆయనకు తెలిసిన వారు, లేదంటే ఆయన విమానంలో ప్రయాణించిన వారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఫైల్స్‌ను పూర్తిగా విడుదల చేసేందుకు ఉద్దేశించిన బిల్లుపై ఇటీవల సంతకం చేశారు. దీనివల్ల దాదాపు 30 లక్షల పేజీల డాక్యుమెంట్లు, 2 వేల వీడియోలు బయటకు వచ్చే అవకాశం ఉంది. అప్పుడు ఇంకా చర్చ జరుగుతుం ప్రభుత్వాన్ని తాకాయి. ఇప్పటికే ఎప్‌స్టీన్‌తో సంబంధాలపై బిల్‌గేట్స్ స్పందించి.. బాధితులకు క్షమాపణలు చెప్పగా.. ఇప్పుడు బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ అందరికీ సారీ చెప్పారు. ముఖ్యంగా ఎప్‌స్టీన్‌తో అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు ఎదుర్కొంటున్న పీటర్ మాండెల్సన్‌ను గతంలో అమెరికాకు బ్రిటన్ రాయబారిగా నియమించినందుకుగాను ఆయన పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. ఎప్‌స్టీన్ బాధితులకు జరిగిన అన్యాయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన ఈ క్షమాపణలు తెలిపారు.అమెరికాలో బ్రిటన్ రాయబారి వంటి అత్యంత కీలకమైన పదవిని పీటర్ మాండెల్సన్‌కు కట్టబెట్టడం అప్పట్లో పెద్ద చర్చకు దారితీసింది. అయితే మాండెల్సన్ తనవద్ద అబద్ధాలు చెప్పి ఆ పదవిని దక్కించుకున్నారని ప్రధాని కీర్ స్టార్మర్ ఆరోపించారు. జెఫ్రీ ఎప్‌స్టీన్ తనకు అంతగా పరిచయం లేని వ్యక్తి అని, అతనితో ఎలాంటి లోతైన సంబంధాలు లేవని మాండెల్సన్ నమ్మించారని ప్రధాని వెల్లడించారు. ఆయన మాటలను నమ్మి చేసిన నియామకం ఇప్పుడు ప్రభుత్వానికి తలవంపులు తెచ్చిందని స్టార్మర్ అంగీకరించారు.పీటర్ మాండెల్సన్ 2024 డిసెంబరులో రాయబారిగా బాధ్యతలు చేపట్టారు. అయితే 2008లోనే ఎప్‌స్టీన్ లైంగిక నేరాల కేసులో దోషిగా తేలినప్పటికీ.. మాండెల్సన్ ఆయనతో స్నేహాన్ని కొనసాగించినట్లు కొన్ని ఈమెయిల్స్, మరికొన్ని పత్రాలు బయటకు వచ్చాయి. ఇలా వీరిద్దరి మధ్య ఉన్న సంబంధంలోని చీకటి కోణాలు వెలుగులోకి రావడంతో స్టార్మర్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెరిగింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే గతేడాది సెప్టెంబరులో ప్రధాని కీర్ స్టార్మర్ పీటర్ మాండెల్సన్‌ను పదవి నుంచి తొలగించారు.అమెరికా ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన మరిన్ని పత్రాలు మాండెల్సన్ చుట్టూ ఉచ్చును మరింత బిగించాయి. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభం సమయంలో బ్రిటన్ ప్రభుత్వానికి సంబంధించిన కొన్ని అత్యంత సున్నితమైన సమాచారాన్ని మాండెల్సన్ ఎప్‌స్టీన్‌తో పంచుకున్నట్లు ఈ పత్రాలు తెలుపుతున్నాయి. దేశ ప్రయోజనాలకు భంగం కలిగించేలా ఒక లైంగిక నేరగాడితో సమాచారాన్ని పంచుకోవడం బ్రిటన్ రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. కేవలం స్నేహం మాత్రమే కాకుండా.. వీరి మధ్య ఆర్థిక లావాదేవీలు కూడా జరిగినట్లు ఆధారాలు లభ్యం అయ్యాయి.2003-2004 మధ్యకాలంలో పీటర్ మాండెల్సన్, ఆయన భాగస్వామి రీనాల్డో అవిలా ద సిల్వాకు సంబంధించిన బ్యాంకు ఖాతాలకు ఎప్‌స్టీన్ సుమారు 75 వేల డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ. 63 లక్షలకు పైగా) మేర చెల్లింపులు చేశాడని వెల్లడి అయింది. ఇంతటి నేర చరిత్ర ఉన్న వ్యక్తితో ఆర్థిక సంబంధాలు కలిగి ఉండి కూడా, రాయబారిగా కొనసాగడం బాధితులను మరింత ఆవేదనకు గురిచేసిందని ప్రధాని పేర్కొన్నారు.ఎప్‌స్టీన్ ఫైళ్లలో విడుదలైన నగ్న ఫోటోలు, వీడియోలు బ్లర్ చేయకుండా చాలా రోజులుగా ఆన్‌లైన్‌లో ఉన్నాయి.

# అఫెన్స్ మూడ్ లోకి కల్తీ నెయ్యి...

విజయవాడ,ఫిబ్రవరి 8(భారత శక్తి) :

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత కొద్దిరోజులుగా ప్రకంపనలు సృష్టిస్తున్న కల్తీ నెయ్యి వ్యవహారం, అనూహ్యంగా అధికార కూటమి పార్టీల మధ్య సరికొత్త ఐక్యతకు పునాది వేసింది. విపక్షాల విమర్శలు, సాంకేతిక అంశాల నడుమ కొంత డిఫెన్స్ ధోరణిలో ఉన్నట్లు కనిపించిన టీడీపీ, జనసేన, బీజేపీలు ఇప్పుడు ఎదురుదాడికి సిద్ధమయ్యాయి. తిరుమల లడ్డూ ప్రసాదం నెయ్యి కల్తీ వ్యవహారం ఇప్పుడు కేవలం ఒక ఆధ్యాత్మిక భావోద్వేగ అంశంగానే కాకుండా, రాజకీయ అస్తిత్వ పోరాటంగా మారింది. ఆరంభంలో ఈ విషయంలో కొంత తడబడినట్లు కనిపించిన అధికార కూటమి, ఇప్పుడు పూర్తిస్థాయి అప్రమత్తతతో విపక్షాలకు చెక్ పెట్టేందుకు సిద్ధమైంది.కల్తీ నెయ్యి అంశంలో సిట్ విచారణ, సుప్రీంకోర్టు వ్యాఖ్యలు, సీబీఐ ప్రమేయం వంటి అంశాలను అస్త్రాలుగా చేసుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దూకుడు పెంచింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలంటూ వైసీపీ చేస్తున్న డిమాండ్లు ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకట్ట వేయాలని కూటమి నిర్ణయించింది. కేవలం ప్రభుత్వపరంగానే కాకుండా, రాజకీయంగా కూడా గట్టి సమాధానం ఇవ్వకపోతే తప్పుడు సంకేతాలు వెళ్తాయని గ్రహించిన కూటమి నేతలు, గురువారం ఉమ్మడిగా మీడియా ముందుకు రావడం ఒక కీలక మలుపు.వైసీపీ చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు మూడు పార్టీల ప్రతినిధులతో కూడిన ఒక అంతర్గత సమన్వయ కమిటీని ఏర్పాటు చేయడం ఈ వ్యూహంలో అత్యంత కీలకమైన భాగం. క్షేత్రస్థాయిలో ప్రజలకు కల్తీ జరిగిన తీరును, గత ప్రభుత్వ హయాంలో జరిగిన టెండర్ల ప్రక్రియను వివరించాలని నిర్ణయించాయి. సిట్ విచారణలో వెల్లడవుతున్న కీలక అంశాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందుకు తీసుకురావాలని, సోషల్ మీడియాలో విపక్షాలు చేస్తున్న నెగటివ్ ప్రచారాన్ని మూడు పార్టీల ఐటీ విభాగాలు సమన్వయంతో తిప్పికొట్టాలని తీర్మానించాయి.ఈ అంశంలో పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్ష హిందూ ధర్మ పరిరక్షణ కోణంలో ప్రజల్లోకి బలంగా వెళ్లింది. దీనికి బీజేపీ జాతీయ స్థాయి మద్దతు కూడా తోడవడంతో, కూటమి మధ్య సైద్ధాంతిక సారూప్యత మరింత పెరిగింది. చంద్రబాబు అనుభవం, పవన్ కల్యాణ్ భావోద్వేగ సందేశం, బీజేపీ జాతీయ అండదండలు కలగలిసి వైసీపీని రాజకీయంగా ఇరకాటంలోకి నెట్టేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి.సాధారణంగా కూటమి ప్రభుత్వాల్లో పార్టీల మధ్య చిన్నపాటి భేదాభిప్రాయాలు సహజం. కానీ, ఈ నెయ్యి కల్తీ వ్యవహారం ఆ గ్యాప్‌ను పూడ్చేందుకు ఉపయోగపడింది. విచారణ సంస్థల క్లీన్ చిట్ రాకముందే వైసీపీ హడావుడి చేస్తోందని, దీన్ని ఎదుర్కోవడంలో డైలమా వీడిపోయిందని స్పష్టమవుతోంది. ప్రభుత్వ గొంతు కంటే కూటమి గొంతు బలంగా వినిపిస్తేనే ఫలితం ఉంటుందని గుర్తించడం కూటమి పరిణతికి నిదర్శనం.మొత్తానికి, వైసీపీ విసిరిన సవాల్‌ను కూటమి పార్టీలు తమకు అనుకూలంగా మార్చుకున్నాయి. ఈ ఉమ్మడి పోరాటం కేవలం కల్తీ నెయ్యి అంశానికే పరిమితం కాకుండా, భవిష్యత్తులో ఇతర పాలనాపరమైన సవాళ్లను ఎదుర్కోవడానికి కూడా ఒక నమూనాగా మారే అవకాశం ఉంది. సమన్వయం మెరుగుపడడం వల్ల ఏపీ రాజకీయాల్లో కూటమి మరింత బలోపేతం కానుంది.ఢిల్లీలోని అరిస్టో కెమికల్స్ నుంచి భోలేబాబా డెయిరీ డైరెక్టర్లు దాదాపు 8,900 కిలోల లాక్టిక్ యాసిడ్, లబ్సాను కొనుగోలు చేసినట్లు ఆధారాలు దొరికాయి. పామాయిల్, పామ్ కెర్నెల్ ఆయిల్ వంటి చౌకరకం నూనెలకు ఈ రసాయనాలను కలిపితే, అవి అచ్చం నెయ్యికి ఉండే రంగు, రుచి, వాసనను



సంతరించుకుంటాయి. ల్యాబ్ పరీక్షల్లో కూడా ఇది నెయ్యి అని నమ్మించేలా చేసేందుకు బీటా-కెరోటిన్ , ఎసిటిక్ యాసిడ్ ఈస్టర్ వంటి మిశ్రమాలను కూడా జోడించారు. దాదాపు 57.56 లక్షల కిలోల నూనెను ఇలా రసాయనాలతో కల్తీ చేసి తితిదేకు (తిరుమల తిరుపతి దేవస్థానం) నెయ్యి పేరుతో అంటగట్టారు ఆహార భద్రతా చట్టం ప్రకారం పాలు, నెయ్యి వంటి ఉత్పత్తుల్లో లబ్సా వాడటం పూర్తిగా నిషేధం. ఈ రసాయనం కలిసిన పదార్థాలను తీసుకుంటే జీర్ణాశయం దెబ్బతినడం, పేగులకు గాయాలవ్వడం, కాలేయ వ్యాధులు తలెత్తుతాయి. దీర్ఘకాలంలో ఇది క్యాన్సర్‌కు కూడా దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒక డెయిరీకి వేల కిలోల క్లీనింగ్ రసాయనాలు ఎందుకనే కోణంలో దర్యాప్తు చేసిన సిట్, కల్తీ నెయ్యి తయారీ కోసమే వీటిని వాడినట్లు స్పష్టం చేసింది.

==============

# డ్రైవింగ్ లైసెన్స్ లో ఆటోమెటిక్ ట్రాకింగ్

విజయవాడ, ఫిబ్రవరి 8(భారత శక్తి) :

ఏపీలో వాహనదారులకు బిగ్ అలర్ట్.. డ్రైవింగ్ లైసెన్సులు పొందటం ఇకపై అంత సులభం కాకపోవచ్చు. ఎందుకంటే ఏపీలో కొత్తగా నాలుగు ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ విధానంలో డ్రైవింగ్ లైసెన్స్ పొందడం అంత వీజీ కాదు. ఈ ట్రాకుల ఏర్పాటు కోసం ఏపీ ప్రభుత్వం మారుతి సుజుకీ ఇండియా మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం ఏపీలో నాలుగుచోట్ల మారుతీ సుజుకీ ఇండియా ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులు ఏర్పాటు చేయనుంది.ఆంధ్రప్రదేశ్‌లో వాహనదారులకు ముఖ్య గమనిక. ఏపీలో ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులు అందుబాటులోకి రానున్నాయి. మారుతీ సుజుకి ఇండియా.. ఏపీ ప్రభుత్వం కలిసి ఏపీలో నాలుగు ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులు ఏర్పాటు చేయనున్నారు. ఏలూరు, ఒంగోలు, విజయనగరం, అనకాపల్లి జిల్లాలలోని ఆర్టీవో కార్యాలయాల వద్ద ఈ ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేయనున్నారు. మారుతి సుజుకీ ఇండియా ఈ ట్రాకులను మూడేళ్లపాటు నిర్వహించనుంది. డ్రైవింగ్ మీద మంచి పట్టు వారే డ్రైవింగ్ లైసెన్సులు పొందేలా.. ఈ విధానం తీసుకువస్తున్నారు. దీంతో రాష్ట్రవ్యా?ప్తంగా రహదారి భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని భావిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా నాలుగు ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టు ట్రాకులు ఏర్పాటు, నిర్వహణ కోసం ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు మారుతి సుజుకీ ఇండియా శుక్రవారం ప్రకటించింది. ఏలూరు, విజయనగరం, ఒంగోలు, అనకాపల్లిలోని రీజినల్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసుల వద్ద వీటిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులను అందుబాటులోకి తెచ్చిన నాటి నుంచి మూడేళ్ల



పాటు.. ఈ ట్రాకులకు కావాల్సిన ఆటోమేషన్, నిర్వహణ చూసేలాఏపీ ప్రభుత్వం మారుతి సుజుకీ ఇండియా మధ్య ఒప్పందం కుదిరింది. మరోవైపు ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులలో మానవ ప్రమేయం ఉండదు. నైపుణ్యం కలిగిన వ్యక్తులే డ్రైవింగ్ లైసెన్సులు పొందేలా ఈ విధానం అమల్లోకి తెస్తున్నారు.మరోవైపు ఈ నాలుగు ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులు ద్వారా లైట్ మోటార్ వెహికల్స్, టూవీలర్లకు డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేయనున్నారు. మరోవైపు ఒంగోలులో ఏర్పాటు చేసే ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ వద్ద హెవీ మోటార్ వాహనాలకు కూడా లైసెన్సులు జారీ చేయనున్నారు. మరోవైపు విశాఖపట్నంలో ఇప్పటికే ఇలాంటి ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ అందుబాటులోకి వచ్చింది. గంభీరమ్ వద్ద ఇలాంటి ట్రాక్ ఏర్పాటు చేశారు.ఈ విధానంలో సెన్సార్ల ద్వారా ఎలక్ట్రానిక్ విధానంలో డ్రైవింగ్ మీద పర్యవేక్షణ ఉంటుంది. ట్రాక్ మొత్తం సెన్సార్లు ఏర్పాటు చేస్తారు. ఈ సెన్సార్లు వాహనం ప్రతి కదలికను పసిగడుతూ ఉంటాయి. ఏ మాత్రం తడబడినా పసిగట్టేస్తున్నాయి. దీంతో ఏ చిన్న తప్పు చేసినా డ్రైవింగ్ టెస్ట్ ఫెయిల్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. దీంతో డ్రైవింగ్ బాగా నేర్చుకున్నవారికే లైసెన్సులు వచ్చే అవకాశాలు ఉంటాయి.

# హిందు ధర్మాన్ని భూజాన ఎత్తుకున్న టీడీపీ

కర్నూలు ఫిబ్రవరి 8(భారత శక్తి) :

భారతీయ జనతా పార్టీతో సుదీర్ఘకాలం ప్రయాణిస్తూ వస్తోంది తెలుగుదేశం పార్టీ. అయితే ఎన్నడూ హిందుత్వ వాదాన్ని తెలుగుదేశం పార్టీ తెర ముందుకు తేలేదు. చంద్రబాబు సైతం ఎన్నడు మాట్లాడిన దాఖలాలు లేవు. తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నడూ కూడా హిందుత్వవాదంపై మొగ్గు చూపలేదు. కానీ ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని డిఫెన్స్ లో పడేయడానికి హిందూ ధర్మాన్ని భుజానికి ఎత్తుకున్నారు చంద్రబాబు. ఇది చంద్రబాబులో స్పష్టమైన మార్పు అని విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు. ఇంకోవైపు తిరుమల ఏడుకొండల వాడి ప్రతిష్టను తగ్గించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుట్ర పన్నిందని కొత్త నినాదాన్ని అందుకున్నారు చంద్రబాబు. ఏపీలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా తిరుమల వెంకటేశ్వర స్వామికి కోట్లాదిమంది భక్తులు ఉన్నారు. ఇది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరింత ఇబ్బంది కలిగించే విషయమే.అయితే ఏపీలో కూటమి ఐక్యత లేకుండా పోతేనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అవకాశం దక్కుతుందని విజయసాయి రెడ్డి లాంటి వారు కూడా వ్యాఖ్యానించారు. కానీ ఎప్పుడైతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అటాక్ చేయడం ప్రారంభించిందో.. ఆ మూడు పార్టీల మధ్య బంధం మరింతగా పెరిగింది. ఈ రెండేళ్లలో తొలిసారి కూటమి నేతలు ఒకే వేదిక పైకి వచ్చారు. తిరుమల లడ్డు వివాదాన్ని తెరపైకి తీసుకురావడం తమకు కలిసి వచ్చే అంశంగా భావిస్తున్నారు. కూటమి ఐక్యత ఒకవైపు.. హిందుత్వవాదం ఇంకోవైపు.. గోవిందుడి పైనే కుట్రగా అభివర్ణించడం ద్వారా ఓటు బ్యాంకు ఏకీకరణ మరోవైపు అన్నది వ్యూహంగా కనిపిస్తోంది.ఆంధ్రప్రదేశ్ కు సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా వ్యవహరించారు చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రానికి 9 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ కు తొలి సీఎంగా కూడా ఆయన వ్యవహరించారు. ఇప్పుడు రెండోసారి కూడా ఆయనే బాధ్యతలు చేపట్టారు. మరోవైపు తెలుగుదేశం పార్టీకి సుదీర్ఘకాలం అధ్యక్షుడిగా, రాష్ట్ర ప్రతిపక్ష నేతగా, జాతీయస్థాయిలో సంకీర్ణ ప్రభుత్వాల సారథిగా కూడా వ్యవహరించారు. కానీ ఏ రోజు కూడా ఆయన హిందుత్వ వాదాన్ని తెరపైకి తేలేదు. జగన్మోహన్ రెడ్డి అవినీతి, వివేకానంద రెడ్డి హత్య వంటి అంశాలను ఎక్కువగా ప్రస్తావించేవారు. కానీ ఇప్పుడు తిరుమల వెంకన్న ప్రస్తావన తీసుకురావడం వెనుక ప్రత్యేక వ్యూహం ఉన్నట్లు అర్థమవుతుంది. చూడాలి మరి ఇది ఎంతవరకు వర్కౌట్ అవుతుందో..

## తెలంగాణ లో మున్సిపల్ ఎన్నికల్లో 75% పైగా గెలుస్తాం

షాద్ నగర్తెలంగాణలో జరగనున్న మునిసిపల్ ఎన్నికల్లో 75 శాతం పైగా గెలుస్తామని వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. షాద్ నగర్ లో అయన ఎన్నికల ప్రచారం లో పాల్గొన్నారు.సంక్షేమ మే మా అభ్యర్థులను గెలిపిస్తుందని అన్నారు. అమ్మా.. బాగున్నారా.. మా పాలన ఎలా ఉంది.. పథకాలు అందుతున్నాయా.. మీ ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉంది.. అంటూ మంత్రి ఓటర్లను పలకరించారు. 14వ వార్డు అభ్యర్థి అందెమోహన్ తరపున ఇంటింటి ప్రచారానికి వచ్చిన ఆయన స్థానిక భవాని మాత ఆలయం వద్ద రచ్చబండ ఏర్పాటు చేసి మహిళలతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పలువీధుల్లో తిరిగి కాంగ్రెస్ పాలన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. తమ అభ్యర్థి అందెమోహన్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం విలేకర్ల సమావేశం లో మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో 75% పైగా గెలుస్తుందని అన్నారు. ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తుందన్నారు. సీఎం పని తీరుతో ప్రజలు సంతృప్తి గా ఉన్నారన్నారు.

# తిరుపతిలో స్పేస్ సిటీ

తిరుపతి, ఫిబ్రవరి 8(భారత శక్తి) :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు త్వరలోనే ప్రారంభం కానుంది. తిరుపతిలో స్పేస్ సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ వద్ద 2800 ఎకరాలలో దీనిని ఏర్పాటు చేయనున్నారు. అయితే స్పేస్ సిటీ ప్రాజెక్టు తొలి విడత ప్రారంభానికి రంగం సిద్ధమైంది. మరో రెండు నెలల్లో తొలివిడతను ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. తొలి విడతలో 570 ఎకరాలలో కోర్ ఇండస్ట్రియల్ యాక్టివిటీస్ మొదలు పెడతారు. ఈ ప్రాజెక్టుతో తిరుపతి జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందని అధికారులు చెప్తున్నారు,.ఏపీలో మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ప్రారంభానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో స్పేస్ సిటీ ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో స్పేస్ సిటీ ప్రాజెక్టు తొలి విడతను త్వరలోనే ఏపీ ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు తెలిసింది. తిరుపతిలో 2800 ఎకరాలలో స్పేస్ సిటీ ప్రాజెక్టు చేపడుతున్నారు. మరో రెండు నెలలలో ఈ ప్రాజెక్టు తొలి విడతను చేపట్టాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. రీసెర్చ్, శాటిలైట్ మ్యానుఫ్యాక్చరింగ్, ఏరోస్పే?స్ టెక్నాలజీ హబ్‌గా ఈ స్పేస్ సిటీని తీర్చిదిద్దాలని ప్రణాళికలు రచిస్తున్నారు.తిరుపతి జిల్లాలోని బుచ్చినాయుడు కండ్రిగ ప్రాంతంలో ఈ మెగా స్పేస్ సిటీ ప్రాజెక్టు చేపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఈ ప్రాజెక్టు చేపడుతున్నారు. స్పేస్ సిటీ ప్రాజెక్టు మొదటి దశలో 570 ఎకరాలలో 140 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో కోర్ ఇండస్ట్రియల్ యాక్టివిటీస్ మొదలు పెడతారు. మిగతా భూమిని రెసిడెన్సియల్ జోన్లు, ఇన్‌స్టి?ట్యూషనల్ క్యాంపస్, లాజిస్టిక్ పార్కులు, అంతర్గత రహదారుల అభివృద్ధి , హైస్పీడ్ ఇంటర్నెట్, కరెంట్, తాగునీటి సరఫరా వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ఉపయోగిస్తారు.మరోవైపు స్పేస్ సిటీలో ఉపగ్రహల అసెంబ్లింగ్, ఇంటిగ్రేషన్ యూనిట్లు, టెస్టింగ్,క్యాలిబరేషన్ ల్యాబులు, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెంటర్లు వంటివి ఏర్పాటు చేయనున్నాయి. అలాగే స్పేస్ టెక్నాలజీ స్టార్టప్‌ల కోసం ఇంక్యుబేషన్ హబ్స్, డేటా అనలిటిక్స్, డిఫెన్స్ అప్లికేషన్స్, అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్స్ వంటివి అందుబాటులో ఉండనున్నాయి. మరోవైపు స్పేస్ సిటీ నిర్మాణం కోసం ఈ ప్రాంతాన్ని కూడా వ్యూహాత్మకంగా ఎంచుకున్నారు. సమీపంలోనే సతీష్ ధావన్ స్పేస్ సెంటర్, శ్రీహరికోట ఉండటం, తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం దగ్గరలో ఉండటం, జాతీయ రహదారులు, పోర్టులకు సమీపంలో ఉండటం కూడా కలిసి వస్తోంది.

ఈ స్పేస్ సిటీ ప్రాజెక్టు ద్వారా ప్రైవేట్ పెట్టుబడులను పెద్దఎత్తున ఆకర్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రాబోయే రోజులలో స్పేస్ సిటీ ద్వారా 25 వేలకోట్ల రూపాయల పెట్టుబడులను స్పేస్ రంగంలో రాబట్టాలని ప్రణాళికలు రచిస్తోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అధికారులు చెప్తున్నారు.స్పేస్ సిటీ ప్రాజెక్టు ద్వారా ఇంజనీర్లు, సైంటిస్టులు, టెక్నీషియన్లు, డేటా స్పెషలిస్టులు, మిగతా అనుబంధ రంగాల వారికి ఉద్యోగాలు లభిస్తాయని చెప్తున్నారు. మరోవైపు స్పేస్ సిటీ ప్రాజెక్టుకు సంబంధించి ప్రాథమిక సర్వేలు, పర్యావరణ అంచనాలు, స్థానికులతో చర్చలు పూర్తి అయ్యాయి. ఈ నేపథ్యంలో మరో రెండు నెలలలో స్పేస్ సిటీ తొలివిడత ప్రారంభిస్తారని సమాచారం.

===============

# కాపు కాస్తామంటున్న వైసీపీ

## సామాజిక లెక్కల్లో జగన్ టీమ్

గుంటూరు, ఫిబ్రవరి 8(భారత శక్తి) :

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కొత్త రాజకీయ దారులను వెతుకుతున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆయన ఆలోచనలు సాధారణ విశ్లేషణలకు భిన్నంగా ఉంటాయని, ఓటమి తర్వాత మరింత జాగ్రత్తగా వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నారని అనుచరులు అంటున్నారు. రాజకీయాల్లో ఓడిన చోటే తిరిగి బలం పెంచుకోవడం ఒక సంప్రదాయం. జగన్ కూడా అదే మార్గాన్ని ఎంచుకుని, పాత పద్ధతులకు బదులుగా కొత్త వ్యూహాలపై నమ్మకం పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. వైసీపీ ఓటమికి కారణమైన రాజకీయ, సామాజిక పరిణామాలను ఆయన లోతుగా అధ్యయనం చేస్తున్నారని ఇటీవల ఆయన ప్రసంగాలు సూచిస్తున్నాయి. ఈ వ్యూహాల్లో మాజీ మంత్రి అంబటి రాంబాబు) పాత్ర కీలకంగా మారుతోంది. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నప్పటికీ ఆయనకు మంత్రి పదవి దక్కేందుకు మూడున్నర దశాబ్దాలు పట్టింది. వైఎస్సార్ అనుచరుడిగా కాంగ్రెస్‌లో పనిచేసినా, ఉమ్మడి ఏపీలో ఎమ్మెల్యేగా గెలవలేకపోవడం ఆయన రాజకీయ ప్రయాణాన్ని నెమ్మదింపజేసింది. అయితే వైసీపీ ఏర్పడ్డాక జగన్ ఆయనకు ప్రాధాన్యత ఇచ్చారు. 2022లో మంత్రి పదవి ఇవ్వడమే కాకుండా, తాజాగా కాపులలో "టైగర్" అంటూ బిరుదు ఇచ్చి ముందుకు తెచ్చారు. జగన్ రాజకీయ లెక్కల్లో కాపు సామాజిక వర్గం ముఖ్యంగా కనిపిస్తోంది. 2019 ఎన్నికల్లో వైసీపీ గెలుపులో వారి మద్దతు కీలకంగా నిలిచింది. అప్పట్లో ముద్రగడ పద్మనాభం (ఉద్యమం కూడా కలిసివచ్చి, గోదావరి జిల్లాలు ( వైసీపీకి బలంగా మారాయి. కానీ 2024 నాటికి పరిస్థితి పూర్తిగా మారింది. పవన్ కళ్యాణ్ రూపంలో కాపులకు బలమైన నాయకుడు రావడం, ఆయన చంద్రబాబు నాయుడు తో జట్టు కట్టడం వల్ల రాజకీయ సమీకరణలు తారుమారు అయ్యాయి. ఈ మార్పుతో వైసీపీకి ఎదురుదెబ్బ తగిలింది. ఈ నేపథ్యంలో అంబటి రాంబాబు ఘటనను జగన్ వ్యూహాత్మకంగా ఉపయోగించుకుంటున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. అంబటి కుమార్తె మౌనిక మీడియాతో మాట్లాడుతూ తమపై అధికార దుర్వినియోగం జరుగుతోందని ప్రశ్నించడం కాపు వర్గాల్లో చర్చకు దారి తీసింది. జనసేన మద్దతుతో అధికారంలోకి వచ్చిన టీడీపీ ) తమపైనే బలప్రయోగం చేస్తుందా అనే సందేహాన్ని ఆమె వ్యక్తం చేశారు. ఇది నేరుగా రాజకీయ నేతలకు కాకపోయినా, కాపు సమాజంలో భావోద్వేగాలను రేకెత్తించడానికే అన్న విశ్లేషణ ఉంది. గుంటూరు జిల్లా లో జగన్ పర్యటన సమయంలో కాపు జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో స్పందన కనిపించిందని అంటున్నారు. అంబటి రాంబాబు భవిష్యత్తులో తన సామాజిక వర్గాన్ని ఎంతవరకు పోలరైజ్ చేయగలుగుతారన్నది కీలక ప్రశ్నగా మారింది. వంగవీటి రంగా అనుచరుడిగా గతంలో కాపునాడు కార్యక్రమాల్లో పనిచేసిన నేపథ్యం ఆయనకు ఉంది. ఇప్పుడు వైసీపీ ఆయనను ముందుకు తెస్తూ కొత్త గుర్తింపునివ్వాలని చూస్తోంది. అంబటి విడుదల తర్వాత ఆయనకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలన్న ఆలోచన కూడా పార్టీ వర్గాల్లో ఉంది. కూటమి వర్సెస్ అంబటి అంశం రాబోయే రోజుల్లో మరింత వేడెక్కే అవకాశముంది. ఈ మొత్తం వ్యవహారంలో జగన్ వేసిన అడుగు వ్యూహాత్మకమా కాదా అన్నది రాజకీయ ఫలితాలే తేల్చాలి.

అంబాసిడర్ స్థాయికి అంబటి

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రమోషన్ పొందాలన్నా..



పదవులు దక్కించుకోవాలని అనుకున్నా ప్రత్యర్థి పార్టీల నాయకుల మీద బూతులతో విరుచుకుపడాలి. ఆయా పార్టీల నేతల ఇళ్లపై కర్రలతో దాడులకు దిగాలి. లేకుంటే నిత్యం జగన్మోహన్ రెడ్డికి వీర విధేయుడుగా ఉంటూ ఆయన నామస్మరణ చేయాలి. ఆయన అడుగులకు మడుగులు వత్తాలి. అప్పుడే వారికి పదవులు లభిస్తాయి. పిలిచి మరి పదవులు కట్టబెడతారు. వైయస్సార్ కాంగ్రెస్ ఐదేళ్ల హయాంలో జరిగింది కూడా అదే. ఏదైనా మంత్రి పదవి నిర్వర్తిస్తే వారి శాఖలో ప్రగతి చూస్తారు. కానీ వైసీపీ హయాంలో శాఖల ప్రగతి కంటే ప్రత్యర్థులపై బూతులతో విరుచుకుపడే మంత్రులే అధికం. కొడాలి నాని కి తొలి మూడేళ్లు పదవి ఇచ్చారు జగన్. చంద్రబాబుతో పాటు లోకేష్ పై విరుచుకు పడనిదే పొద్దు గడవదు అన్నట్టు ఉండేది కొడాలి నాని పరిస్థితి. ఆ స్థాయిలో జగన్మోహన్ రెడ్డిని మెప్పించారు కనుక కొడాలి నానికి మంత్రి పదవి దక్కింది. ఏకంగా పౌరసరఫరాల శాఖ మంత్రిగా అవకాశం కల్పించారు. అంతెందుకు జోగి రమేష్ విషయంలో కూడా అదే జరిగింది. ఆయన చంద్రబాబు ఇంటి మీదకు కర్రలతో దాడికి తెగబడినందుకే జోగి రమేష్ కు ఏకంగా గృహ నిర్మాణ శాఖ మంత్రిగా క్యాబినెట్ లో చోటు కల్పించారు జగన్మోహన్ రెడ్డి. సొంత సామాజిక వర్గాన్ని జగన్ కోసం కించపరిచారు పేర్ని నాని ఇక అంబటి రాంబాబు గురించి చెప్పనవసరం లేదు. అప్పటికీ ఇప్పటికీ ఆయన నోరు అదుపులోకి రావడం లేదు. పోసాని కృష్ణ మురళి అయితే పవన్ కళ్యాణ్ తో పాటు ఆయన కుటుంబాన్ని నీచాతి నీచంగా దూషించారు. ఏకంగా ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కించుకున్నారు. ఇక రోజా గురించి చెప్పనవసరం లేదు. రోజా గురించి చెప్పనవసరం లేదు. బూతు సైగలతో,, చిల్లర మాటలతో ప్రత్యర్థులను రెచ్చగొట్టేవారు. రెచ్చిపోయేవారు. అందుకు ఆమె పర్యాటక శాఖ మంత్రి పదవి పొందారు. ఇలా జగన్ కోసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో రాజకీయ హద్దులు చెరిపేసి దిగజారి ప్రవర్తించిన ప్రతి ఒక్కరికి పదవులు దక్కాయి. ఇప్పుడు అంబటి రాంబాబుకు ఏ స్థాయిలో ప్రమోషన్ దక్కుతుందో చూడాలి.

# కేడర్ లో కనిపించని జోష్

## దాడులు జరిగిన చోటే కనపిస్తారా

విజయవాడ, గుంటూరు, ఫిబ్రవరి 8(భారత శక్తి) :

వైసీపీ అధినేత వైఎస్ జగన్ కేవలం పరామర్శలకు మాత్రమే పరిమితమవుతున్నారు. ఇప్పటికే రెండేళ్ల కాలం పూర్తయింది. దీంతో పరామర్శలు ఆపేసి పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు. వైసీపీ గత ఎన్నికల్లో కేవలం పదకొండు నియోజకవర్గాల్లోనే గెలిచింది. మిగిలిన 164 నియోజకవర్గాల్లో పార్టీ ఆశించినంత మాత్రం బాగా లేదు. అక్కడ క్యాడర్ కు, నేతలకు మధ్య గ్యాప్ పెరిగింది. రెండేళ్లవుతున్నా నేతలు కొందరు కార్యకర్తలను దగ్గరకు తీసుకోవడం లేదు. దీంతో జగన్ జిల్లాల పర్యటన చేయాలంటున్నారు. పాదయాత్ర సంగతి తర్వాత.. అది ఏడాదిన్నర తర్వాత కాని మొదలు కాదు. కానీ ఈలోపు పార్టీలోని క్యాడర్ ను, లీడర్ ను యాక్టివ్ చేయాలంటే ఖచ్చితంగా జిల్లాలకు వెళ్లి నియోజకవర్గాల వారీగా సమీక్షలు చేయాలని నేతలు కోరుతున్నారు. ఇప్పటికీ రాయలసీమలోని ఒకటి రెండు జిల్లాలు మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో పార్టీ యాక్టివ్ గా లేదు. జగన్ బయటకు వచ్చినప్పుడు మాత్రం కార్యకర్తలు అభిమానంతో వచ్చి జగన్ కు స్వాగతం చెబుతున్నారు. జగన్ ను చూసేందుకు పోటీ పడుతున్నారు. కానీ చాలా నియోజకవర్గాల్లో పరిస్థితి మాత్రం ఇంకా మెరుగుపడలేదన్నది చాలా మంది బహిరంగంగానే చెబుతున్నారు. పార్టీ పదవులను పూర్తిగా చేపట్టలేదు. బూత్ లెవెల్ కమిటీల నియామకం చాలా చోట్ల జరగకపోవడాన్ని కూడా గుర్తు చేస్తున్నారు. పాత నేతలే తిరిగి పోటీ చేస్తారన్న భావనతో కొత్త వారు నియోజకవర్గంలో నాయకత్వ బాధ్యతలను చేపట్టేందుకు ముందుకు రావడం లేదని గట్టిగా పార్టీ నేతలే విమర్శిస్తున్నారు. ద్వితీయ శ్రేణి నేతలు కొంత గట్టిగానే ఉన్నప్పటికీ నియోజకవర్గ స్థాయి నేతలు మాత్రం అప్పుడే ఎందుకన్నట్లు కొంత ఇంకా ఆలోచనలో ఉన్నారు. జగన్ పాదయాత్ర సమయానికి బయటకు వచ్చి యాక్టివ్ అయితే బాగుంటుందని వారి వ్యాపారాలు, మిగిలిన వ్యక్తిగత వ్యవహారాల్లో మునిగిపోయారు. 175 నియోజకవర్గాల్లో 2019 ఎన్నికల్లో గెలిచిన 151 మందిలో పది నుంచి పదిహేను మందికి మించి యాక్టివ్ గా లేరు. ఇది నిజం. పరామర్శ చేయవచ్చు. తప్పులేదు. కానీ అదే సమయంలో జగన్ జిల్లాలకు వచ్చి కార్యకర్తలతో ముఖాముఖి సమావేశాలను ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎక్కువగా వినపడుతుంది. అప్పుడే వచ్చే ఎన్నికలకు కానీ, స్థానిక సంస్థల ఎన్నికల సమాయానికి కానీ పార్టీ పుంజుకోదని అంటున్నారు. కానీ జగన్ మాత్రం ఇప్పట్లో జిల్లాల పర్యటన చేసే అవకాశాలు కనిపించడం లేదు.

మరో వైపు పక్కా పథకం ప్రకారమే జోగి రమేష్ ఇంటిపై దాడి చేశారని వైఎస్ జగన్ అన్నారు. జోగి రమేష్ ఇంటి ఎదుట మీడియా సమావేశంలో మాట్లాడుతూ పెట్రోలు బాంబులు వేసి జోగి రమేష్ ను హత్య చేయాలని పథకం పన్నారన్నారు. జోగి రమేష్ చంద్రబాబు, లోకేశ్ పై విమర్శలు చేసినంత మాత్రాన దాడులు చేస్తారా? అని జగన్ ప్రశ్నించారు. మనం నాగరిక సమాజంలో ఉన్నామా? లేక జంగిల్ రాజ్యంలో ఉన్నామా? అని నిలదీశారు. లోకేశ్ చిప్ రిపేర్ కావాలని పూజలు చేయడంలో తప్పేంటని జగన్ అన్నారు. చంద్రబాబు ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని జగన్ హెచ్చరించారు. ఆ తర్వాత వచ్చేది తమ ప్రభుత్వమేనని, ఎవరైతే అధికారులు వీరికి సహకరించారో వారందరినీ బోనులో నిలబెడతామని తెలిపారు. ప్రతి ఒక్కరూ చేసిన అన్యాయానికి శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు. చిప్ సరిగ్గా ఉంటే ఎవరైనా ఇలాంటివి ఎవరైనా చేయిస్తారా? అని జగన్ ప్రశ్నించారు. తిరుమల లడ్డూలో గొడ్డుమాంసం, జంతు కొవ్వు లేదని చెప్పినా ఇంకా రాజకీయ స్వలాభం కోసం ఆయన కూటమిలో ఉన్న పవన్ కల్యాణ్ అదే పనిగా అబద్ధాలను నిజం చేస్తున్నారని జగన్ అన్నారు. లడ్డూలో జంతుకొవ్వు కలిసిందని చంద్రబాబుకు ఎవరు చెప్పారని జగన్ ప్రశ్నించారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐ సిట్ దర్యాప్తు చేసిందని, అందులో కొవ్వు లేదని, తమ పార్టీకి చెందిన ఎవరి పేర్లను లేవని తెలిసినా చంద్రబాబు పదే పదే జంతువుల కొవ్వు కలిసిందంటూ అబద్ధాలు ప్రచారం చేస్తూ ఏడుకొండల వాడికి అపచారం చేస్తున్నారని జగన్ దుయ్య బట్టారు. చంద్రబాబు వేసిన వన్ మ్యాన్ కమిషన్ చేత అబద్ధాలు నిజం చేయాలని ప్రయత్నం చేస్తున్నారు తప్ప, చంద్రబాబు ఇంకా ప్రజల్లో చులకన అవుతారని అన్నారు. సీబీఐ ఇచ్చిన రిపోర్టు అనుకూలంగా రాకపోతే.. అనుకూలంగా నివేదిక కోసం కమిషన్ వేసేందుకు చంద్రబాబు ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అనిల్ సింఘాల్ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు టీటీడీ ఈవోగా ఉన్నాడని తెలిపారు. తాము ఆయనను ఈవోగా కొనసాగించామని చెప్పారు. మరి అదే అనిల్ సింఘాల్ ను ఎందుకు తొలగించారని అన్నారు. శ్యామలరావును నియమించిన చంద్రబాబు మళ్లీ ఆయనను ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వంలోనే ఈ పాపం జరిగిందని, పాపం చేసిందెవరు? అని జగన్ ప్రశ్నించారు.

# 15 రోజుల్లోనే 800 మందికిపైగా మిస్సింగ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8(భారత శక్తి) :

ఢిల్లీలో మిస్సింగ్ కేసులు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ ఏడాది మొదటి 15 రోజుల్లోనే 500మందికిపైగా మహిళలు, బాలికలు సహా 800 మది ఆచూకీ లేకుండాపోయారు. ఇవేవో ప్రతిపక్షాలు, హక్కుల సంఘాలు చేస్తున్న ఆరోపణలు కాదు. పోలీసుల రికార్డులే ఇవి చెబుతున్నాయి. జనవరి 1 నుంచి 15 మధ్య నమోదయిన మిస్సింగ్ కేసుల్లో కేవలం 235 మంది ఆచూకీ గుర్తించారు. ఇక, తప్పిపోయిన వారిలో ఎక్కువ శాతం వయోజనులే ఉన్నారు. అయితే, అదృశ్యమైనవారిలో 235 మంది ఆచూకీని పోలీసులు గుర్తించారు. మిగతా 572 మంది ఏమయ్యారో తెలియరాలేదని పోలీసుల రికార్డులు చూపుతున్నాయి. అలాగే, కనిపించకుండాపోయిన మొత్తం కేసుల్లో 191 మంది మైనర్లు ఉండటంతో బాలల భద్రతపై ఆందోళనను ఇది ఎత్తిచూపుతోంది. వీరిలో ఎక్కువ మంది బాలికలే (145 బాలికలు, 45 మది బాలురు) కావడం మరింత కలవరానికి గురిచేస్తోంది. తప్పిపోయిన మైనర్లలో ఎక్కువ మంది టీనేజర్లు ఉన్నారు. ఈ కాలంలో 169 మంది టీనేజర్లు తప్పిపోయినట్లు గుర్తించారు. వారిలో 138 మంది బాలికలు, 31 మంది బాలురు. ఈ టీనేజర్ కేసులలో దాదాపు 71 శాతం ఇప్పటికీ పరిష్కారం కాలేదని పోలీసు డేటా సూచిస్తుంది. అలాగే, 8 నుంచి 12 ఏళ్లలోపు పిల్లలు 13 మంది అదృశ్యమయ్యారు. వీరిలో ఎనిమిది మంది అబ్బాయిలు, ఐదుగురు అమ్మాయిలు ఉన్నారు. ఎనిమిదేళ్లలోపు పిల్లలు 9 మంది ఆచూకీ కానరాలేదు. వీరిలో ఆరుగురు చిన్నారులను పోలీసులు రక్షించారు. జాడలేని వ్యక్తులలో వయోజనులే అత్యధిక సంఖ్యలో ఉన్నారు. 363 మంది మహిళలు, 253 మంది పురుషులతో సహా మొత్తం 616 మంది వయోజనులు అదృశ్యమైనట్లుగా గుర్తించారు. వీరిలో 181 మంది జాడను పోలీసులు గుర్తించగా.. 435 కేసులు ఇంకా అపరిష్కృతంగా ఉన్నాయి.త

# ఈ బుడ్డోడు.. ఫ్యూచర్ భారత్

పాట్నా,ఫిబ్రవరి 8(భారత శక్తి) :

భారతీయులు ఎవరినైనా ప్రేమిస్తే గుండెల్లో స్థానం ఇస్తారు. ఆ ప్రేమ పెరిగిపోతే గుడి కూడా కట్టేస్తారు. ఇప్పుడు యువభారత్లో సంచలన ఆటగాడు వైభవ్ సూర్య వంశీ కి అభిమానులు కచ్చితంగా గుడి కడతారు. ఇందులో ఏమాత్రం అనుమానం లేదు..ఐపీఎల్ లో ఆడుతున్నప్పుడు రాజస్థాన్ జట్టు తరుపున సెంచరీ చేశాడు వైభవ్ సూర్య వంశీ. కేవలం 14 సంవత్సరాలు దాటని వయసులో అతడు ఆ ఘనత అందుకున్నాడు. ప్రపంచ స్థాయి మేటి బౌలర్లను ఓడించి సత్తా చూపించాడు. తద్వారా తను ఎంత ప్రమాదకరమైన ఆటగాడినో నిరూపించాడు.వైభవ్ సూర్య వంశి. అతడికి ఇంకా నూనూగు మీసాలు కూడా రాలేదు. తన తోటి పిల్లలు పాఠశాలల్లో పుస్తకాలతో కుస్తీ పడుతుంటే.. ఇతడేమో బ్యాట్ చేత పట్టుకొని ఆడుతున్నాడు. పాఠశాలలకు బదులుగా నెట్స్ లో తీవ్రంగా సాధన చేస్తున్నాడు. టోర్నీల పేరుతో దేశ విదేశాలు తిరుగుతున్నాడు. అతడు ఇప్పుడు ఏకంగా భారత జట్టుకు భవిష్యత్తు ఆశాకిరణం మాదిరిగా కనిపిస్తున్నాడు. ఇంగ్లాండ్ జట్టుతో జరిగిన అండర్ 19 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ లో వైభవ్ సూర్య వంశీ 175 పరుగులు చేశాడు. టీం ఇండియాను విజేతగా నిలిపాడు. అయితే ఇంతటితోనే వైభవ్ సూర్య వంశీ ఆగిపోలేదు. అనేక రికార్డులను బద్దలు కొట్టాడు. ముఖ్యంగా పాకిస్తాన్ క్రికెటర్ బాబర్ ఆజామ్ సాధించిన ఘనతను జస్ట్ పక్కన పెట్టాడు. విధ్వంసానికి పరాకాష్టగా బ్యాటింగ్ చేసి సరికొత్త చరిత్ర సృష్టించాడు.వైభవ్ సూర్య వంశీ 175 పరుగులు చేయడం ద్వారా అనేక రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. అండర్ 19 వరల్డ్ కప్ ప్లే ఆఫ్ లో తొలిసారి 150+ పరుగులు చేసిన ఆటగాడిగా వైభవ్ సూర్య వంశీ నిలిచాడు. 2014లో దుబాయ్ లో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ లో ఆస్ట్రేలియాపై వెస్టిండీస్ ఆటగాడు నికోలస్ పూరన్ 143 పరుగులు చేశాడు. 2012లో జరిగిన ఫైనల్ మ్యాచ్లో ఆస్ట్రేలియా పై భారత ఆటగాడు ఉన్ముక్త్ 111× పరుగులు చేశాడు. 2002 లో ఇంగ్లాండ్ జట్టుపై అంబటి రాయుడు 177× పరుగుల తర్వాత యూత్ వన్డేలో వైభవ్ సూర్య వంశీ చేసిన 175 పరుగులు.. సెకండ్ హైయెస్ట్ స్కోర్ గా కొనసాగుతున్నాయి. గత ఏడాది డిసెంబర్లో దుబాయ్ లోని యూఏఈ జట్టుపై సూర్యవంశీ 171 పరుగులు చేశాడు. తద్వారా ఈ జాబితాలో రెండు, మూడు స్థానాలలో అతడు కొనసాగుతున్నాడు..వైభవ్ సూర్య వంశీ వయసు ప్రస్తుతం 14 సంవత్సరాల 316 రోజులు. అండర్ ప్రపంచ కప్ లో ఫైనల్ మ్యాచ్లో సెంచరీ చేసిన అతి తక్కువ వయసున్న ఆటగాడు గతంలో ఈ రికార్డు పాకిస్తాన్ ఆటగాడు బాబర్ అజామ్ పేరు మీద ఉండేది. 2010లో వెస్టిండీస్ జట్టుపై 15 సంవత్సరాల 92 రోజుల్లో అతడి సెంచరీ చేశాడు. సూర్య వంశీ (4), నజ్ముల్(1) మాత్రమే 15 సంవత్సరాలు నిండకముందు యూత్ వన్డేలలో సెంచరీలు సాధించారు. గత ఏడాది డిసెంబర్లో విజయ్ హజారే ట్రోఫీలో అరుణాచల్ ప్రదేశ్ జట్టుపై జరిగిన మ్యాచ్లో వైభవ్ సూర్య వంశీ 14 సంవత్సరాల 272 రోజుల వయసులో సెంచరీ చేశాడు. వైభవ్ సూర్య వంశీ 55 బంతుల్లో సెంచరీ చేశాడు. అయితే ఇతర కంటే ముందు విల్ మలాజ్ జుక్ అనే ఆస్ట్రేలియా క్రీడాకారుడు ఈ ఏడాది జరిగిన మ్యాచ్లో జపాన్ మీద 51 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాడు. పాకిస్తాన్ ఆటగాడు కాసిం అక్రమ్ శ్రీలంక మీద 63 బంతుల్లో సెంచరీ చేశాడు. బెన్ మేయెస్ అనే ఇంగ్లాండ్ ఆటగాడు స్కాట్లాండ్ మీద ప్రస్తుత అండర్ 19 వరల్డ్ కప్ లో 65 బంతుల్లో సెంచరీ చేశాడు. భారతదేశానికి చెందిన రాజ్ బవా అనే ఆటగాడు 2022లో ఉగాండా జట్టుపై 69 బంతుల్లో సెంచరీ చేశాడు.

# అనంత, శ్రీ సత్యసాయి జిల్లాలకు మహర్ధశ

అనంతపురం, ఫిబ్రవరి 8(భారత శక్తి) :

ఇటీవల కేంద్రం రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్‌లను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ కారిడార్లలో ఏపీకి కూడా స్థానం దక్కింది. ఈ క్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో కూడా ఖరీదైన ఖనిజాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు అక్కడ ఖనిజాల కోసం అన్వేషణ జరుగుతోంది. ప్రస్తుతం అక్కడ సర్వేతో పాటుగా పరిశోధనలు చేపట్టారు. అలాగే కడప జిల్లాలో కూడా ఖనిజాలు ఉన్నాయి. రాయలసీమను రతనాల సీమగా పిలుస్తారు.. అంతటి పేరు పొందిన ప్రాంతంలో ఇప్పటికి వజ్రాల వేట జరుగుతోంది. వర్షాకాలంలో పొలాల్లో వజ్రాలు బయటపడుతుంటాయి. అయితే రాయలసీమలో రత్నాల కంటే ఖరీదైన ఖనిజ సంపద ఉందని తెలుస్తోంది. కేంద్రం ఇటీవల ప్రకటించిన రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్‌లో ఉమ్మడి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు స్థానం దక్కింది. ఈ మేరకు అక్కడ ఖనిజాల కోసం అన్వేషణ చేయనున్నట్లు తెలుస్తోంది. అనంతపురం జిల్లాలో 2023లో హైదరాబాద్‌కు చెందిన నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ పరిశోధనలు చేసింది. పలు ప్రాంతాల్లో కొన్ని ఖనిజాలు (నియోబియం, నియోడైమియం, సిరియం, లాంథనం, ప్రాసోడైమియం,స్కాండియం, జిర్కోనియం, లిథియం) ఉన్నట్లు గుర్తించారట. ఈ ఖనిజాలను ఎయిర్‌క్రాఫ్ట్స్, స్మార్ట్‌ఫోన్లు, విండ్ టర్బైన్స్, కంప్యూటర్లు వంటి వాటిలో కూడా ఉపయోగిస్తారని చెబుతున్నారు. లిథియం చాలా అరుదగా దొరికే నిక్షేపాలలో ఒకటి.. తాడిమర్రి, తురకవారిపల్లి, దాడితోట ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారట. అనంతపురం జిల్లాతోపాటుగా కడప జిల్లాలో (పార్నపల్లె, లోపటనూతల) కూడా పరిశోధనలు చేయగా.. అక్కడ కూడా లిథియంను గుర్తించారట. ఈ లిథియంను ఎక్కువగా బ్యాటరీలలో వినియోగిస్తారు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాలతో పాటుగా డిజిటల్ కెమెరాలు, మొబైల్స్ తయారీలో ఉపయోగిస్తారు. ఈ మేరకు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఈ ఖనిజాల కోసం చేస్తున్నారు. ఏఎండీ, జీఎస్ఐ, ఎన్‌జీఆర్ఐ క్షేత్రస్థాయిలో పరిశోధనలతో పాటుగా హెలికాప్టర్ సర్వే కూడా చేపట్టారు. కేంద్రం ఇటీవల రేర్ ఎర్త్ కారిడార్లకు సహకారం అందిస్తామని తెలిపింది. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్‌తో పాటుగా తమిళనాడు, ఒడిశా, కేరళ రాష్ట్రాలు ఉన్నాయి. సముద్ర తీరంలో బీచ్‌శాండ్ ఉన్నట్లు గుర్తించారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లో కూడా అరుదైన ఖనిజాలు ఉన్నట్లు తేలింది. గతంలో విశాఖపట్నంతో పాటుగా తూర్పుగోదావరి జిల్లాల్లో పరిధిలో బాక్సైట్ నిల్వలు గుర్తించిన సంగతి తెలిసిందే. చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో బంగారం ఖనిజాన్ని గుర్తించిన సంగతి తెలిసిందే. వాటితో పాటుగా పైన తెలిపిన ఖనిజాలను కూడా గుర్తించారు. వీటి తవ్వకాలకు ముందుకొచ్చేవారికి కేంద్రం నుంచి ప్రోత్సాహం అందిస్తారు.

# శత్రు దేశాలకు వణుకు పుట్టిస్తున్న అగ్ని-3 క్షిపణి..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8(భారత శక్తి) :

ఒడిశాలోని చాందీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుండి ఫిబ్రవరి 6, 2026న భారతదేశం అగ్ని-3 ఇంటర్మీడియట్ రేంజ్ బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఈ ప్రయోగం అన్ని కార్యాచరణ, సాంకేతిక పారామితులను చేరుకుంది. ఈ పరీక్షను వ్యూహాత్మక దళాల కమాండ్ పర్యవేక్షణలో నిర్వహించారు.ఒడిశాలోని చాందీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుండి ఫిబ్రవరి 6, 2026న భారతదేశం అగ్ని-3 ఇంటర్మీడియట్ రేంజ్ బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఈ ప్రయోగం అన్ని కార్యాచరణ, సాంకేతిక పారామితులను చేరుకుంది. ఈ పరీక్షను వ్యూహాత్మక దళాల కమాండ్ పర్యవేక్షణలో నిర్వహించారు. పరీక్ష సమయంలో అగ్ని-3 ఇంటర్మీడియట్ రేంజ్ బాలిస్టిక్ క్షిపణి అన్ని సాంకేతిక, కార్యాచరణ పారామితులు విజయువంతమయ్యాయని రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది.భారతదేశ రక్షణ వ్యవస్థలో అగ్ని క్షిపణి వ్యవస్థ కీలకమైన భాగం. ఈ ప్రయోగాన్ని భారతదేశం ముఖ్యమైన సైనిక సామర్థ్యాలను పర్యవేక్షించే వ్యూహాత్మక దళాల కమాండ్ పర్యవేక్షించింది. ఈ పరీక్ష భారతదేశం బలమైన, నమ్మదగిన వ్యూహాత్మక నిరోధక సామర్థ్యాలను స్పష్టంగా ప్రదర్శిస్తుంది. అగ్ని-3 అనేది అణు వార్‌హెడ్‌లను మోనుకెళ్లగల ఇంటర్మీడియట్-రేంజ్ బాలిస్టిక్ క్షిపణి. ఇది ఓఎఫీఎలతో సారూప్య సాంకేతికతను పంచుకుంటుంది. ఇవి ఒకేసారి బహుళ లక్ష్యాలను ఛేదించగలవు.అగ్ని-3 క్షిపణి ప్రధాన బలం దాని వేగం. దీని పరిధి 3,000 నుండి 5,000 కిలోమీటర్లు ఉంటుందని అంచనా. దీని తేలికైన బరువు కారణంగా, దీని పరిధిని మరింత విస్తరించవచ్చు. ఇది పాకిస్తాన్, చైనాలోని చాలా ప్రాంతాలను సునాయసంగా ఢీకొట్టగల సామర్థ్యం కలిగి



ఉంది. దీని వేగం మాక్ 15 (గంటకు 18,522 కిలోమీటర్లు). అంటే సెకనుకు 5 నుండి 6 కిలోమీటర్లు, ఇది భారతదేశ శత్రువులను ఆశ్చర్యపరుస్తుంది. దీని పొడవు 17 మీటర్లు, దాని బరువు 50,000 కిలోగ్రాములు.భారతదేశం ప్రయోగించిన అగ్ని-3 క్షిపణిలో రింగ్ లేజర్ గైరోస్కోప్ ఇనర్షియల్ నావిగేషన్ సిస్టమ్ ఉంది. ఇది క్షిపణి లక్ష్యాలను విమానంలో మధ్యలో మార్చడానికి అనుమతిస్తుంది. ఈ క్రమంలోనే, భారత సైన్యం తన వాయు రక్షణ, నిఘా సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి ఒక ముఖ్యమైన అడుగు వేసింది. 30 తక్కువ-స్థాయి తేలికైన రాడార్ల కొనుగోలు కోసం సైన్యం సుమారు రూ.725 కోట్ల విలువైన టెండర్‌ను జారీ చేసింది.ఈ వ్యవస్థలను సైన్యంలోకి వేగంగా చేర్చడానికి ఫాస్ట్-ట్రాక్ ప్రక్రియలో భాగంగా ఈ సేకరణ జరుగుతోంది. డ్రోన్లు, తక్కువ ఎత్తులో ఎగిరే విమానాలు, చిన్న, నెమ్మదిగా ఉన్న లక్ష్యాలను గుర్తించడంలో ఈ రాడార్లు ముఖ్యంగా ప్రభావవంతంగా ఉంటాయి. డ్రోన్ల వల్ల ప్రస్తుతం ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం కీలకమైనదిగా పరిగణిస్తున్నారు. ఈ రాడార్లు సరిహద్దు నిఘా, వాయు రక్షణ వ్యవస్థలను బలోపేతం చేస్తాయి.

# జగిత్యాల కాంగ్రెస్ లో ముసలం

కరీంనగర్ ఫిబ్రవరి 8(భారత శక్తి) :



జగిత్యాల కాంగ్రెస్‌లో ముదిరిన ముసలం ఇప్పుడు తెలంగామ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. దశాబ్దాలుగా పార్టీ జెండాను మోసిన సీనియర్ నేత జీవన్ రెడ్డి ఆవేదన, ప్రస్తుత రాజకీయ సమీకరణాలు కాంగ్రెస్ అధిష్టానానికి కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతున్నాయి.తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి జగిత్యాల ఒకప్పుడు కంచుకోట. ఆ కోటను కాపాడుతూ వస్తున్న సీనియర్ నేత టి. జీవన్ రెడ్డి ప్రస్తుత పరిస్థితుల్లో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మున్సిపల్ ఎన్నికల వేళ టికెట్ల కేటాయింపులో జరిగిన పరిణామాలు, బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు ప్రాధాన్యత పెరగడం జీవన్ రెడ్డిని కన్నీటి పర్యంతం చేశాయి.గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన సంజయ్ కుమార్, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరినట్లు వార్తలు వచ్చాయి. అయితే, సాంకేతిక కారణాల దృష్ట్యా తాను పార్టీ మారలేదని, కేవలం అభివృద్ధి కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నానని ఆయన పేర్కొంటున్నారు. ఇటీవల స్పీకర్ కూడా ఆయనపై అనర్హత పిటిషన్‌ను తిరస్కరించడంతో సంజయ్ కుమార్ తన పట్టును మరింత పెంచుకున్నారు.మరోవైపు, కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు జెండా మోసిన తమను కాదని, నిన్నగాక మొన్న వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడంపై జీవన్ రెడ్డి వర్గం భగ్గుమంటోంది. మున్సిపల్ టికెట్ల పంపిణీలో సంజయ్ వర్గానికి 30 సీట్లు, జీవన్ రెడ్డి వర్గానికి కేవలం 20 సీట్లు కేటాయించడమే ఈ మంటలకు ఆజ్యం పోసింది.జీవన్ రెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలు పార్టీలో పెద్ద దుమారాన్నే రేపుతున్నాయి. గతంలో రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు "పార్టీ మారిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టండి" అని పిలుపునిచ్చారని గుర్తు చేస్తూ, ఇప్పుడు తాను మాత్రం "రాళ్లతో కాదు.. ఓటు అనే ఆయుధంతో కొడదాం" అని అనడం విశేషం. ఇది ప్రత్యక్షంగా పార్టీ అధిష్టానంపై ఆయన చేస్తున్న తిరుగుబాటుగా విశ్లేషకులు భావిస్తున్నారు.పార్టీ కోసం దశాబ్దాలుగా శ్రమించిన తన అనుచరులకు అన్యాయం జరిగిందని జీవన్ రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. "జీవితం ముగిసే సమయంలో నాకు ఇంత దుఃఖం తెప్పించారు. నా గొంతు కోయాలంటే ముందు నా కార్యకర్తలను దాటి రావాలి" అని ఆయన చేసిన వ్యాఖ్యలు జగిత్యాల కాంగ్రెస్ శ్రేణుల్లో కల్లోలం రేపుతున్నాయి. తన వర్గానికి చెందిన అభ్యర్థులు స్వతంత్రులుగా బరిలోకి దిగడం, వారికి జీవన్ రెడ్డి మద్దతు తెలపడం పార్టీ అధికారిక అభ్యర్థుల గెలుపుపై ప్రభావం చూపే అవకాశం ఉంది.మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించాలని భావిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, జగిత్యాల సంక్షోభం పెద్ద తలనొప్పిగా మారింది. ఒకవైపు సీనియర్ నేత గౌరవం, మరోవైపు అధికార బలాన్ని పెంచుకునే క్రమంలో చేర్చుకున్న ఎమ్మెల్యేల మధ్య సమన్వయం కుదరకపోవడం పార్టీని ఇబ్బందుల్లో నెట్టేస్తోంది.జగిత్యాల మున్సిపల్ ఎన్నికల ఫలితాలు కేవలం స్థానిక నాయకత్వాన్నే కాదు, రాష్ట్రస్థాయిలో కాంగ్రెస్ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని, పార్టీ ఫిరాయింపుల వల్ల కలిగే నష్టాలను కూడా తేటతెల్లం చేయనున్నాయి. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ నేతను బుజ్జగించకపోతే, అది రాబోయే రోజుల్లో ఇతర జిల్లాల్లోనూ అసమ్మతి రాగాలకు దారితీసే ప్రమాదం ఉంది.

# పవన్‌కు ఫుల్ పవర్స్...

చెన్నై, ఫిబ్రవరి 8(భారత శక్తి) :

పవన్ కళ్యాణ్ కు బిజెపి పెద్ద బాధ్యత అప్పజెప్పినట్లు ప్రచారం నడుస్తోంది. ఇటీవల పవన్ కళ్యాణ్ ఢిల్లీ వెళ్లిన సంగతి తెలిసిందే. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను కలిశారు. కీలక చర్చలు జరిపారు. అమిత్ షా కేవలం మంత్రి మాత్రమే కాదు. బిజెపి రాజకీయ వ్యూహకర్త. ఆపై బిజెపిలో ఆయన పాత్ర కీలకం. అయితే పవన్ ఢిల్లీ పర్యటనలకు ఎప్పుడూ దూరంగా ఉంటారు. అటువంటి పవన్ కళ్యాణ్ ను ఢిల్లీకి పిలిపించుకుని మరి కీలక బాధ్యతలు అప్పగించినట్లు ప్రచారం నడుస్తోంది. మరోవైపు రెండు నెలల్లో తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. గత సార్వత్రిక ఎన్నికల్లో అక్కడ ఓటు శాతాన్ని పెంచుకుంది బిజెపి. సీట్ల పరంగా ఒక్క స్థానం రాకున్నా ఓట్లు మాత్రం గణనీయంగా పెరిగాయి. అందుకే ఈసారి అక్కడ పట్టు బిగించాలని బిజెపి చూస్తోంది. ఇప్పటికే పలని స్వామి నేతృత్వంలోని డీఎంకే ఎన్డీఏ లోకి వచ్చింది. దినకరన్ పార్టీ సైతం పొత్తుకు ముందుకు వచ్చింది. అయితే అనూహ్యంగా తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని టీవీకే 12 శాతం వరకు ఓట్లు సొంతం చేసుకుంటుందని సర్వేల్లో తేలుతోంది. అదంతా డిఎంకె కూటమి వ్యతిరేక ఓటు. అయితే ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా ఉండాలంటే విజయ్ ను ఎన్డీఏలోకి తేవాలని బిజెపి పెద్దలు భావించారు. ద్రవిడ సిద్ధాంతానికి వ్యతిరేకంగా బిజెపి ఉండడంతో.. తనకు రాజకీయంగా ఇబ్బంది తప్పదని విజయ్ భయపడుతున్నారు. అందుకే ఎన్డీఏలో చేరేందుకు ఇష్టపడడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో తమిళనాడులో బలమైన చరిష్మ కావాలి అంటే పవన్ అవసరం ఏర్పడింది బిజెపికి. పైగా అక్కడ తెలుగు వారి ప్రభావం ఎక్కువ. అందుకే పవన్ కళ్యాణ్ కు తమిళనాడు ఎన్నికల్లో ఎన్డీఏ ఇన్చార్జిగా నియమించాలని కేంద్ర పెద్దలు భావిస్తున్నట్లు తెలుస్తోంది.



ముందుగా తెలంగాణ ఎన్నికల్లో ప్రచారం.. తరువాత తమిళనాడు ఎన్డీఏ ఇన్చార్జిగా ప్రకటన ఉంటుందని ప్రచారం నడుస్తోంది. అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలిఅయితే పవన్ ఢిల్లీ వెళ్లి వచ్చిన తర్వాత తెలంగాణ బిజెపి నేతలు కలిశారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన మద్దతును కోరారు. మద్దతు ఇవ్వడమే కాదు బిజెపి తరఫున ప్రచారానికి కూడా పవన్ కళ్యాణ్ సిద్ధమని ప్రకటించారు.వాస్తవానికి తెలంగాణలో జనసేన పోటీ చేయడానికి అన్ని రకాల ప్రయత్నాలు ప్రారంభించింది. అప్పటివరకు ఉన్న అన్ని కమిటీలను రద్దు చేశారు. రామ్ తాళ్లూరి నేతృత్వంలో కొత్త కమిటీల ఎంపిక ప్రక్రియ ప్రారంభం అయింది. అందులో కొత్త వారికి అవకాశం ఇచ్చి తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో యువతకు టికెట్లు ఇవ్వడం ద్వారా పార్టీని బలోపేతం చేసుకోవాలన్న ఆలోచనకు వచ్చారు. ప్రజాబలం ఉండి ప్రధాన రాజకీయ పార్టీల తరఫున టికెట్లు దొరకని వారికి జనసేన టికెట్లు ఇచ్చేందుకు నిర్ణయించారు. ఇప్పటికే ప్రధాన నగరాలతో పాటు పట్టణాల్లో జనసేన అభ్యర్థులు పోటీకి దిగారు. ఇప్పుడు పవన్ కళ్యాణ్ బిజెపికి మద్దతు తెలపడంతో ఆ రెండు పార్టీల మధ్య ఒక అవగాహన వచ్చే అవకాశం ఉంది.

# లెక్కలేసుకుంటున్న జనాలు సర్కారీపై బేరీజులు

హైదరాబాద్,ఫిబ్రవరి 8(భారత శక్తి) :

తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు ఓ రేంజ్ లో జరుగుతున్నాయి. ప్రచార వేడి ఊపందుకుంది. ఈ సమయంలో గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనను, ప్రస్తుత రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ఓటర్లు బేరీజు వేసుకుంటున్నారు. ముఖ్యంగా పట్టణాల అభివృద్ధిపై రెండు ప్రభుత్వాల ప్రాధాన్యతలు, అమలు చేసిన కార్యక్రమాల్లో స్పష్టమైన తేడాలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణ ప్రగతి పేరుతో ఒక క్రమబద్ధమైన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో ప్రధానంగా మున్సిపాలిటీల్లో పారిశుధ్యం, పచ్చదనం కోసం హరితహారం, మౌలిక సదుపాయాల మెరుగుదలే లక్ష్యంగా పనిచేశారు. ప్రతి మున్సిపాలిటీకి ట్రాక్టర్లు, వైకుంఠధామాలు, వెజ్ అండ్ నాన్-వెజ్ మార్కెట్లు నిర్మించడం ద్వారా పట్టణాల్లో కనీస సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యతనిచ్చారు. నిరంతర నిధుల విడుదల ద్వారా మున్సిపల్ కార్మికుల వేతనాలు, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాల్లో ఒక వ్యవస్థను ఏర్పాటు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణ అభివృద్ధిని భిన్న కోణంలో చూస్తోంది. ముఖ్యంగా చెరువుల ఆక్రమణలను తొలగించడం, అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపడం రేవంత్ ప్రభుత్వ మార్క్ నిర్ణయంగా మారింది. అలాగే, వేల కోట్ల రూపాయలతో చేపట్టిన మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ ద్వారా హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల రూపురేఖలు మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. బీఆర్ఎస్ వసతులపై దృష్టి పెడితే, కాంగ్రెస్ దీర్ఘకాలిక ప్రణాళికలు, పర్యావరణ పరిరక్షణపై మొగ్గు చూపుతోంది. అయితే కాంగ్రెస్ చేపట్టినవి ప్రధానంగా హైదరాబాద్‌కు సంబంధించినవే. ఇతర మున్సిపాలిటీలకు ప్రత్యేకమైన ప్రణాళికలేమీ అమలు చేయలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణ అభివృద్ధి కోసం బడ్జెట్‌లో భారీగానే కేటాయింపులు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో నిధుల విడుదలపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి.

గత ప్రభుత్వం వదిలివెళ్లిన పెండింగ్ బిల్లుల భారం మున్సిపాలిటీలపై ఉండటంతో కొత్త పనులు ప్రారంభించడంలో జాప్యం జరుగుతోంది. ఇందిరమ్మ కమిటీల ద్వారా వార్డుల వారీగా అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని, ప్రజా పాలన ద్వారా ఫిర్యాదులను పరిష్కరించాలని రేవంత్ ప్రభుత్వం కొత్త వ్యూహాన్ని అమలు చేస్తోంది. బీఆర్ఎస్ హయాంలో అధికారులు, ఎమ్మెల్యేల పర్యవేక్షణలో పట్టణ ప్రగతి జరిగితే, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లింది.

ఉచిత బస్సు ప్రయాణం , ఉచిత విద్యుత్ వంటి గ్యారెంటీలు పట్టణ మధ్యతరగతి ప్రజలపై సానుకూల ప్రభావం చూపాయని ప్రభుత్వం భావిస్తోంది. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి నిత్యం ఎదుర్కొనే సమస్యలనే ప్రాతిపదికగా తీసుకుంటారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన పార్కులు, మార్కెట్లను కాంగ్రెస్ ఎలా నిర్వహిస్తోంది.. రేవంత్ రెడ్డి తెచ్చిన కొత్త సంస్కరణలు తమ జీవితాలను ఎలా మారుస్తాయి అనే అంశాలను ప్రజలు పోల్చి చూస్తున్నారు. గత పదేళ్ల అభివృద్ధి వర్సెస్ ప్రస్తుత రెండేళ్ల "మార్పు" మధ్య ఈ ఎన్నికల పోరు సాగనుంది. ప్రజల ఓటింగ్ ప్రాధాన్యతలు ఎలా ఉన్నా.. ఈ అంశంలో మాత్రం ప్రజల మధ్యచర్చలు జరుగుతున్నాయి.

====================

# మున్సిపల్ ఎన్నికల్లో ట్రయాంగిల్ ఫైట్

కరీంనగర్,ఫిబ్రవరి 8(భారత శక్తి) :

తెలంగాణ వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో రాజకీయం పూర్తిగా కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ గా మారిపోయింది. పార్లమెంట్ ఎన్నికల నాటి నుంచి కొనసాగుతున్న జోరును మున్సిపల్ కేంద్రాల్లోనూ ప్రదర్శించి, పట్టణ ఓటర్లపై పట్టు సాధించాలని బీజేపీ వ్యూహరచన చేస్తోంది. మరోవైపు, అధికార యంత్రాంగం అండతో పాటు గ్యారెంటీల అమలును ప్రచార అస్త్రంగా చేసుకుని కాంగ్రెస్ ఇక్కడ జైత్రయాత్ర కొనసాగించాలని చూస్తోంది. దక్షిణ తెలంగాణలో మాత్రం త్రిముఖ పోటీ కనిపిస్తోంది. దక్షిణ తెలంగాణ ప్రాంతాలైన ఉమ్మడి నల్గొండ,

ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో రాజకీయ వాతావరణం భిన్నంగా ఉంది. ఇక్కడ కాంగ్రెస్‌కు బలమైన క్యాడర్ ఉండగా, బీఆర్ఎస్ తన పట్టును కాపాడుకోవడానికి గట్టిగా పోరాడుతోంది. ఈ ప్రాంతంలో నల్గొండ, కొత్తగూడెం, మహబూబ్‌నగర్ వంటి 3 కార్పొరేషన్లతో పాటు పెద్ద సంఖ్యలో మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇక్కడ బీజేపీ కూడా తన ప్రాబల్యాన్ని పెంచుకోవాలని చూస్తుండటంతో పోరు త్రిముఖంగా మారింది. ప్రస్తుత ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్షేత్రస్థాయిలోకి వెళ్తోంది. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులే తమకు అండగా నిలుస్తారని భావిస్తున్న హస్తం పార్టీ, దాదాపు అన్ని వార్డుల్లోనూ అభ్యర్థులను నిలబెట్టి బలమైన ఉనికిని చాటుతోంది. అయితే, అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రత్యర్థులను అణచివేస్తున్నారనే ఆరోపణలను కాంగ్రెస్ ఎదుర్కొంటోంది. ముఖ్యంగా దక్షిణ తెలంగాణలోని తన కంచుకోటలను

కాపాడుకోవాలన్న పట్టుదలతో ఉంది. బీజేపీ కేంద్ర నిధుల వినియోగం, హిందూత్వ ఎజెండా,స్థానిక సమస్యలపై ఛార్జ్‌షీట్ల విడుదల ద్వారా దూకుడుగా ప్రచారం చేస్తోంది. పట్టణ ఓటర్లు తమవైపే ఉన్నారనే ధీమాతో అర్బన్ ఏరియాల్లో కమలం జెండా ఎగురవేయాలని చూస్తోంది. ఇదే సమయంలో, బీఆర్ఎస్ ఈ ఎన్నికలను తమ మనుగడకు అత్యంత కీలకంగా భావిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో చేసిన పట్టణ ప్రగతి పనులను వివరిస్తూ, కేటీఆర్ , హరీష్ రావు నేతృత్వంలో కేడర్‌ను సమాయత్తం చేస్తోంది. త్రిముఖ పోటీ జరుగుతున్న ప్రధాన పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యనే దక్షిణ తెలంగాణలో సాగుతోంది. దక్షిణ తెలంగాణ మున్సిపాలిటీల్లో

పార్టీల కంటే అభ్యర్థుల ఎంపిక, రెబెల్స్ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. టికెట్ దక్కని నాయకులు స్వతంత్రులుగా బరిలోకి దిగడం అన్ని పార్టీలకూ తలనొప్పిగా మారింది. ఓట్లు చీలితే అది ఎవరికి లాభిస్తుందనేది అంచనాలకు అందడం లేదు. ఈ మున్సిపల్ ఎన్నికలు కేవలం స్థానిక సంస్థలకే పరిమితం కాకుండా, రాష్ట్రంలో బలమైన ప్రత్యామ్నాయం ఎవరు అనే ప్రశ్నకు సమాధానం ఇవ్వబోతున్నాయి. ఉత్తర తెలంగాణలో బీజేపీ తన పట్టును నిరూపించుకుంటే, రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యర్థిగా నిలుస్తుంది. లేకపోతే బీఆర్ఎస్ తన స్థానాన్ని కాపాడుకుంటుంది. అందుకే హోరాహోరీగా ప్రయత్నాలు చేస్తోంది.

# నువ్వా, నేనా అన్నట్టు ప్రచారం

వికారాబాద్, ఫిబ్రవరి 8(భారత శక్తి) :

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు రసవత్తరంగా సాగుతున్నాయి. రంగారెడ్డి జిల్లా మెయినాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ కు ఎదురీత తప్పడం లేదు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నామన్న ధీమా ఉందో లేక అభ్యర్థుల్లో గెలుపుపై నమ్మకం సన్నగిల్లిందో తెలియదు కానీ మొయినాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతోంది.ఎన్నికల నగారా మోగి, ప్రచారం హోరెత్తాల్సిన సమయంలో కాంగ్రెస్ అభ్యర్థులు కనీసం ఇంటి గడప దాటకపోవడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్గా మారింది. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థుల జాడ కనిపించడం లేదు. ప్రత్యర్థి పార్టీలు ఇంటింటి ప్రచారంతో దూసుకుపోతుంటే, కాంగ్రెస్ అభ్యర్థులు మాత్రం కనీసం ఓటర్లను కలిసే ప్రయత్నం కూడా చేయడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో సామాన్య ఓటర్లలో అసలు కాంగ్రెస్ పోటీలో ఉందా? లేక ముందే చేతులెత్తేసిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.క్షేత్రస్థాయిలో పార్టీ గ్రాఫ్ పడిపోతుండటంతో అప్రమత్తమైన ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. వరుస సమావేశాలు నిర్వహిస్తూ కార్యకర్తల్లో జోష్ నింపేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, అభ్యర్థుల్లో కదలక లేకపోవడం ఆయనకు కూడా తలనొప్పిగా మారింది. నాయకులు మేకప్ వేస్తున్నా, క్షేత్రస్థాయిలో 'సీన్' మాత్రం రివర్స్‌లో ఉండటం గమనార్హం.పార్టీ అంతర్గత వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం.. దీని వెనక ప్రధానంగా మూడు కారణాలు వినిపిస్తున్నాయి.అంతర్గత కుమ్ములాటలు... టికెట్ల కేటాయింపులో జరిగిన జాప్యం, అసంతృప్త నేతల సహాయ నిరాకరణ పార్టీని దెబ్బతీస్తోంది. మరో పక్క నాయకత్వ లోపం తేట తెల్లమవుతుంది. స్థానిక నాయకుల మధ్య సమన్వయం లేకపోవడంతో క్యాడర్ ఎటు వెళ్లాలో తెలియక అయోమయంలో ఉంది.గెలుపుపై ధీమా లేకపోవడంతో అభ్యర్థులు ఖర్చు పెట్టేందుకు వెనకాడుతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. నాయకులు ఏసీ రూముల్లో సమావేశాలు పెడితే ఓట్లు రావు, ప్రజల్లోకి వస్తేనే ఫలితం ఉంటుంది అని కాంగ్రెస్ సానుభూతిపరులే బహిరంగంగా వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం.

# ఆదాయ వనరుగా 'చెత్త'

## -ఇళ్ల ముంగిటకే స్వచ్ఛ రథాలు
## -తడి చెత్తతో సేంద్రీయ ఎరువుల తయారీ
## -చెత్త కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయం
## -చెత్త తో సంపద సృష్టించిన ఘనత సీఎం చంద్రబాబుదే: జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత

చెన్నూరు/కమలాపురం, ఫిబ్రవరి 08(భారత శక్తి) : తమ ప్రభుత్వం చెత్త ద్వారా సంపద సృష్టించి ప్రజలకు ఆదాయం మార్గం చూపించామని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. జిల్లా ఇన్చార్జి మంత్రి మరియు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి వైఎస్ఆర్ కడప జిల్లా ఒక రోజు పర్యటనలో భాగంగా చెన్నూరు మండల కేంద్రంలో స్వచ్ఛ రథాన్ని ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డితో కలిసి మంత్రి సవిత ప్రారంభించారు.అనంతరం చెన్నూరులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి మంత్రి మరియు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర లక్ష్యంతో ఏపీని పరిశుభ్రంగా ఉంచాలన్నది సీఎం చంద్రబాబు నాయుడు గారి లక్ష్యమన్నారు. దేశం లోనే ఏపీని అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దాలనేది ముఖ్యమంత్రి గారి సంకల్పమన్నారు. 2014-19లోనే ఏపీలో ప్రతి గ్రామంలోనూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సీఎం చంద్రబాబు ఏర్పాటు చేశారన్నారు ..2024 లో



అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు చెత్త నుండి సంపద ను సృష్టించే చర్యల్లో భాగంగా మూలనపడిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చారన్నారు. గ్రీన్ అంబాసిడర్ల చేత ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారు. తడి చెత్తతో సేంద్రీయ ఎరువులు సేకరించి, రైతులకు విక్రయిస్తూ పంచాయతీలకు ఆదాయం మార్గం చూపారు. పొడి చెత్తను సైతం రీ సైక్లింగ్ చేస్తూ ఆదాయ వనరుగా మార్చారు.

పొడి చెత్తకు నిత్యావసర వస్తువులు

గ్రామాల్లో ఇంటింటి నుంచి ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, ప్యాకెట్లు, గాజు సీసాలు, పాత పేపర్లు, పుస్తకాలు, అట్టపెట్టెలు, నూనె డబ్బాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, ఇనుము, స్టీల్, అల్యూమినియం వంటి పొడి చెత్త సేకరణకు స్వచ్ఛ రథాలను కూటమి ప్రభుత్వం ప్రారంభించిందని ఇన్చార్జి మంత్రి సవిత వెల్లడించారు. ఈ రథాల ద్వారా పొడి చెత్తను కేజీల రూపంలో తీసుకుని, వాటికి విలువ కట్టి, 20 రకాల నిత్యావసర వస్తువులను ప్రజలకు అందజేస్తున్నామన్నారు. కేజీ ప్లాస్టిక్ విలువను రూ.20లుగా నిర్ణయించామన్నారు. ఇళ్లలో పనికిరాని పొడి చెత్తకు విలువ కట్టి నిత్యావసర వస్తువులు అందజేస్తున్నామన్నారు. చెత్తకు కూడా విలువ కట్టి, ఆదాయ వనరుగా మార్చిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. అంతకుముందు స్వచ్ఛ రథాన్ని ఎమ్మెల్యే పుత్తా కృష్ణా చైతన్యరెడ్డి నడపగా, మంత్రి సవిత పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. సేకరించిన చెత్తకు మంత్రి సవిత నిత్యావసర వస్తువులు అందజేశారు.

అనంతరం చెన్నూరు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో కలియ తిరిగారు. అక్కడ సేంద్రీయ ఎరువు తయారీ విధానాన్ని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

చెత్త నుండి సంపద తయారీ కేంద్రం ఆవరణలో ఎమ్మెల్యే పుత్తా కృష్ణా చైతన్య రెడ్డితో కలిసి మొక్క నాటారు.

ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

## సహాయ పౌర సరఫరాల అధికారి, డిప్యూటీ తహసీల్దార్ లతో కూడిన రెండు ప్రత్యేక బృందాలు వాణిజ్య సంస్థలపై దాడులు

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఫిబ్రవరి 08: శనివారం సహాయ పౌర సరఫరాల అధికారి (ఏసిఎస్ఓ), డిప్యూటీ తహసీల్దార్ (సివిల్ సప్లైస్)లతో కూడిన రెండు ప్రత్యేక అమలు బృందాలు కామారెడ్డి పట్టణం, లింగంపేట ప్రాంతాలలోని వివిధ వాణిజ్య సంస్థలపై దాడులు నిర్వహించాయి.




తనిఖీల సమయంలో, పలు వాణిజ్య సంస్థలు గృహ వినియోగానికి కేటాయించిన ఎల్పీజీ సిలిండర్లను అక్రమంగా వాణిజ్య అవసరాల కోసం వినియోగిస్తున్నట్లు గుర్తించబడింది. ఇది పెట్రోలియం ఉత్పత్తులు (సరఫరా పంపిణీ నియంత్రణ) కంట్రోల్ ఆర్డర్ నిబంధనలకు, అలాగే అత్యవసర వస్తువుల చట్టం, 1955 లోని సెక్షన్ 6ఏ కు విరుద్ధం.

దీని నేపథ్యంలో 24 కేసులు నమోదు చేయబడగా, 49 గృహ ఎల్పీజీ సిలిండర్లు స్వాధీనం చేసుకోవడం జరిగింది.

గృహ ఎల్పీజీ సిలిండర్ల అక్రమ వినియోగం వల్ల ప్రభుత్వానికి ఆదాయ నష్టం కలగడమే కాకుండా ప్రజా భద్రతకు కూడా తీవ్రమైన ముప్పు ఏర్పడుతుంది. ఇటువంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు కొనసాగించబడతాయి. జిల్లాలో అవసర వస్తువుల అక్రమ మళ్లింపును అరికట్టేందుకు అమలు చర్యలను మరింత కఠినతరం చేయడం జరుగుతుంది.

## మండల విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం తో నీరుగారుతున్న పల్లెబాట కార్యక్రమం

ఖమ్మం బ్యూరో, భారత శక్తి, ఫిబ్రవరి 8: తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ సమస్యలు తీర్చటమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మధిర శాసనసభ్యులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క పల్లె బాట కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం ఉద్దేశం గ్రామాల్లోకి విద్యుత్ అధికారులు వెళ్లి ప్రజలకు సంబంధించి విద్యుత్ సమస్యలు పరిష్కరించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. కానీ బోనకల్ మండల విద్యుత్ అధికారులకు అందుకు పూర్తి విరుద్ధంగా ప్రజలకు సమాచారం ఇవ్వకుండా వారికి తీరినప్పుడు అప్పటికప్పుడు తమకవేయించి గ్రామాల్లోకి వెళ్ళటంతో ప్రజల సమస్యలు పక్కదోవ పడుతున్నాయి. మండల పరిధిలోని చొప్పకట్లపాలెం గ్రామం లో ప్రజలకు తెలియకుండానే విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పల్లె బాట కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం ఉచిత విద్యుత్ పంపిణీ, ట్రాన్స్ఫార్మర్ సమస్యలు, నూతన స్తంభాల మంజూరి, విద్యుత్ బిల్లుల సమస్యలు, సలహాలు వంటివి గ్రామ ప్రజలకు తెలియజేయడం, ప్రజలకు అవగాహన కల్పించడం. కానీ శనివారం గ్రామంలో కార్యక్రమం జరుగుతుంది అనే విషయమే ప్రజలకి కానీ, పంచాయతీ సెక్రటరీ కి కానీ, వార్డ్ మెంబర్స్ కాని తెలియజేయకుండా కేవలం సర్పంచ్, ఉపసర్పంచ్ లు మాత్రమే పాల్గొనడం విడ్డురంగా ఉంది. గ్రామ అభివృద్ధి, ప్రజల సమస్యలే మా లక్ష్యం అంటూ నిరంతరం ఉపన్యాసాలు ఇచ్చే గ్రామస్థాయి నాయకులకు పల్లెబాట ప్రజలతో జరపాలనే జ్ఞానం లేకపోవడం మన దౌర్భాగ్యం అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉదయం 7:30కు టమకా వేపించి 9గంటలకు కార్యక్రమం అని చెప్పి 11గంటలకు అధికారులు వచ్చారు. సెక్రటరీ కి సర్పంచ్ భర్త 10గంటలకు ఫోన్ చేసి కార్యక్రమం ఉన్నది అని చెప్పినట్లు తెలిసింది. పంచాయతీ పాలకవర్గం అంటే సర్పంచ్, ఉపసర్పంచ్ మాత్రమేనా గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి కి కూడా కార్యక్రమం సమాచారం లేకపోవడం గమనార్హం. మండల విద్యుత్ ఏఈ గా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏ ఈ మనోహర్ పై గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు ప చేశారు. గతంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా అధికార పార్టీకి సంబంధించిన నాయకులు ముగ్గుల పోటీలు




నిర్వహించగా గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులతో సన్నిహితం గా ఉంటున్న ఒక వ్యక్తి రాత్రి సమయంలో కరెంటు నిలిపివేయడం విశేషం. మొదటి నుండి గ్రామ కాంగ్రెస్ నాయకుల పట్ల మాజీ ప్రజా ప్రతినిధి పట్ల ఏ ఈ నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నట్లు మాజీ సర్పంచ్ యర్రంశెట్టి సుబ్బారావు తెలిపారు. గ్రామంలో కరెంటు నిల్పేయడంపై అధికారులకు ఫిర్యాదు చేసిన కనీసం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విశేషం. గ్రామంలో మరల పల్లెబాట కార్యక్రమం నిర్వహించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఏ ఈ వివరణ: గ్రామంలో పల్లెబాట కార్యక్రమం నిర్వహించిన సమాచారాన్ని సర్పంచ్ కి తానే ఫోన్ చేసి చెప్పానని సెక్రటరీకు మా కింద సిబ్బంది సమాచారం అందించారని తెలిపారు. గ్రామ పరిధిలో ఒక లైన్ ఇన్స్పెక్టర్ ఒక లైన్మెన్ మాత్రమే ప్రభుత్వపరంగా విధులు నిర్వహిస్తారని ఎటువంటి వ్యక్తులు డిపార్ట్మెంట్ పరంగా పనిచేయడం లేదని తెలిపారు.

## బండి పరిమళ జ్యోతి గారి బోధన కళాత్మక బోధన

పోరుమామిళ్ల, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 08: కాశి నాయన మండలంలోని జడ్పీహెచ్ఎస్ రెడ్డి కొట్టాల పాఠశాలలో నో బ్యాగ్ డే సందర్భంగా విద్యాభ్యసనతో పాటు చిన్నారి విద్యార్థులు వారి సృజనాత్మకతను మెరుగులు దిద్దుకుంటూ ఉల్లాసంగా గడిపారు.రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పరిమళ జ్యోతి సహకారంతో విద్యార్థులు చిత్రాలు వేయడం,చార్టులు,రంగు కాగితాలు ఉపయోగించి పూల గుత్తులు,పడవ, టోపీ,గణితం గుర్తులు, వెజిటబుల్స్, జంతువులు మొదలగు ఆకృతులు బొమ్మలు తయారు చేసేలా



పరిమళ జ్యోతి ప్రోత్సహిస్తున్నారు. తరగతిలో విద్యార్థులను ఆకట్టుకునేలా బోధన చేస్తూనే రైమ్స్, ఆటల ఆధారిత పాఠాలు పప్పెట్స్ ద్వారా స్ఫూర్తి కథలు బోధిస్తూ విద్యార్థుల విజ్ఞానాభివృద్ధికి కృషి చేస్తున్నారు.

## మార్చి 15 లోపు పెండింగ్ పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, ఫిబ్రవరి 8(భారత శక్తి) : జిల్లాలో పెండింగ్ లోవున్న అన్ని రకాల ఎన్ఆర్ఈజీఎస్ పనులను ఈ ఆర్థిక సవత్సరంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత శాఖల ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా జిల్లాలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనుల పురోగతిపై ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో భాగంగా ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా జిల్లాలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులను ఈ ఆర్థిక సంవత్సరంలోగా ప్రత్యేకించి మార్చి 15 లోగా పూర్తి చేయాలన్నారు. 100% పూర్తి చేయగల పనులను గుర్తించి వారం రోజుల్లోగా ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు.

ఈ ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 2059 పనులు మంజూరయ్యాయని

ఇప్పటికే చాలా పనులు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే పనులు మొదలు పెట్టి పురోగతిలో ఉన్న వాటిని మార్చి 15 లోపు పూర్తి చేయాలన్నారు. కంకా మొదలు పెట్టాల్సిన పనులను కూడా నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయగలిగితేనే మొదలు పెట్టాలన్నారు. త్వరితగతిన చేయగలిగిన గోకులం షెడ్స్, సిసి రోడ్లు, బిటి రోడ్లు, డబ్ల్యూ ఎం రోడ్లు, కాంపౌండ్ వాల్ మొదలైన పనులను ఎంపిక చేసుకుని 100% పూర్తి చేసేలా మొదలు పెట్టాలన్నారు. ఈ విషయంలో లక్ష్యం మేరకు పనుల పూర్తితో పాటు నాణ్యతతో ఎలాంటి రాజీ లేకుండా చూడాలన్నారు.ఆకాంక్ష జిల్లాల అభివృద్ధిలో భాగంగా జిల్లాలో ఎంపికైన మండలాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. అంతేకాకుండా ఆయా మండలాల్లోని అన్ని గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నారు. అలాగే ఆయా గ్రామాల్లో వ్యవసాయ అనుబంధ రంగాల్లో చేపట్టాల్సిన అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు.

ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీల సమన్వయ సహకారంతో ఆయా నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న అన్ని రకాల పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.



సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్ కొత్త డిజైన్ పై సూచనలు


జిల్లాలో చేపడుతున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్ల నూతన నమూనాలను పవర్ పాయింట్ ద్వారా ఇంజినీరింగ్ అధికారులకు చూపించిన జిల్లా కలెక్టర్.. కిచెన్ షెడ్ ఔట్ లుక్ డిజైన్ ప్రత్యేకతలను వివరించి అదేలాగున పనులను చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడి అదిశేషారెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ మద్దయ్య, ఆయా శాఖల డివిజనల్ స్థాయి ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పెద్దమ్మ--పోలేరమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవం... చండీ హోమంతో ఆధ్యాత్మిక కార్యక్రమం

పోరుమామిళ్ళ, భారతశక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 8:

కలసపాడు మండలంలో శ్రీ పెద్దమ్మ, పోలేరమ్మ, సత్యమ్మ, ఎల్లమ్మ, శ్రీ వల్లి దేవసేన సహిత సుబ్రమణ్యస్వామి, నాగదేవత, పోతురాజు ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని చండీ హోమము కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలతో కలిసి పురోహితుడు వారణాసి వెంకటరమణయ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి వేదమంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణం



ఆధ్యాత్మిక వాతావరణంతో పరవశించింది. హోమ కుండంలో అగ్ని ప్రజ్వలింపజేసి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై దేవతల ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామ శాంతి, సుభిక్షత, ప్రజల ఆరోగ్యం కోసం ఈ చండీ హోమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు.

# భైంసా పట్టణంలో కాంగ్రెస్ అభ్యర్థుల తరపున విస్తృత ప్రచారం చేసిన డీసీసీ అధ్యక్షులు, ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ భోజ్జు పటేల్ .

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 08 (భారత శక్తి) భైంసా పట్టణంలోని 25వ వార్డులో నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు,ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ భోజ్జు పటేల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరపున విస్తృత ప్రచారం నిర్వహించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అంటేనే అన్ని కులాలు, మతాలు, అన్ని వర్గాలకు చెందిన ప్రజలను సమానంగా ఆదుకునే సెక్యూలర్ పార్టీ అని అన్నారు. అన్ని వర్గాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందనే సిద్ధాంతాన్ని నమ్మే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీయేనని పేర్కొన్నారు.

భైంసా పట్టణ కేంద్రంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తే, ఎంఐఎం పార్టీ కోర్టులో కేసులు వేసి హైకోర్టు నుండి స్టే తెచ్చి ఒక్క ఇల్లు కూడా రాకుండా అడ్డుకుందని ఆరోపించారు. పేద ప్రజల సంక్షేమంపై ఎంఐఎం పార్టీకి ఎలాంటి శ్రద్ధ లేదని, కేవలం తమ రాజకీయ లాభాల కోసమే వారు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

భైంసా పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లాలని ఆయన ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్‌ను గెలిపిస్తే గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారిని భైంసాకు తీసుకువచ్చి, అవసరమైనన్ని నిధులు మంజూరు చేయించి, భైంసా మున్సిపాలిటీని దేశంలోనే రోల్ మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పోరాడే పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. ఎన్నికల అనంతరం భైంసా మున్సిపాలిటీకి పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయించి, భైంసాను దేశానికి ఆదర్శంగా నిలిచే మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి,కాంగ్రెస్ అభ్యర్థులు, నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# పోరుమామిళ్ల పట్టణం ట్రాఫిక్ సమస్యలపై దృష్టిసారించండి: దళిత నాయకులు ముత్యాల ప్రసాద్,చెన్నరాయుడు

పోరుమామిళ్ళ, భారతశక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 8: పోరుమామిళ్ల మండలం కు విచ్చేసిన నూతన సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి. హనుమంతు ను ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ముత్యాల ప్రసాద్ రావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా మరియు పూలమాలతో అభినందనలు తెలిపారు. మాల మహానాడు బద్వేల్ నియోజకవర్గం అధ్యక్షులు ముత్యాల చెన్న రాయుడు, హ్యూమన్ రైట్స్ సెక్రెటరీ గంప శ్రీనివాసులు కలిసి పోరుమామిళ్ల మండలం పట్టణమునందు ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని తెలుపగా, ఎస్ ఐ వెంటనే త్వరలో పరిష్కారం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తారని హామీ ఇచ్చారు.



# బీసీలకు తక్షణమే రక్షణ చట్టం తీసుకురావాలి : జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నరసింహారావు

## బీసీలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చట్టం తప్పనిసరి

పోరుమామిళ్ళ, భారతశక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 8 :

రాష్ట్ర అధ్యక్షులు ఆవుల నరసింహారావు ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడిచినా బీసీల జీవన పరిస్థితులు ఇప్పటికీ మెరుగుపడలేదన్నారు. రాజ్యాంగంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బీసీలకు కల్పించిన హక్కులు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలుకాలేదన్నారు. అందుకే జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రవ్యాప్తంగా పోరాట బాటలో పయనిస్తూ బీసీ హక్కుల సాధనకు ఉద్యమం కొనసాగిస్తోందని తెలిపారు.



దానిలో భాగంగా బద్వేలు నియోజకవర్గంలో మండల, గ్రామ స్థాయి నుంచి సంఘాన్ని పూర్తిస్థాయిలో నిర్మించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు రక్షణ చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అలాగే గత ప్రభుత్వంలో 34 శాతంగా ఉన్న బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించారని, అధికారంలోకి వచ్చిన తరువాత మళ్లీ 34 శాతానికి పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు.

అయితే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చి దాదాపు ఒకటిన్నర సంవత్సరం గడిచినా ఈ హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం అడుగు ముందుకు వేయలేదని విమర్శించారు. బీసీల ఆశలు అడియాసలయ్యాయని పేర్కొన్నారు. వెంటనే బీసీ రక్షణ చట్టాన్ని అమలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం పక్షాన డిమాండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు.కనిగిరి నియోజకవర్గంలో, గుంటూరు జిల్లాలో బీసీలపై జరిగిన దాడులను ఆయన ఉదాహరణగా పేర్కొన్నారు. గుంటూరు జిల్లాలో ఓ రజక సోదరుడు ఆటో నడుపుతుండగా ఆధిపత్య వర్గానికి చెందిన వ్యక్తి మోటార్ సైకిల్ తగిలిందనే కారణంతో అతని బట్టలు ఊడదీసి విద్యుత్ స్తంభానికి కట్టేసి హింసించారని తెలిపారు. ఇటువంటి ఘటనలు బీసీల భద్రతపై తీవ్రమైన ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు.ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీ అయినా బీసీలకు న్యాయం చేస్తుందనే ఆశతో ఎదురు చూశామని, కానీ ఆ ఆశలు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, మాన్యశ్రీ కన్సీరామ్ ఆలోచన విధానంతో పోరాట బాటలో ముందుకు వెళ్తేనే బీసీలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా బీసీలపై, బీసీ మహిళలపై, బీసీ విద్యార్థులపై జరుగుతున్న దాడులను అరికట్టాలంటే బీసీ రక్షణ చట్టం తప్పనిసరిగా తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రణాళికలో బీసీ కులగణన చేపట్టి, ఆ తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూమీరు చేతివృత్తులు, కులవృత్తులు, సేవా వృత్తుల ద్వారా సమాజానికి సంపద సృష్టించినప్పటికీ విద్యకు దూరమై వెనుకబాటుకు గురయ్యారని తెలిపారు. బీసీ విద్యార్థుల కోసం హాస్టల్ మెస్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. బీసీలకు న్యాయం జరిగే వరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్వతంత్ర పోరాటాన్ని కొనసాగిస్తుందని రాష్ట్ర అధ్యక్షులు ఆవుల నరసింహారావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు బి రమణయ్య, డి బాల గురయ్యా, బి పెద్ద బాలసింధయ్య, జె సింగరయ్య, జి వెంకటేశ్వర్లు, బి గురవయ్య, బి వెంకటసుబ్బయ్య, ఎల్ బాలరాజు, (బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు ), బి బాల పేరయ్య, (వన సంరక్షణ ప్రెసిడెంట్ ), సిహెచ్ రామచంద్రయ్య, మాజీ సర్పంచ్ వి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలను ప్రారంభించిన వి. సి

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)ఫిబ్రవరి8:

కాకతీయ యూనివర్సిటీలో సేవాలాల్ మహారాజ్ 287 వ జయంతిని పురస్కరించుకొని కాకతీయ యూనివర్సిటీ బంజారా విద్యార్థులు, సేవాలాల్ సేన క్రికెట్ టోర్నమెంట్, అథ్లెటిక్స్ పోటీలను ఘనంగా ప్రారంభించిన యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ఆచార్య ప్రతాప్ రెడ్డి. కాకతీయ యూనివర్సిటీ బంజారా గిరిజన విద్యార్థులందరూ విద్యతో పాటు శారీరక దృఢత్వం, వ్యాయామ విద్య ఆటలతో సోదర భావాన్ని పెంపొందించి సేవాలాల్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్క బంజారా విద్యార్థి పాటుపడాలని వీసి ఆకాంక్షించారు. ఇంత ఘనంగా కాకతీయ యూనివర్సిటీలో సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని క్రీడలను ఏర్పాటు చేయడంలో బంజారా విద్యార్థుల ఉత్సాహాన్ని కొనియాడారు. గిరిజన విద్యార్థులతో పాటు యూనివర్సిటీలో చదువుతున్న వివిధ డిపార్ట్మెంట్ల విద్యార్థులు ఈ సేవాలాల్ టోర్నమెంట్లో పాల్గొని క్రీడా పోటీలను విజయవంతం చేయాలని, విద్యతో పాటు విజ్ఞానాన్ని, సోదర భావాన్ని పెంపొందించుకోవాలని కాకతీయ యూనివర్సిటీ ఎస్ డి ఎల్ సి ఇ డైరెక్టర్ ప్రొఫెసర్ సురేష్ లాల్ , సైన్స్ డీన్ ప్రొఫెసర్ హనుమంతు లు తెలిపారు.



దాదాపు 32 విభాగాలను చెందిన విద్యార్థులు, గిరిజన సంఘం నాయకులు, సేవాలాల్ సేన ఇతర వర్గాల విద్యార్థులు సేవాలాల్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీలలో పాల్గొన్నందుకు సంతోషంగా ఉందని కాకతీయ యూనివర్సిటీ బంజారా విద్యార్థులు ప్రతి సంవత్సరం సేవాలాల్ జయంతిని చాలా ఉత్సాహంగా పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్న సంగతి యావత్ రాష్ట్ర బంజారా యువకులకు ఎంతో ఆదర్శవంతంగా ఉంటుందని ఇంత పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని క్రీడా పోటీలను చాలా ఉత్సాహంగా నిర్వహిస్తున్న యూనివర్సిటీ బంజారా విద్యార్థులను ముఖ్యంగా అశోక్ నాయక్ ను అతని మిత్రులను అభినందిస్తూ కంటెస్టెడ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ డా.రాజునాయక్ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రెటరీ ప్రొఫెసర్ వెంకయ్య అభినందించారు.

ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్. రమేష్ నాయక్ ,లైబ్రరీ ఇంచార్జ్ జవహర్, ప్రొఫెసర్ ఈసం నారాయణ ,హన్మకొండ సేవాలాల్ సేన అధ్యక్షుడు మురళి నాయక్ మరియు సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షులు సంతోష్ నాయక్, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు పవన్ నాయక్, శ్రీను,వెంకన్న, సచిన్, శ్రీకాంత్,అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి మైనారిటీ మోర్చా రాష్ట్ర సెక్రటరీగా షకీలా బేగం

పోరుమామిళ్ల, భారతశక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 8:

బిజెపి మైనారిటీ మోర్చా రాష్ట్ర సెక్రటరీగా పోరుమామిళ్ల పట్టణానికి చెందిన షకీలా బేగం ను పార్టీ అధిష్టానం నిర్ణయించింది. ఈ నియామకంపై షకీలా బేగం తనను ఎంపిక చేసినందుకు మంత్రి సత్య కుమార్,రాష్ట్ర అధ్యక్షులు పీ.వి.యన్ మాధవ్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ బాషా, లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ నియామకం ద్వారా మైనారిటీ వర్గాలకు పార్టీలో ప్రాధాన్యత కల్పించడం హర్షించదగ్గ విషయం అని సంతోషాన్ని వ్యక్తపరిచారు.

# 32 వార్డులో బిఆర్ఎస్ ప్రచారానికి జోష్

## - నాయి కోటి అశ్విని నవీన్ కుమార్ లభిస్తున్న ప్రజా ఆదరణ
## - గడపగడపకు బీఆర్ఎస్ ప్రచారం

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 8:

సంగారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ 32వ వార్డు అభ్యర్థి నాయి కోటి అశ్విని నవీన్ కుమార్ ఇంటింటికి తిరిగి కార్యకర్తలతో ప్రచారం చేశారు. మున్సిపల్ 32 వ వార్డు అభ్యర్థి నాయికోటి అశ్విని కుమార్ మాట్లాడుతూ గత కాలంలో మేము చేసిన అభివృద్ధి మీ అందరూ చూశారు. కరోనా కష్టకాలంలో కూడా ప్రతి ఇంటికి తిరిగి శానిటైజషన్ చేయడం జరిగింది. గత ఎలక్షన్లో మాట ఇచ్చిన విధంగా గత ఏడు సంవత్సరాలుగా ప్రతి ఇంటికి రోజు మంచినీటి సరఫరా మరియు సొంత నిధులతో టాంకర్ ద్వారా నీటి సరఫరా చేస్తున్నామన్నారు . ప్రతి వీధికి సిసి రోడ్డు డ్రైనేజీ వీధి దీపాలు ఏర్పాటు చేసి వార్డు రేఖలను మార్చాము. వార్డు ప్రజల సౌలభ్యం కోసం కలెక్టర్ వెనకాల పార్కును ఏర్పాటు చేశాము. వాటర్ ట్యాంక్ నిర్మించామని, డ్వాక్రా మహిళల కోసం డ్వాక్రా బిల్డింగ్ నిర్మించి మహిళల ఆత్మగౌరవం పెంచామని అన్నారు.గతంలో చేసిన విధంగానే రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి మన వార్డును అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతామని మాట ఇస్తున్నామని తెలియజేశారు. పాలకుడిగా కాదు ప్రజా సేవకుడిగా ఉంటాను. అందరూ గర్వపడేలా పనిచేస్తాను మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను నన్ను అధిక మెజారిటీతో గెలిపించగలరని అభ్యర్థించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు కాలనీవాసులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు.



# మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా ఫిబ్రవరి 11న పబ్లిక్ హాలిడే: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 08 :

రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు -- 2026 సందర్భంగా ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు, జిల్లాలో ఎన్నికలు నిర్వహించనున్న మున్సిపాలిటీల పరిధిలో ఫిబ్రవరి 11 (బుధవారం) నాడు ప్రభుత్వ సెలవుగా ప్రకటించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న ఎన్నికలు జరగనున్న సంగారెడ్డి, సదాశివపేట, కోహిర్, జహీరాబాద్, నారాయణఖేడ్, జిన్నారం, ఆందోల్--జోగిపేట, ఇస్నాపూర్, ఇంద్రేశం, గడ్డపోతారం, గుమ్మడిదల మున్సిపాలిటీల పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ--ప్రైవేటు సంస్థలు, వ్యాపార సంస్థలకు పబ్లిక్ హాలిడే వర్తిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఎన్నికలు జరగనున్న సంబంధిత మున్సిపాలిటీల పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు మరియు వ్యాపార సంస్థల (ఫర్ములు)లో పనిచేస్తున్న ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ యాక్ట్, 1881 ప్రకారం వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని సంబంధిత యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల పోలింగ్ నిర్వహణకు వినియోగించే అన్ని ప్రభుత్వ భవనాలు, విద్యా సంస్థలకు ఫిబ్రవరి 10 (మంగళవారం) నాడు కూడా సెలవు ప్రకటించినట్లు తెలిపారు. అదేవిధంగా, ఓట్ల లెక్కింపు కోసం వినియోగించే ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల భవనాలకు లెక్కింపుకు ముందు రోజు అయిన ఫిబ్రవరి 12 (గురువారం) మరియు లెక్కింపు రోజు ఫిబ్రవరి 13 (శుక్రవారం) రెండు రోజుల పాటు లోకల్ హాలిడే వర్తిస్తుందని పేర్కొన్నారు. ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతి ఓటరు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కోరారు.



# ఎన్నికల ప్రచారంలో సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రసంగాలు, పోస్టులపై కఠిన చర్యలు: జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 08 (భారత శక్తి): ఎన్నికల ప్రచారం సందర్భంగా సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టే, విద్వేషపూరిత ప్రసంగాలు చేయడం, వాటిని వైరల్ చేయడం పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ హెచ్చరించారు.

ఇటీవల సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఓ ఘటన నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, పట్టణంలోని ఎంఐఎం వార్డు అభ్యర్థి, నాంపల్లి ఎమ్మెల్యేపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ తెలిపారు.

సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర గ్రూపుల్లో అసభ్యకరమైన, అవమానకరమైన, విద్వేషపూరిత పోస్టులు, వీడియోలు లేదా వ్యాఖ్యలను ఫార్వర్డ్ చేసిన వారిపై మాత్రమే కాకుండా, అలాంటి విషయాలను ఫార్వర్డ్ చేయడానికి అనుమతించిన గ్రూప్ అడ్మిన్‌లపైలి కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ లిడా.జి.జానకి షర్మిల ఐపీఎస్ స్పష్టం చేశారు.

విద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం, వాటిని సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా శాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రయత్నాలు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

అదేవిధంగా, సోషల్ మీడియా గ్రూపులు, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికలలో ఎవరు అయినా అసభ్యకరమైన, అవమానకరమైన, విద్వేషపూరిత పోస్టులు, వీడియోలు, వ్యాఖ్యలు చేసినా సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డా.జి.జానకి షర్మిలలి హెచ్చరించారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా మరియు నిష్పక్షపాతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ప్రజలను కోరారు.

# నూతన అక్రిడిటేషన్ కార్డుల జారీ కొరకు దరఖాస్తుల స్వీకరణ: జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, కలెక్టర్ అభిలాష అభినవ్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 07 (భారత శక్తి) జిల్లాస్థాయి అక్రిడిటేషన్ కార్డుల జారీ కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో అక్రిడిటేషన్ మాడ్యూల్‌తో కూడిన వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్లు ఆమె తెలిపారు.



2026--28 సంవత్సరాలకు గాను అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించబడుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈ నెల 28వ తేదీతో ముగియనుందని, అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు నూతన అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయబడతాయని పేర్కొన్నారు.

మీడియా యాజమాన్యాలు తమ ప్రతినిధుల పేర్లను జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయానికి పంపించాలని సూచించారు. ఆ జాబితాలో ఉన్న అభ్యర్థులు https://ipr.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 9వ తేదీ నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.

# సైబర్ నేరాలపై సైబరాబాద్ పోలీసుల ఉక్కుపాదం -9 కేసుల ఛేదన, 12 మంది నిందితుల అరెస్టు

సైబరాబాద్, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 8:

సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు 2026 జనవరి 30 నుంచి ఫిబ్రవరి 5 వరకు చేపట్టిన ప్రత్యేక దర్యాప్తులో భాగంగా మొత్తం 9 సైబర్ క్రైమ్ కేసులను విజయవంతంగా ఛేదించి, దేశంలోని పలు రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న 12 మంది నిందితులను అరెస్టు చేసినట్లు సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్ తెలిపారు.

ఈ అరెస్టుల్లో అత్యధికంగా 7 అరెస్టులు ట్రేడింగ్ మోసాలకు సంబంధించినవని తెలిపారు. మొత్తం కేసుల్లో ట్రేడింగ్ ఫ్రాడ్, జాబ్ ఫ్రాడ్, పార్ట్‌టైం జాబ్ ఫ్రాడ్, మ్యాట్రిమోనీ ఫ్రాడ్ వంటి వివిధ రకాల సైబర్ నేరాలు ఉన్నట్లు వెల్లడించారు.

అదే సమయంలో బాధితులకు ఊరట కలిగించే విధంగా సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్, సైబరాబాద్ 58 కేసుల్లో 406 రిఫండ్ ఆర్డర్లను సాధించిందని డీసీపీ తెలిపారు. వీటి ద్వారా మొత్తం ?1,04,17,082/- రూపాయలను బాధితులకు తిరిగి చెల్లించనున్నట్లు చెప్పారు. ఇది సైబర్ నేరాలపై కఠిన చర్యలతో పాటు బాధితుల ఆర్థిక పరిరక్షణకు పోలీస్ శాఖ ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.

ఈ దర్యాప్తులో కీలకంగా వెలుగులోకి వచ్చిన కేసుల్లో ఒకటిగా ?22.80 లక్షల జాబ్ ఫ్రాడ్ కేసు ఉందని డీసీపీ వివరించారు. ఈ కేసులో నిందితులు ఒక ప్రముఖ ఎంఎన్‌సీలో సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి బాధితుడి నుంచి ?20,80,007/- తీసుకున్నారని తెలిపారు. నిందితుడు జాబ్ పోర్టల్ ఉద్యోగిలాగా నటిస్తూ దరఖాస్తు, ఇంటర్వ్యూ, ప్రాసెసింగ్ ఛార్జీల పేరుతో డబ్బు వసూలు చేశారని, డబ్బు తీసుకున్న తర్వాత అపాయింట్‌మెంట్ లెటర్ ఇవ్వకుండా, రీఫండ్ కూడా చేయకుండా పూర్తిగా స్పందించడం మానేశారని వివరించారు. ఈ కేసులో ప్రధాన నిర్వాహకుడైన పురుషోత్తం శర్మతో పాటు, కమిషన్ ఆధారంగా సిమ్ కార్డులు మరియు బ్యాంకు ఖాతాలు సరఫరా చేసిన కుల్దీప్ కుమార్ ఏ సునీల్ అనే ఇద్దరు ఢిల్లీకి చెందిన నిందితులను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసినట్లు వెల్లడించారు. నిందితులు మోసపోయిన మొత్తాన్ని అనేక బ్యాంకు ఖాతాల కు మళ్లించినట్లు దర్యాప్తులో తేలిందన్నారు.

ప్రజలు ఉద్యోగాలు, పెట్టుబడుల పేరుతో సోషల్ మీడియా లేదా జాబ్ పోర్టల్స్ ద్వారా వచ్చే ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీసీపీ టి. సాయి మనోహర్ సూచించారు. ఉద్యోగ దరఖాస్తులు, ఇంటర్వ్యూలు లేదా అపాయింట్‌మెంట్‌ల కోసం ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బు చెల్లించవద్దని, నిజమైన కంపెనీలు ముందస్తుగా రుసుములు వసూలు చేయవని గుర్తుంచుకోవాలని తెలిపారు. వ్యక్తిగత వివరాలు లేదా చెల్లింపులు చేసే ముందు అధికారిక వెబ్‌సైట్లు లేదా సంబంధిత హెచ్‌ఆర్ విభాగాల ద్వారా ధృవీకరణ చేసుకోవాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని లేదా ఞఞఞ.ఎఎవతీఏతీఱఎవ.స్త్రశీఙ.ఱఅ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని డీసీపీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# APPSC పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలి: ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి

వై.ఎస్.ఆర్. కడప, ఫిబ్రవరి 08(భారత శక్తి):

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ూూూూజ) ఆధ్వర్యంలో ఈ నెల 09 నుండి 11 తేదీల వరకు నిర్వహించనున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ మరియు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రేడ్--××× పోస్టుల నియామక పరీక్షలను పటిష్టంగా, పారదర్శకంగా నిర్వహించాలని ఇంచార్జి జిల్లా రెవిన్యూ అధికారి వెంకటపతి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని జిల్లా రెవిన్యూ అధికారి ఛాంబర్‌లో పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి మాట్లాడుతూ, జిల్లాలోని మూడు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా సజావుగా నిర్వహించాలన్నారు. అభ్యర్థులను ఉదయం 08.00 నుండి 08.45 గంటల వరకు, మధ్యాహ్నం 01.00 నుండి 01.45 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, పోలీసు శాఖ సమన్వయంతో పనిచేసి పరీక్షలు సాఫీగా జరిగేలా చూడాలని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయబడిందన్నారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆయా పరీక్షా కేంద్రాల యాజమాన్యాలు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని సూచించారు. జిల్లాలో కడప నగర పరిధిలో రెండు, చింతకొమ్మదిన్నె మండల పరిధిలో ఒక పరీక్షా కేంద్రాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వివరాలు ూఅఅవఞబతీవ--×లో పొందుపరచినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా, కలెక్టర్ కార్యాలయంలో ూూూజ పరీక్షలకు సంబంధించి 09.02.2026 నుండి 11.02.2026 వరకు కార్యాలయ సమయాల్లో అభ్యర్థుల సహాయార్థం హెల్ప్‌డెస్క్ (ఫోన్ నెం: 08562-246344) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పరిపాలన అధికారి శ్రీ కె. విజయ కుమార్, ూూూజ జిల్లా ప్రత్యేక అధికారులు శ్రీ జి. అశోక్ (అసిస్టెంట్ సెక్రటరీ), శ్రీ పి. రమేష్ (అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్), లైజన్ ఆఫీసర్లు మరియు చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీఎస్ ఈ సిబ్బంది, లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు మరియు లేబర్, పోలీస్, మెడికల్, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేయాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 08 (భారత శక్తి ) నిర్మల్ జిల్లా మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు



సమన్వయంతో పనిచేసి ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై సంబంధిత నోడల్ అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశ కీలకమని పేర్కొన్న కలెక్టర్, ఎన్నికలు నిష్పక్షపాతంగా, ఎటువంటి అంతరాయాలు లేకుండా జరిగేలా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. పోలింగ్, కౌంటింగ్ సిబ్బందికి సమగ్ర శిక్షణ ఇవ్వాలని, కౌంటింగ్ సిబ్బంది రాండమైజేషన్‌ను ఎన్నికల నిబంధనల ప్రకారం ఖచ్చితంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియలో ఎటువంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్యాలెట్ బాక్సుల రవాణా, బ్యాలెట్ పేపర్ల ముద్రణ, ఎన్నికల సామగ్రి సరఫరా వంటి అంశాల్లో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల్లో నిఘా వ్యవస్థ పటిష్టంగా ఉండాలని, సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీ, వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లను ముందుగానే తనిఖీ చేసి సిద్ధం చేయాలని ఆదేశించారు. సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, కౌంటింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు, వారి ప్రతినిధులు, సిబ్బందికి సౌకర్యార్థం హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ నెల 8, 9 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అన్ని సదుపాయాలు సిద్ధం చేసినట్లు తెలిపారు.

ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నాకళ్యాణి, వివిధ శాఖల నోడల్ అధికారులు భోజన్న, శ్రీనివాస్, శంకర్, రమణ, విష్ణువర్ధన్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సర్ఫరాజ్, ఈ డి ఎం నదీమ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి గడ్డపై మున్సిపల్ ఎన్నికల ప్రచారం, విపక్షాలపై విమర్శల గర్జన గళమెత్తిన షబ్బీర్ అలీ

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఫిబ్రవరి 08: బిఆర్ఎస్ అవినీతి అడ్డా, బిజెపి విభజన రాజకీయాల క్రీడ చేయి' గుర్తుతోనే ఇందిరమ్మ రాజ్యం సాధ్యం.



కామారెడ్డి పట్టణంలోని 8, 12, 31, 34, 35, 36, 37 వార్డులలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఉధృత స్థాయిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో ఆయన బిఆర్ఎస్ కుటుంబ పాలనను, బిజెపి ద్వంద్వ వైఖరిని ఎండగడుతూ ప్రసంగం చేశారు.

అబద్ధాల బిఆర్ఎస్.. విభజన బిజెపి రెండింటినీ బంగాళాఖాతంలో కలపాలని మహమ్మద్ షబ్బీర్ అలీ పిలుపునిచ్చారు.

కాళేశ్వరం వారి ఏటీఎం.. ధరణి వారి ధనదాహం బిఆర్ఎస్ పై షబ్బీర్ అలీ నిప్పులు కక్కాడు.

పదేళ్ల కాలంలో నీళ్లు ఫామ్ హౌస్ కు, నిధులు కాంట్రాక్టర్ల జేబుల్లోకి వెళ్లాయి.

నీళ్లు, నిధులు, నియామకాలు అనే ఆకాంక్షలను కాలరాసి, కేవలం ఒక్క కుటుంబం మాత్రమే లబ్ధి పొందింది.

ధరణి పోర్టల్ సామాన్య రైతులకు శాపంగా మారింది," అని షబ్బీర్ అలీ విమర్శించారు.


బిజెపి - బిఆర్ఎస్ ఒకే నాణేనికి రెండు ముఖాలు

బిజెపి ఎమ్మెల్యే వైఖరిని తప్పుబడుతూ, ఢిల్లీలో దోస్తీ - గల్లీలో కుస్తీ పడుతున్నట్లు ఈ రెండు పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయి. బిఆర్ఎస్ అవినీతిపై కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ధరల పెరుగుదలతో సామాన్యుడి నడ్డి విరుస్తూ, మతం పేరుతో రాజకీయాలు చేయడం బిజెపి నైజమని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు భరోసాసోనియా గాంధీ ఇచ్చిన తెలంగాణను అభివృద్ధి చేసే బాధ్యత కాంగ్రెస్ పార్టీదే అని స్పష్టం చేశారు. మార్పు కావాలి - కాంగ్రెస్ రావాలి అనే నినాదంతో ముందుకు సాగాలి కామారెడ్డి మున్సిపల్ కాంగ్రెస్ జెండా ఎగర వేయాలి అభివృద్ధికి బాట వేయాలి. ఈ ప్రచారంలో వార్డు అభ్యర్థులు స్థానికం నాయకులు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ మార్షల్స్ కు ?1 లక్ష ప్రమాద బీమా: సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్

సైబరాబాద్, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 8:

ట్రాఫిక్ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తున్న ట్రాఫిక్ మార్షల్స్ భద్రతకు పెద్దపీట వేస్తూ సైబరాబాద్ పోలీసులు పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. సైబరాబాద్ పోలీస్



కమీషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ మార్షల్స్ అందరికీ ?1 లక్ష ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్, ఐపీఎస్., ప్రకటించారు. సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ) ఆధ్వర్యంలో, స్కోర్ 10 సంస్థ ఆర్థిక సహకారంతో ఇన్సూరెన్స్/బీమా సౌకర్యం కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. ఈరోజు సైబరాబాద్ ఆడిటోరియం లో ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రాఫిక్ మార్షల్స్ కు ఇన్సూరెన్స్ కార్డులను సీపీ అందజేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనల అమలులో ట్రాఫిక్ మార్షల్స్ పోలీసులతో సమానంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా వారికి చట్టబద్ధమైన అధికారాలు, అధికారిక గుర్తింపు కల్పించామన్నారు. ట్రాఫిక్ లో విధులు నిర్వర్తిస్తున్న మార్షల్స్కు ఏదైనా అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆర్థిక భరోసా కల్పించాలానే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. బీమాతో పాటు మార్షల్స్ కు ప్రాథమిక చట్టపరమైన అంశాలు, ''నో హాంకింగ్'' వంటి అంశాలపై శిక్షణ నిర్వహిస్తామన్నారు.

స్కోర్ 10 చైర్మన్ నారాయణ స్వరూప్ మాట్లాడుతూ.. సైబరాబాద్ ట్రాఫిక్ మార్షల్స్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని, అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడిన సంఘటనలు ఉన్నాయని గుర్తుచేశారు. సామాజిక బాధ్యతతో ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ మార్షల్స్ రక్షణకు తమ సంస్థ స్కోర్ 10 తరుపున బీమా సౌకర్యం కల్పించడం సంతోషమన్నారు.

మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిర్వహణ, ప్రజా భద్రతను కాపాడడంలో ట్రాఫిక్ మార్షల్స్ పోలీస్ సిబ్బందితో సమానంగా అంకితభావంతో పనిచేస్తున్నారని అన్నారు.

# సినిమా

## తాగుబోతును చితకబాదా



సూపర్ స్టార్ రజనీకాంత్ కబాలి మూవీతో కుర్రకారును మెప్పించిన ముద్దుగుమ్మ సాయిధన్సిక.. ఆ తర్వాత షికారు సినిమాతో తెలుగువారిని పలకరించింది. అలాగే అంతిమ తీర్పుతో పాటు, తమిళ, మలయాళ, కన్నడ చిత్రాల్లోనూ మెరిసింది. ప్రస్తుతం ఈ అమ్మడు లీడ్ రోల్‌లో నటించిన 'యోగి డా' ఈ నెల 6న ప్రేక్షకులకు ముందుకు వచ్చింది. ఇందులో ఆమె పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించింది. గౌతమ్ కృష్ణ దర్శకత్వం వహించగా.. వీ సెంథిల్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు. తాజాగా యోగి డా మూవీ ప్రమోషన్స్‌లో పాల్గొన్న సాయిధన్సిక.. ఓ ఇంటర్వ్యూలో తన జీవితంలో జరిగిన ఇంట్రెస్టింగ్ విషయాలను పంచుకుంది. 'కేరళలో మూవీ షూటింగ్ జరుగుతున్న సమయంలో ఓ వ్యక్తి ఫొటో దిగేందుకు వచ్చాడు. అతడు మద్యం తాగి ఉండటంతో ఫొటో ఇచ్చేందుకు నా అంకుల్ ఒప్పుకోలేదు. దీంతో అంకుల్ని కొట్టి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అది చూసి కోపంలో వెళ్లి అతడిని చితకబాదా. దర్శకుడు, హీరో నన్ను కంట్రోల్ చేసేందుకు ట్రై చేశారు. నా మనుషుల్ని ఏదైనా అంటే నేను చూస్తూ ఊరుకోలేను. అందుకే విచక్షణారహితంగా కొట్టాను' అంటూ చెప్పుకొచ్చింది. ఇకపోతే సాయిధన్సిక, హీరో విశాల్ త్వరలోనే పెండ్లి చేసుకోబోతున్న విషయం తెలిసిందే!





## మూడో ప్రపంచ దేశం కాదు

ఇటీవల భారత క్రికెట్ జట్టు అండర్ 19 క్రికెట్ వరల్డ్ కప్‌టైటిల్‌సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. సగటు భారతీయుడు గర్వంగా ఫీలయ్యే ఈ సక్సెస్ పట్ల బిగ్‌బీ అమితాబ్ బచ్చన్ కూడా తన సంతోషం వ్యక్తం చేశాడు. అదే సమయంలో తనకు గతంలో ఎదురైన ఒక చేదు అనుభవాన్ని గుర్తు చేసుకున్నాడు. ఒక దేశంలో జరిగిన ఫిల్మ్ ఫెస్టివల్ కోసం తనను ఆహ్వానించినప్పుడు విమానంలో వెళ్తుండగా ఒక వార్తాపత్రిక చూశాడట. భాష అర్థంకాక ఎయిర్ హోస్టెస్‌ను అడిగి తెలుసుకున్నాడట. విమానం దిగిన తర్వాత అక్కడి అభిమానులంతా తన చుట్టూ గుమిగూడారట. విమానం నుంచి ఇమ్మిగ్రేషన్ డెస్క్‌కు చేరుకోవడంలో చాలా ఇబ్బంది పడ్డాడట. పరిస్థితి గందరగోళంగా మారడంతో పోలీసులు వచ్చి హోటల్‌కు తీసుకెళ్లారట. ఆ ఘటన తర్వాత ఓ సీనియర్ జర్నలిస్ట్ ఆయన గురించి ఒక వార్తా కథనాన్ని రాశాడట. దాని శీర్షిక 'మూడో ప్రపంచ దేశం నుంచి వచ్చిన థర్డ్ రేట్ నటుడికి ఇంత ప్రాధాన్యత ఎందుకు ఇస్తున్నారు..!' అని ఉందట. తన గురించి మూడో తరగతి నటుడి మాటలు సరైనవే. కానీ భారతదేశాన్ని మూడో ప్రపంచం అని పిలవడం బాధాకరం అని తన బ్లాగ్ లో రాసుకొచ్చాడు.

## అదేం రూల్



చెన్నైలోని గ్రీన్ పార్క్ హోటల్‌లో తాజాగా మంచు లక్ష్మి చేదు ఎదురైంది. ఆ విషయాన్ని ఆమె సోషల్ మీడియాల స్వయంగా ఓ వీడియా రూపంలో వెల్లడించింది. దీంత అది కాస్త వైరల్ గా మారుతోంది. ఒక సినిమా ప్రమోష కోసం చెన్నై వెళ్లినప్పుడు రూమ్ తీసుకున్నారట. తనత పాటు తన కెమెరామెన్‌ను లోపలికి తీసుకెళ్లగా హోటల్ సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేశారట హోటల్ రూమ్‌లోకి కెమెరాలను అనువ తించబోమని రిసెప్షనిస్ట్ చెప్పడంత వాగ్వాదం జరిగిందట. ఈ హోటల్ స్టాండర్డ్స్ ని మెచ్చుకున్న మంచ లక్ష్మి తనకు ఎదురైన ఇబ్బంది గురించి సిబ్బందిపై విరుచుకు డింది. తాను ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో హోటళ్లకు వెళ్లానని, ఎక్కడ ఇలాంటి నిబంధనలు చూడలేద పేర్కొంది. కనీసం చిన్న కెమెరాన కూడా అనుమతించకపోవడ పట్ల అసహనం వ్యక్తం చేసింది కనీసం కెమెరామెన్ కోసం వేరొక రూమ్ అడిగినా దానికి కూడా అంగీకరించ లేదట. ఇక అసలు విషయం ఏమిటంటే.. తన కెమెరా సిబ్బంది గతంలో అదే హోటల్ లో ఉండి ఫోటోలు దిగారని ఆధ రాల్ని చూపించే ప్రయత్నం చేసింది. ఇక సినిమాల విషయానికొస్తే.. తమిళంలో ఆమె నటించిన వూకీ అనే చిత్రం ఈ నెల 13న రిలీజ్ కానుంది.

## 2027 సంక్రాంతికి అక్కినేని హీరో మూవీ.. 'అన్నపూర్ణ స్టూడియోస్' ఆసక్తికర పోస్టు



సినిమాల పరంగా సంక్రాంతి సీజన్‌కు ఎంతటి క్రేజ్ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆ పండగను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేకంగా సినిమాలు చేసేవారూ ఉన్నారు. 2027 సంక్రాంతికి తమ నిర్మాణ సంస్థ నుంచి ఓ సినిమా రానుందని 'అన్నపూర్ణ స్టూడియోస్' తాజాగా ప్రకటించడంతో.. అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. హీరో, సినిమా పేరు తదితర వివరాలేవీ వెల్లడించకుండా.. మూవీ రిలీజ్ డేట్ మార్క్ చేసుకోండంటూ అప్పుడే ప్రమోషన్‌ను ప్రారంభించింది. "వాసివాడి తస్సాదియ్యా.. 2027 సంక్రాంతికి సోగ్గాళ్లు వస్తే పండగ ఇంకా కలర్‌ఫుల్ ఉంటుంది కదా" అంటూ సినిమా జనవరి 15న విడుదల కానుందని ప్రకటించింది. 'సోగ్గాడే చిన్నినాయనా', 'బంగార్రాజు' తర్వాత నాగార్జున హీరోగా దర్శకుడు కల్యాణ్ కృష్ణ మరో సినిమా తెరకెక్కించే అవకాశాలున్నాయంటూ ప్రచారం జరుగుతోంది. నిర్మాణ సంస్థ అప్‌డేట్‌తో దానికి బలం చేకూరినట్లైంది. వాసివాడి తస్సాదియ్యా.. 'బంగార్రాజు'లోని ఫేమస్ డైలాగ్. పైగా సోగ్గాడు కాకుండా 'సంక్రాంతికి సోగ్గాళ్లు' అని పేర్కొన్నారు. 'బంగార్రాజు'లో నాగార్జున, నాగచైతన్య కలిసి నటించిన సంగతి తెలిసిందే. మళ్లీ ఈ ఇద్దరితోనే దానికి కొనసాగింపుగా కల్యాణ్ కృష్ణ మరో సినిమా చేస్తున్నారా? వేరే కథను తెరకెక్కిస్తున్నారా? నాగార్జున కల్యాణ్ కాంబినేషన్‌ను దృష్టిలో పెట్టుకుని 'సంక్రాంతి సోగ్గాళ్లు' అన్నారా? తెలియాలంటే వేచి చూడాల్సిందే.

ఈ అగ్ర హీరోల సినిమాలు సైతం: చిరంజీవి బాబీ, బాలకృష్ణ గోపీచంద్ మలినేని, వెంకటేశ్ అనిల్ రావిపూడి సినిమాలు సైతం 2027 సంక్రాంతికి వచ్చే అవకాశాలున్నాయి. ఒకవేళ ఈ నలుగురు అగ్ర హీరోల సినిమాలు ఒకేసారి బాక్సాఫీసు వద్ద సందడి చేస్తే.. తెలుగు ప్రేక్షకులకు నిజంగా పండగే.

## అజిత్‌తో శివకార్తికేయన్.. స్ఫూర్తిదాయకమంటూ పోస్టు.. ఫొటోలు వైరల్



అబుదాబిలో జరుగుతున్న 'యాస్ స్పీడ్ ఫెస్టివల్'లో ప్రముఖ నటుడు, ప్రొఫెషనల్ రేసర్ అజిత్‌ను మరో నటుడు శివకార్తికేయన్ కలిశారు. ఆయనతో దిగిన ఫొటోలను అభిమానులతో పంచుకుంటూ.. 'స్ఫూర్తిదాయకమైన వ్యక్తితో ఒకరోజు' అంటూ ఆనందం వ్యక్తం చేశారు. చేసే పనిపై ఆసక్తి, అంకితభావం అంటే ఏంటో ప్రత్యక్షంగా చూశానంటూ అజిత్‌ను కొనియాడారు. ఈ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. 'కాంబినేషన్ అదిరింది' అంటూ ఈ హీరోల ఫ్యాన్స్ సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు. రేసింగ్‌లో అజిత్ టీమ్ అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటిన సంగతి తెలిసిందే. అబుదాబిలోని యాస్ మెరినా సర్క్యూట్‌లో జరుగుతున్న రేస్‌లో పాల్గొంది. నేటి (ఫిబ్రవరి 8) ఫెస్టివల్ పూర్తికానుంది. అజిత్ రేసింగ్ కెరీర్‌పై ఓ ప్రాజెక్టు తెరకెక్కించనున్నట్లు దర్శకుడు ఎ.ఎల్. విజయ్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పడం గమనార్హం. సినిమాల విషయానికొస్తే.. గతేడాది 'విదాముయార్చి', 'గుడ్ బ్యాడ్ అగ్లీ'తో ప్రేక్షకుల ముందుకొచ్చారు అజిత్. శివ కార్తికేయన్ లేటెస్ట్ మూవీ 'పరాశక్తి' జనవరిలో థియేటర్లలో విడుదలైంది. ప్రస్తుతం ఓటీటీ 'జీ 5'లో స్ట్రీమింగ్ అవుతోంది.

## మొదలయ్యేది... మార్చి నుంచే!

విజయోత్సాహంలో ఉన్న చిరంజీవి పెద్దగా విరామం తీసుకోకుండానే కొత్త సినిమా కోసం రంగంలోకి దిగనున్నారు. మార్చి నుంచే ఆ చిత్రం షురూ కానుంది. ఆ మేరకు చిత్రబృందం ప్రణాళికలు రచించినట్లు తెలుస్తోంది. సంక్రాంతికి 'మన శంకరవరప్రసాద్‌గారు' సినిమాతో ఘన విజయాన్ని సొంతం చేసుకున్నారు చిరంజీవి. ఆ సినిమా సెట్స్‌పై ఉండగానే, బాబీ కొల్లి దర్శకత్వంలో సినిమా చేయడానికి పచ్చజెండా ఊపారు. ఇప్పటికే పూర్వ నిర్మాణ పనులన్నీ పూర్తి చేసిన బాబీ... వెంటనే సినిమాని పట్టాలెక్కించేందుకు సిద్ధమయ్యారు. తండ్రి, కూతురు కథతో ఆ చిత్రం రూపొందనున్నట్టు సమాచారం.

## అలా విడుదలై ఉంటే.. 'ధురంధర్' కలెక్షన్లు ఇంకా పెరిగేవి: ఆమిర్‌ఖాన్





రణ్‌వీర్ సింగ్ హీరోగా తెరకెక్కిన 'ధురంధర్' బాక్సాఫీసు వద్ద ఘన విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా 1300+ కోట్ల కలెక్షన్లతో రికార్డు నెలకొల్పింది. ఈ సినిమా ఇంకా ఎక్కువ స్క్రీన్లలో ప్రదర్శితమై ఉంటే.. మరిన్ని వసూళ్లు రాబట్టేదని బాలీవుడ్ ప్రముఖ నటుడు ఆమిర్‌ఖాన్ అభిప్రాయపడ్డారు. ఇప్పటికీ పలు జిల్లాల్లో థియేటర్లు లేవని, వాటి సంఖ్య పెరిగినప్పుడే ఇండస్ట్రీలో మార్పొస్తుందని పేర్కొంటూ రీసెంట్ హిట్ 'ధురంధర్'ను ఉదాహరణగా చెప్పారు. 5 వేలకుపైగా స్క్రీన్లలో ప్రదర్శితమైన ఈ చిత్రం 15 వేల థియేటర్లలో రిలీజ్ అయి ఉంటే వసూళ్లు ఇంకా పెరిగేవి అని అన్నారు. భారత్‌తో మరిన్ని థియేటర్లను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆమిర్ వ్యాఖ్యానించారు. "చైనాలో దాదాపు లక్ష స్క్రీన్లు ఉంటే.. మన వద్ద 9 వేలకుపైగా ఉన్నాయి. చైనాలో విడుదలయ్యే సినిమాలకు మంచి బిజినెస్ జరుగుతోంది. గతేడాది విడుదలైన చైనీస్ మూవీ 'నె ఝా 2' సినిమా కలెక్షన్లు 2+ బిలియన్ డాలర్లు (18వేల కోట్లు+). భారత్‌లో 'ధురంధర్' వసూళ్లు 115 మిలియన్ డాలర్లు (రూ.1000+ కోట్లు)" అని అన్నారు. థియేటర్ల గురించి ఆమిర్ మాట్లాడటం ఇదే తొలిసారి కాదు. భారత్‌లో థియేటర్ల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందని గత ఇంటర్వ్యూల్లోనూ పేర్కొన్నారు.

*** 'ధురంధర్'లాంటి సినిమాలు ఎన్ని?: ఎగ్జిబిటర్**

ఆమిర్ కామెంట్లపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తరాదికి చెందిన ఓ ఎగ్జిబిటర్ స్పందిస్తూ.. 'ధురంధర్'లాంటి సినిమాలు ఏడాదికి ఎన్ని విడుదలవుతున్నాయో గ్రహించాలన్నారు. నిజంగానే థియేటర్ల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందని, కానీ అంతకన్నా ముఖ్యంగా ఆ స్థాయిలో సినిమాలు రావాలన్నారు.

# ఆక్రమణదారుల గుప్పిట నుంచి రూ. 7 కోట్ల భూమి విముక్తి!

* చక్రపురి కాలనీలో 'హైడ్రా' మెరుపు చర్య.. పార్కు స్థలానికి పక్కాగా ఫెన్సింగ్
* ప్రజావాణి ఫిర్యాదుపై వెనువెంటనే స్పందన.. హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

అమీన్‌పూర్, ఫిబ్రవరి 8 (భారత శక్తి ప్రతినిధి) : బహిరంగ ప్రదేశాలు, పార్కు స్థలాలపై కన్నేసే భూబకాసురులకు 'హైడ్రా' మరోసారి గట్టి హెచ్చరిక పంపింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని చక్రపురి కాలనీలో ఆక్రమణకు గురవుతున్న కోట్లాది రూపాయల విలువైన పార్కు స్థలాన్ని అధికారులు ఆదివారం పక్కా ప్రణాళికతో స్వాధీనం చేసుకున్నారు.




సుమారు రూ. 7 కోట్ల విలువ చేసే 1253.8 గజాల స్థలానికి రక్షణ కవచం ఏర్పాటు చేశారు.

**నిబంధనలు బేఖాతరు..**

చక్రపురి కాలనీలోని సర్వే నంబర్ 135లో ఉన్న ఈ స్థలాన్ని 1985లోనే హుడా (HUDA) లేఅవుట్ (LP No. 3814/MP2/HUDA/85) ప్రకారం పార్కు మరియు రోడ్ల కోసం కేటాయించారు. 2022లో గిఫ్ట్ డీడ్ ద్వారా ఈ భూమిని స్థానిక సంస్థలకు అప్పగించినప్పటికీ, ఇటీవల కొందరు రియల్టర్లు కబ్జాకు యత్నించారు. స్థలం చుట్టూ ఉన్న సరిహద్దు రాళ్లను తొలగించి చాపకింద నీరులా ఆక్రమణకు తెరలేపారు.

**రంగంలోకి 'హైడ్రా' సేన..**

కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు 'హైడ్రా' ప్రజావాణిలో ఫిర్యాదు చేయడమే ఆలస్యం.. కమిషనర్ ఏవీ రంగనాథ్ యంత్రాంగాన్ని ఉసిగొల్పారు. ఆదివారం ఉదయమే రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి హైడ్రా బృందం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టింది. రికార్డుల ప్రకారం అది పార్కు స్థలమేనని తేలడంతో తక్షణమే చర్యలు ప్రారంభించింది.

* పక్కాగా రక్షణ: ఆక్రమణదారులకు అవకాశం లేకుండా స్థలం చుట్టూ ఇనుప కంచె (ఫెన్సింగ్) ఏర్పాటు చేశారు.
* హెచ్చరిక బోర్డులు: "ఇది పార్కు స్థలం హైడ్రా" అని స్పష్టంగా పేర్కొంటూ బోర్డులను పాతిపెట్టారు.

**జన నినాదం.. హైడ్రా జిందాబాద్!**

తమ కాలనీ పిల్లల కోసం, స్వచ్ఛమైన గాలి కోసం కేటాయించిన స్థలం తిరిగి దక్కడంతో కాలనీవాసుల ఆనందానికి అవధులు లేవు. అధికారుల పనితీరును ప్రశంసిస్తూ స్థానికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. "ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో హైడ్రా చూపుతున్న చొరవ అభినందనీయం" అని కాలనీవాసులు పేర్కొన్నారు.




## ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ వెన్నుముక

: జక్కిడి ప్రభాకర్ రెడ్డి

ఎల్బీనగర్ , ఫిబ్రవరి 8 (భారత శక్తి ప్రతినిధి) : మార్షల్ ఆర్ట్స్ అనేది కేవలం ఒక క్రీడ మాత్రమే కాదని, అది వ్యక్తిగత క్రమశిక్షణతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే అద్భుత విద్య అని టీపీసీసీ ప్రతినిధి, మాజీ నేషనల్ బాడీబిల్డర్ శ్రీ జక్కిడి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎల్బీనగర్ నియోజకవర్గంలోని ప్రళవి గార్డెన్స్‌లో డైనమిక్ టైక్వాండో క్లబ్ & గంఘాన్ టైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వరల్డ్ ఫేమస్ మార్షల్ ఆర్ట్స్ కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు: మానసిక ధృడత్వానికి మార్గం: మార్షల్ ఆర్ట్స్ ద్వారా విద్యార్థులు తమ శరీరాన్నే కాకుండా, మనసును కూడా బలంగా తీర్చిదిద్దుకోవచ్చని కొనియాడారు. మహిళా రక్షణ: నేటి కాలంలో బాలికలకు ఆత్మరక్షణ విద్య ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ కరాటే వంటి విద్యల్లో ప్రావీణ్యం సంపాదించాలని సూచించారు. ప్రభుత్వ సహకారం: క్రీడల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ప్రభుత్వం తరపున ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తామని, విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

**ఘనంగా బెల్ట్ ప్రమోషన్ వేడుక:**

ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ తదుపరి స్థాయి బెల్టులను అందుకున్నారు. కార్యక్రమంలో ఎగ్జామినర్ ప్రవీణ్ కుమార్, కోచ్‌లు మణిదీప్, రజని, వెంకట్, సాయి కుమార్, మరియు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జనవాసాల్లో రైస్ మిల్లు సెగ.. తొలగించాల్సిందే!

* నిరసన తెలిపిన కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి
* దుమ్ము, ధూళిపై శివాజీ కాలనీ వాసుల ఆందోళన

హయత్ నగర్, , ఫిబ్రవరి 8 (భారత శక్తి ప్రతినిధి) : నివాస ప్రాంతాల మధ్య కొనసాగుతున్న రైస్ మిల్లు కాలనీ వాసుల పాలిట శాపంగా మారింది. మిల్లు నుంచి వెలువడుతున్న కాలుష్యం వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని, తక్షణమే దాన్ని ఇక్కడి నుంచి తరలించాలని డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం శివాజీ కాలనీలోని రైస్ మిల్లు వద్ద కాలనీ వాసులతో కలిసి ఆయన నిరసన చేపట్టారు.

**అనారోగ్య కోరల్లో కాలనీవాసులు:**

ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. శివాజీ కాలనీ, పరిసర ప్రాంతాల్లో వెలుస్తున్న రైస్ మిల్లు వల్ల వెలువడుతున్న దుమ్ము, శబ్ద కాలుష్యం హద్దులు దాటుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య కారక పదార్థాల వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాసకోశ వ్యాధులు, అలర్జీల బారిన పడుతున్నారని మండిపడ్డారు. నివాసాల మధ్య ఇలాంటి పరిశ్రమలు నడపడం చట్టవిరుద్ధమని



ఆయన స్పష్టం చేశారు.

**యాజమాన్యం తీరుపై ఆగ్రహం**

గత కొన్నేళ్లుగా మిల్లును తరలించాలని కోరుతున్నా, యాజమాన్యం గడువుల పేరుతో కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తోందని కార్పొరేటర్ ధ్వజమెత్తారు. "అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడం దురదృష్టకరం. ప్రజల ఆరోగ్యం కంటే వ్యాపార ప్రయోజనాలే ముఖ్యమా?" అని ఆయన ప్రశ్నించారు. తక్షణమే అధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కాలనీ వాసులతో కలిసి భారీ ఎత్తున ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.

**మద్దతుగా కాలనీ సంఘాలు**

కార్పొరేటర్ చేపట్టిన ఈ నిరసన కార్యక్రమానికి స్థానిక సంక్షేమ సంఘాల నుంచి భారీ స్పందన లభించింది. తమ ఆరోగ్యం కోసం పోరాడుతున్న నాయకుడికి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల అధ్యక్షులు గంటా శ్రీధర్ రెడ్డి (మిథిలా నగర్), సత్తు నాగయ్య (బృందావన్ హోమ్స్), శ్రీనివాస్ (శివాజీ కాలనీ), సంజీవ్ రెడ్డి (బ్లోసమ్ సిటీ), కృష్ణ రెడ్డి (లక్ష్మీగణపతి కాలనీ), బీరప్ప (దుర్గానగర్), మధు (లక్ష్మీ ప్రియా కాలనీ), పూర్ణయ్య (P&T కాలనీ)తో పాటు బీజేపీ

## పోలింగ్ నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించాలి

: సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్, అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్

కామారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 8 (భారత శక్తి ప్రతినిధి) : ఎన్నికలలో కీలకమైన ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని మైక్రో అబ్జర్వర్లు నిశితంగా పరిశీలించాలని సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్ అన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలు తు.చ తప్పకుండా అమలయ్యేలా, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికల ప్రక్రియ జరిగేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఆయన తెలిపారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో పోలింగ్ తీరుతెన్నులను సూక్ష్మ స్థాయిలో పరిశీలించేందుకు నియమించబడిన మైక్రో అబ్జర్వర్లకు శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో మధ్యాహ్నం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ, మైక్రో అబ్జర్వర్లకు ఆయా ప్రాంతాల పోలింగ్ కేంద్రాలలో పరిశీలన బాధ్యతలు కేటాయించడం జరుగుతుందన్నారు. పోలింగ్‌కు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకుంటేనే పోలింగ్ నిర్వహణను




సమర్థవంతంగా పర్యవేక్షించగలుగుతారని తెలిపారు. ముఖ్యంగా పోలింగ్‌కు ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకుని పోలింగ్ సిబ్బందికి అందించే సామాగ్రి సక్రమంగా చేరుకుందా లేదా పరిశీలించాలని, పోలింగ్ సిబ్బందితో కలిసి పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని నిబంధనలకు అనుగుణంగా మాక్ పోలింగ్ నిర్వహించారా లేదా అన్నది పరిశీలించాలని, మాక్ పోలింగ్ అనంతరం చేపట్టే పోలింగ్ ప్రక్రియలు పూర్తిగా పారదర్శకంగా, ఎన్నికల నిబంధనల మేరకు జరుగుతున్నాయా లేదా అన్నది నిశితంగా గమనించాలని తెలిపారు. గమనించిన అంశాలను తక్షణమే జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాల పై ఆరా తీయాలని, పోలింగ్ కేంద్రాలలో ప్రిసైడింగ్ అధికారి, సహాయ ప్రిసైడింగ్ అధికారి , ఇతర పోలింగ్ సిబ్బంది విధులను గమనించాలని తెలిపారు. పోలింగ్ ప్రారంభమైనప్పటి నుండి పూర్తయ్యేంత వరకు అన్ని అంశాలను గమనిస్తూ, ఎప్పటికప్పుడు వాటిని జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలని, ఓటింగ్ గోప్యతను కాపాడే విధంగా మైక్రో అబ్జర్వర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో మరింత ప్రత్యేక దృష్టి సారించాలని, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అందించిన శిక్షణ తరగతుల్లో సూచించిన అంశాలను సమగ్రంగా అవగాహన చేసుకుని సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. మాస్టర్ ట్రైనర్ తాడ్వాయి శ్రీనివాస్ పోలింగ్ ప్రక్రియ, మైక్రో ఆబ్జర్వర్ల విధులు-బాధ్యతలు, ప్రిసైడింగ్ అధికారులతో సమన్వయం, నివేదికల ప్రాధాన్యత తదితర అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి రాజు, లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, తదితర అధికారులు పాల్గొన్నారు.




## కౌంటింగ్ ప్రక్రియను సజావుగా, ప్రశాంతంగా నిర్వహించాలి

: సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్

కామారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 8 (భారత శక్తి ప్రతినిధి) : 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్, అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్ లు పాల్గొని కౌంటింగ్ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, కౌంటింగ్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. కౌంటింగ్ సమయంలో ప్రతి దశలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా సమన్వయంతో పని చేయాలని కౌంటింగ్ సిబ్బందికి సూచించారు. అలాగే ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ, తమ విధులను నిబద్ధతతో, బాధ్యతాయుతంగా నిర్వహించాలని తెలిపారు. అంతకుముందు మాస్టర్ ట్రైనర్లు తడ్వాయి శ్రీనివాస్, నర్సింగరావు పాల్గొని, ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన నిబంధనలు, విధి విధానాలు, చెక్ లిస్టులు, వివిధ ఫారాలు, లెక్కింపు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లోపాలు తలెత్తకుండా పాటించాల్సిన అంశాలను సవివరంగా వివరించి అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ, ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పూర్తి నిష్పక్షపాతత్వం, పారదర్శకతతో పాటు ఎన్నికల నియమావళిని కట్టుదిట్టంగా పాటించడం అత్యంత అవసరమని సూచించారు. అలాగే రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేస్తూ, ఎలాంటి చిన్న తప్పిదానికి కూడా అవకాశం లేకుండా విధులు నిర్వర్తించాలని అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ సూపర్వైజర్లు మరియు అసిస్టెంట్ సూపర్వైజర్లు ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి, తమ బాధ్యతలను అత్యంత జాగ్రత్తగా, సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, చట్టబద్ధంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అవగాహన కౌంటింగ్ సిబ్బందికి కల్పించబడిందని, ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత కౌంటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బలమైన భవిష్యత్తుకి పునాది వేసిన బడ్జెట్

* కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.
- రాజకీయాలు కాదు.. భవిష్యత్ ముఖ్యం.
- మరో ఇరవై ఏళ్ళు 7% వృద్ధి రేటుతో దేశం.
- కీలక రంగాల్లో ఏపీకి అధిక కేటాయింపులు శుభసూచకం.
- విశ్వ బంధువుగా భారత్.. అంతర్జాతీయ వేదికపై హుందాతనాన్ని చూపుతున్న మోదీ.
- విమాన విడి భాగాలపై పన్ను సడలింపుతో తయారీ రంగంలో విప్లవాత్మక అభివృద్ధి.

రాజమండ్రి, ఫిబ్రవరి 8 (భారత శక్తి ప్రతినిధి) : రాజకీయాలు, రాష్ట్రాల ఎన్నికలు దృష్టిలో లేకుండా.. 140 కోట్ల మంది భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తాజా బడ్జెట్ ను ఆర్థిక శాఖామంత్రి




నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. రాజమండ్రి నగరంలోని ఓ ప్రైవేటు హోటల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూటమి నాయకులతో కలసి ఆయన పాల్గొన్నారు. దేశ భవిష్యత్ ను అద్భుతంగా తీర్చిదిద్దే విధంగా తాజా బడ్జెట్ ను రూపొందించారని అన్నారు. 2014 కు ముందు మోదీ ప్రధాని కాక మునుపు బలహీన దేశమనే చిన్న అప్రతిష్ఠను మనం మోసేవాళ్ళమని.. నేడు ప్రపంచంలోనే 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపిన ఘనత ప్రధాని మోదీకి దక్కుతుందని రామ్మోహన్ నాయుడు అన్నారు. డిజిటల్ ఇండియా, యువతకు భాగస్వామ్యం నేపథ్యాలుగా తాజా బడ్జెట్ రూపకల్పన జరిగిందని.. దేశంలోని ప్రతీ పౌరునికి ఫలితం దక్కాలనే ఉద్దేశంతోనే బడ్జెట్ కూర్పును నిర్మలా సీతారామన్ చేశారని అన్నారు. 21 వ శతాబ్దంలోని నాలుగు భాగాల్లో.. రెండవ పార్శ్వం లోకి అడుగుపెడుతున్న సందర్భంలో తొలి బడ్జెట్ ఇది అని తెలిపిన రామ్మోహన్ నాయుడు.. ఈ బడ్జెట్ ద్వారా వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడానికి బలమైన అడుగులు వేయొచ్చని అన్నారు. వరుసగా 9 సంవత్సరాలు ఒక మహిళ బడ్జెట్ ను ప్రవేశపెట్టడం ఒక రికార్డు అయితే.. ఎన్నికలు జరిగే రాష్ట్రాలకే నిధులు అనే అపవాదును ఈ తొమ్మిదేళ్లు ఆమె ఎక్కడా చూపలేదని కితాబిచ్చారు. 7% వృద్ధి రేటుతో ప్రస్తుతం భారత్ అభివృద్ధి చెందుతోందని.. మరొక్క ఇరవై ఏళ్ళు కూడా ఇవే గణాంకాలు కొనసాగుతాయని ఐ.ఎం.ఎఫ్ నివేదికలు కూడా స్పష్టం చేస్తున్నట్టు తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికలకు పటిష్ట పోలీస్ బందోబస్తు : జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 08 (భారత శక్తి) : ఈ నెల 11వ తేదీన నిర్మల్ జిల్లాలోని మూడు మున్సిపాలిటీలకు జరగనున్న ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసింది అని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ తెలిపారు. ఎన్నికల సమయం మొదలు కొని ఫలితాలు వెల్లడించే వరకు ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా అంతటా ముందస్తు చర్యలు చేపట్టామని, ఎన్నికల ప్రక్రియ మొత్తం కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, ఎలక్షన్ సెల్ ద్వారా నిరంతరం పర్యవేక్షణలో ఉంటుందని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలు మరియు కీలక ప్రాంతాలు సీసీ కెమెరాల నిఘాలో ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రచార సమయం రేపు అనగా 9వ తేదీ సోమవారం సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందని తెలిపారు. ప్రచార సమయం ముగిశాక అభ్యర్థులు లేదా వారి మద్దతుదారులు



ఎవరూ కూడా ప్రచారం నిర్వహించరాదని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించి ప్రచారం నిర్వహిస్తే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, కేసులు నమోదైతే అభ్యర్థిత్వం కూడా కోల్పోయే అవకాశముందని హెచ్చరించారు. సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు సైలెన్స్ డేగా పరిగణించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమయంలో స్థానికేతరులు, ఓటర్లు కానివారు కాలనీలు, వార్డుల్లో సంచరించరాదని, అక్కడ ఉండకూడదని స్పష్టం చేశారు. ఓటర్లను డబ్బు, మద్యం, బహుమతులు వంటి వాటితో ప్రలోభాలకు గురిచేయవద్దని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ఓటర్లు ఎలాంటి భయాలు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ కోరారు.

## 12 వ వార్డు సాహితీ రామును భారీ మెజార్టీతో గెలిపించండి

**: మెదక్ ఎంపీ రఘునందన్ రావు**



సంగారెడ్డి, ఫిబ్రవరి 08 (భారత శక్తి) : సంగారెడ్డి పట్టణంలో 12వ వార్డులో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఘాటుగా స్పందించారు. "రాను రాను హిందువుల సంఖ్య తగ్గిపోతున్న పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సంగారెడ్డి ఏ దిశగా వెళ్తుందో ప్రతి ఒక్కరూ ఒకసారి ఆలోచించాల్సిన అవసరం ఉంది" అని ఆయన అన్నారు. సంస్కృతి, సంప్రదాయం, భద్రత, అభివృద్ధికి కమలం గుర్తే శ్రీరామ రక్ష అని ఆయన పేర్కొన్నారు. భావితరాలు ప్రశాంతంగా, గౌరవంగా జీవించాలంటే కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీ అభ్యర్థులను గెలిపించాల్సిందే అని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజలంతా ఒక్కటై బీజేపీకి మద్దతు తెలపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సదాశివపేట లో జయమ్మ.. సంగారెడ్డి లో నిర్మలమ్మ

* **కాంగ్రెస్ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్న తల్లీ కూతుళ్ళు**
* **8 కోట్ల తో ఒక్కో వార్డులో అభివృద్ధి, పేదలకు ఇంటి స్థలాల హామీ తో ప్రచారం లో దూసుకుపోతున్న కాంగ్రెస్**



సంగారెడ్డి, ఫిబ్రవరి 08 (భారత శక్తి) : మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి రెండు రోజుల్లో తెర పడనుండటం తో కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో దూకుడు పెంచింది. సంగారెడ్డి లో శనివారం జరిగిన ప్రజలతో జగ్గారెడ్డి ముఖాముఖి సభ విజయవంతం కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ పెరిగింది. ఆదివారం ప్రచారాన్ని మరింత ముమ్మరం చేశారు. సదాశివపేట లో జయా చైతన్య రెడ్డి,సంగారెడ్డి లో నిర్మలా జగ్గారెడ్డి ఇంటిటి ప్రచారం లో పాల్గొన్నారు. టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థుల తరపున పట్టణం లో ని 11,31,32,33,6 వ వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే ప్రతీ వార్డులో 8 కోట్ల రూపాయల తో అభివృద్ధి చేయడం తో పాటు వార్డులో ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలాలు ఇప్పిస్తామన్నారు. మీ మనస్సు మాట వినండి, కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటేయాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. మరో పక్క సదాశివపేట మున్సిపాలిటీ లో జయా చైతన్య రెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. 17,18,4,8 వార్డులతో పాటు పలు వార్డులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయారెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాట మీద నిలబడే వ్యక్తి జగ్గారెడ్డి అని, ఆయన మాట ఇస్తే చేసి తీరుతారని అన్నారు. సదాశివపేటలో సర్టిఫికెట్లు ఉన్న 5500 మందికి తో పాటు ఇల్లు లేని ప్రతీ పేదలకు ఇంటి స్థలాలు జగ్గారెడ్డి ఇచ్చి తీరుతారాన్నరు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే ప్రతీ వార్డులో 8 కోట్ల రూపాయల తో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల అభ్యర్థులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామ్ రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## 'వందేమాతరం' చిత్ర ప్రదర్శనను ప్రారంభించిన కేంద్ర మంత్రి డా. పెమ్మసాని

విజయవాడ, ఫిబ్రవరి 08 (భారత శక్తి) : కొండవీడు ఉత్సవాల్లో భాగంగా, 'జాతీయ గీతం వందేమాతరం - 150 సంవత్సరాలు' అనే అంశంపై కేంద్ర సమాచార & ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (CBC) ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ ఈ రోజు ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి శ్రీ అనం రామనారాయణ రెడ్డి, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు శ్రీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, చిలకలూరిపేట ఎమ్మెల్యే శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు, రాష్ట్ర గ్రంథాలయ కమిషన్ చైర్మన్ శ్రీ కోటేశ్వరరావు, రాష్ట్ర శిల్పారామం చైర్‌పర్సన్ శ్రీమతి మంజులా రెడ్డి, పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్లా, ఇతర సీనియర్ జిల్లా అధికారులు పాల్గొన్నారు. కొండవీడు సామ్రాజ్య వైభవ చరిత్రను స్మరించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెండు రోజుల కొండవీడు ఉత్సవాల్లో భాగంగా, సీబీసీ 'వందేమాతరం - 150 సంవత్సరాలు' ఫోటో ప్రదర్శనను ఏర్పాటు చేసింది. వందేమాతరం గీతం గురించి విద్యార్థులు, ఉపాధ్యాయులు మరింత అవగాహన పెంపొందించుకోవాలని నరసరావుపేట ఎంపీ శ్రీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, పిలుపునిచ్చారు. యావత్ దేశాన్ని ఒక్కతాటిపై నిలిపి, ఐక్యతా భావాన్ని పెంపొందిస్తూ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటాన్ని ఉద్ధృతం చేయాల్సిన సమయంలో, బంకిమ్ చంద్ర ఛటర్జీ 'వందేమాతరం' రూపంలో అద్భుతమైన, ఆశాజనకమైన గీతాన్ని అందించారని పేర్కొన్నారు. వందేమాతరం గీతంలోని ప్రతి పదం నేటికీ ప్రేరణనిచ్చేదిగా, వికసిత్ భారత్ సాధనకు మార్గదర్శకంగా ఉందని తెలిపారు. సీబీసీ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ ఆర్. రమేశ్ చంద్ర మాట్లాడుతూ, ఈ ప్రదర్శనలో బంకిమ్ చంద్ర ఛటోపాధ్యాయ జీవితానికి సంబంధించిన అరుదైన, విశిష్ట చిత్రాలు, అలాగే వందేమాతరం జాతీయ గీతానికి సంబంధించిన చారిత్రక విశేషాలను ప్రదర్శించామని తెలిపారు. మొదటి రోజే వివిధ పాఠశాలలకు చెందిన వెయ్యికి పైగా విద్యార్థులు ఈ ప్రదర్శనను సందర్శించారని చెప్పారు. విద్యార్థుల కోసం తక్షణ వందేమాతరం క్విజ్ పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశామని ఆయన తెలిపారు.

## యల్.బి.ఆర్.సి.ఈ లో ఐదవ రోజు అంతర్‌రాష్ట్ర యువజన మార్పిడి కార్యక్రమం

విజయవాడ, ఫిబ్రవరి 8 (భారత శక్తి ప్రతినిధి) : కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించుచున్న, మై భారత్ (మై భారత్) కార్యక్రమం భాగంగా లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల యన్.యస్.యస్. యూనిట్ ఆధ్వర్యంలో అంతర్‌రాష్ట్ర యువజన మార్పిడి కార్యక్రమం (ఇంటర్ స్టేట్ యూత్ ఎక్స్చేంజి ప్రోగ్రామ్) (03022026నుండి 07022026) ఐదు రోజుల పాటు కార్యక్రమంలో భాగంగా ఐదవ రోజు కార్యక్రమంలో కేరళ విద్యార్థులు వారి వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు, ఈ కార్యక్రమంలో యస్.శ్రీనివాస రావు, స్టెప్(స్టెప్) మేనేజర్ మాట్లాడుతూ ఒక రాష్ట్ర యువత మరో రాష్ట్ర సంస్కృతి, చరిత్ర, సాంప్రదాయాలను తెలుసుకోవడం వలన యువతకు చాలా ఉపయోగమని అయన అన్నారు. అనంతరం మై భారత్ జిల్లా యువ అధికారి సుంకర రాము కేరళ విద్యార్థులకు మెమొంటోలను, సర్టిఫికేట్ అందించారు, అనంతరం వేదికను అలంకరించిన పెద్దలను మరియు కార్యక్రమంలో భాగంగా గెస్ట్ లెక్చర్ అందించిన యల్.బి.ఆర్.సి.ఈ ప్రొఫెసర్స్ ను సత్కరించారు. కేరళ విద్యార్థులు వారం రోజుల కార్యక్రమంలో నేర్చుకున్న, సందర్శించిన



మరియు తెలుసుకున్న విషయాలను గురుంచి వారి యొక్క అభిప్రాయాలను వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో మై భారత్ జిల్లా యువ అధికారి శ్రీ సుంకర రాము , మై భారత్ కోఆర్డినేటర్ వినోద్ ,కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు , వైస్ ప్రిన్సిపాల్ డా .రమేష్ రెడ్డి యల్.బి.ఆర్.సి.ఈ కళాశాల అసిస్టెంట్ యన్.యస్.యస్. యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్, శీలం ఉమా మహేశ్వర రెడ్డి, కొండపల్లి మున్సిపల్ కమీషనర్ నాయక్ , యు.పి .యస్.సి & సి.ఎ చంద్రిక మరియు కేరళ రాష్ట్ర విద్యార్థిని, విద్యార్థులు మరియు కళాశాల యన్.యస్.యస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

## పట్టభద్రులకు సువర్ణ అవకాశం "తపాలా జీవిత బీమా కొండంత ధీమా"

* **తక్కువ ప్రీమియం ఎక్కువ బోనస్**
* **అధిక బీమా రక్షణతో ఆర్థిక భరోసా**
* **19 నుండి 55 సంవత్సరాల**
* **వారందరూ అర్హులు**
* **సంగారెడ్డి డివిజన్ పోస్టల్ ఎస్పీ**
* **డి. శ్రీహరి వెల్లడి**



సంగారెడ్డి,ఫిబ్రవరి 08 (భారత శక్తి) : సంగారెడ్డి డివిజన్ పరిధిలోనీ పట్టభద్రుల భవిష్యత్ భద్రతను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పోస్ట్ ఆఫీస్ ద్వారా తపాలా జీవిత బీమా పథకాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు సంగారెడ్డి డివిజన్ పోస్టల్ ఎస్పీ డి. శ్రీహరి వెల్లడించారు. తక్కువ ప్రీమియం చెల్లింపుతో అధిక బీమా రక్షణతో పాటు ఆకర్షనీయమైన బోనస్ ప్రయోజనాలు కలిగిన ఈ పథకం పట్టభద్రులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో ఉద్యోగ బాధ్యత కుటుంబ భవిష్యత్ ఆర్థిక సంక్షేమం ప్రతి ఒక్కరికి కీలక అంశాలుగా మారుతున్న నేపథ్యంలో ఈ ప్రత్యేక జీవిత బీమా పథకం పట్టభద్రులకు ఒక భరోసాగా నిలుస్తుందని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ రంగ సంస్థ అయిన పోస్ట్ ఆఫీస్ ద్వారా ఈ పథకం అమల్లోకి రావడం వల్ల ప్రజలకు నమ్మకమైన భద్రత కలుగుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రత్యేక జీవిత బీమా పథకానికి డిగ్రీ అర్హత కలిగిన 19 నుండి 55 సంవత్సరాల వయసు కలవారు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. వయస్సు విద్యా అర్హతలు ఈ పథకంలో ప్రధాన ప్రమాణాలుగా పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రైవేటు ఉద్యోగులు స్వయం ఉపాధి పొందుతున్న పట్టభద్రులు సైతం ఈ పథకాన్ని వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. పట్టభద్రులలో ఆర్థిక స్థితిని మెరుగుపరచడమే లక్ష్యంగా రూపొందించిన ఈ పథకం ద్వారా యువతతో పాటు ప్రత్యేక వర్గాల వారు కూడా భవిష్యత్తును సురక్షితంగా మలుచుకునే అవకాశం ఉందని వివరించారు. ఈ పథకం కింద కనీసం 20 వేల నుండి గరిష్టంగా 50 లక్షల వరకు జీవిత బీమా పాలసీ తీసుకొనే అవకాశము ఉందని తెలిపారు. వ్యక్తి ఆర్థిక స్థితి అవసరాలు కుటుంబ బాధ్యతలను బట్టి బీమా మొత్తాన్ని ఎంపిక చేసుకోవచ్చన్నారు. అధిక బీమా కవరేజ్ ఉండటంతో అనుకొని ప్రమాదాలు ఆకాలమరణం సంభవించినప్పుడు కుటుంబ సభ్యులకు ఆర్థిక భరోసా కలుగుతుంది పేర్కొన్నారు. ముఖ్యంగా కుటుంబానికి ఏకైక ఆదాయ వనరుగా ఉన్న పట్టభద్రులకు ఈ పథకం ఎంతో ఉపయోగంగా ఉంటుందని వివరించారు.

ఈ బీమా పథకంలో ప్రధాన ఆకర్షణ తక్కువ ప్రీమియం చెల్లింపుతో అధిక లాభాలు లభించడం అని స్పష్టం చేశారు. ఇతర ప్రైవేట్ బీమా సంస్థలతో పోలిస్తే పోస్ట్ ఆఫీస్ బీమా పథకాల్లో ప్రీమియం తక్కువగా ఉండటం బోనస్ స్థిరంగా ఉండటం ప్రధాన లాభాలుగా పేర్కొన్నారు. పాలసీ కాల పరిమితి పూర్తయ్యాక మెచ్యూరిటీ మొత్తం తో పాటు బోనస్ కూడా అందుతుందని దీని ద్వారా పిల్లల చదువులు వివాహాలు గృహ నిర్మాణం వంటి అవసరాలకు ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ ప్రత్యేక జీవిత బీమా పాలసీపై రుణ సదుపాయం కూడా అందుబాటులో ఉందని ఆయన తెలిపారు. పాలసీ కొనసాగింపు కాలాన్ని బట్టి సంవత్సరానికి బోనస్ చేర్చబడుతుందని దీనివల్ల మెచ్యూరిటీ సమయంలో పొందే మొత్తం మరింత పెరుగుతుందని వివరించారు. పోస్ట్ ఆఫీస్ బీమా పథకాల్లో బోనస్ రేట్లు స్థిరంగా ఉండటం వల్ల దీర్ఘకాలిక పెట్టుబడిగా ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు. ఈ పథకం ద్వారా పాలసీదారులకు చట్టంలోని సెక్షన్ 80సి కింద పన్ను మినహాయింపు లభిస్తుందని తెలిపారు. చెల్లించే ప్రీమియంపై పన్ను మినహాయింపు పొందడం ద్వారా పట్టభద్రులు తమ వార్షిక పన్ను భారం తగ్గించుకోవచ్చనీ అన్నారు. ప్రస్తుత కాలంలో పన్ను ప్రణాళిక ప్రతి ఉద్యోగి వ్యాపారికి కీలకంగా మారిన నేపథ్యంలో ఈ బీమా పథకం రెండు విధాలుగా లాభాన్ని అందిస్తుందని వివరించారు. ఒకవైపు జీవిత రక్షణ మరోవైపు పన్ను మినహాయింపు ద్వారా ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ఈ ప్రత్యేక బీమా పాలసీపై రుణ సదుపాయం కూడా పొందవచ్చనీ తెలిపారు. పాలసీని కొంతకాలం కొనసాగించిన తర్వాత అవసరమైతే పాలసీ విలువపై రుణం తీసుకునే అవకాశం ఉందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య ఖర్చులు విద్యావసరాలు వ్యాపార అవసరాల కోసం ఈ రుణ సదుపాయం ఎంతో ఉపయోగంగా ఉంటుందని వివరించారు. ఈ మేరకు సంగారెడ్డి డివిజన్ పరిధిలోని అన్ని హెడ్, సబ్, బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ లో ప్రత్యేక మేళాలు నిర్వహిస్తున్నామని ఈ అవకాశాన్ని అర్హులైన పట్టభద్రులు అందరూ సద్వినియోగపరుచుకోవాలని సంగారెడ్డి డివిజన్ పోస్టల్ ఎస్పీ డి. శ్రీహరి తెలిపారు.

## నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు

**: జిల్లా రెవెన్యూ అధికారి**

వై ఎస్ ఆర్ కడప, ఫిబ్రవరి 08 (భారత శక్తి) : ఈనెల 09వ తేదీన సోమవారం వై ఎస్ ఆర్ కడప జిల్లా సభా భవన్ లో నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం ను గౌ.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశం నకు మంత్రులు, సెక్రటరీలు, హెచ్ఓడిల కాన్ఫరెన్స్ కారణంగా జిల్లాల నుండి వర్చువల్ విధానం లో ఈ కాన్ఫరెన్స్ నకు జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, హెచ్ఓడిలు అందరూ కలెక్టరేట్ లో హాజరవుతారని అందువలన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ను జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు రద్దు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర్ నాయుడు ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు.పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం రద్దు విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని, ఎవరు అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్ కు రాకూడదని తెలిపారు. కాన్ఫరెన్స్ నేపథ్యంలో జిల్లా, డివిజన్, మండల స్థాయిలోపిజిఆర్ఎస్ రద్దు చేయడం జరిగిందని తెలిపారు. సోమవారం ఉదయం 10:30 గంటల నుండి రోజంతా నిర్వహించబడే కాన్ఫరెన్స్‌లో జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ మరియు అన్ని శాఖల హెచ్ఓడిలు కలెక్టరేట్ నుండి వర్చువల్ విధానంలో పాల్గొననున్నారు. డివిజన్ స్థాయిలో సంబంధిత ఆర్డీవోల ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి అధికారులు, మండల స్థాయిలో తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు మరియు ఇతర అధికారులు తమ తమ కార్యాలయాల నుండి వర్చువల్ విధానంలో పాల్గొనవలసి ఉంటుంది.

# గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్... విచారణకు ఆదేశించిన సీఎం చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 8 (భారత శక్తి ప్రతినిధి) : ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లాలో గల ఓ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో 92 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విచారణకు ఆదేశించారు. బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. సోమవారం లోగా దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వివరాల్లోకి వెళ్తే.. పోలవరం జిల్లా రంపచోడవరం మండలం దేవరపల్లిలోని ఆశ్రమ బాలుర వసతి గృహంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఆదివారం ముఖ్యమంత్రి కార్యాలయ (సీఎంవో) అధికారులతో చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించి వివరాలు తెలుసుకున్నారు. శనివారం ఉదయం అల్పాహారం తిన్న తర్వాత 92 మంది విద్యార్థులకు వాంతులు, కడుపునొప్పి, జ్వరం, విరేచనాలు వంటి లక్షణాలు కనిపించాయని అధికారులు సీఎంకు వివరించారు. వెంటనే వారిని మారేడుమిల్లి, రంపచోడవరంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులందరి ఆరోగ్యం నిలకడగా ఉందని వారు పేర్కొన్నారు. ఘటన జరిగిన వెంటనే హాస్టల్‌ను తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను అంచనా వేశామని అధికారులు తెలిపారు. హాస్టల్‌లో ఉన్న మిగతా విద్యార్థులకు



వైద్య పరీక్షలు నిర్వహించి, లక్షణాలు ఉన్నవారికి చికిత్స అందించారు. ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు, ఆహారం, నీటి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం పంపినట్లు వివరించారు. ఈ ఘటనపై విచారణకు ఒక జాయింట్ ఇన్స్‌పెక్షన్ కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఘటనపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. బాధ్యులపై శాఖాపరమైన చర్యలతో పాటు, అవసరమైతే క్రిమినల్ చర్యలు కూడా తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

## చరిత్రలో బూతులు మాట్లాడే ఏకైక మంత్రిగా రేవంత్ రెడ్డి మిగిలిపోతాడు: కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (భారత శక్తి ప్రతినిధి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి అంత చెత్త, నీచమైన ముఖ్యమంత్రి చరిత్రలోనే ఎవరూ లేరని సంచలన వ్యాఖ్యలు చేశారు. తాండూరు పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన, రేవంత్ రెడ్డి పాలనపై ఘాటుగా విమర్శలు గుప్పించారు. "ఏ ముఖ్యమంత్రి అయినా పర్యటనకు వెళ్తే అభివృద్ధి కార్యక్రమాల గురించి మాట్లాడతారు. కానీ, బూతులు మాట్లాడే ఏకైక ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారు" అని కేటీఆర్ అన్నారు. గత రెండేళ్లుగా కేసీఆర్‌ను తిట్టడం తప్ప రేవంత్ చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. ప్రతిరోజూ వందల కోట్లు ఎలా సంపాదించాలన్న ఆలోచనే రేవంత్ రెడ్డికి ఉందని ఆరోపించారు. తాండూరు నర్సింగ్ కాలేజీని ఎత్తుకుపోయిన దొంగ రేవంత్ రెడ్డి అని కేటీఆర్ ఆరోపించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని, లేదంటే రాబోయే మూడేళ్ల వరకు ఆ పార్టీ నేతలు ప్రజలకు అందుబాటులో ఉండరని అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

## ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్నిప్రమాదం: ఆ వార్తలు నమ్మొద్దన్న శిఖా గోయల్

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (భారత శక్తి ప్రతినిధి) : హైదరాబాద్ నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్)లో శనివారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో, గతంలో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు', 'ఫోన్ ట్యాపింగ్' కేసులకు సంబంధించిన కీలక ఆధారాలు కాలిపోయాయంటూ సోషల్ మీడియాలో, కొన్ని మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచారాన్ని ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ శిఖా గోయల్ తీవ్రంగా ఖండించారు. కీలక కేసులకు సంబంధించిన ఆధారాలన్నీ సురక్షితంగా ఉన్నాయని, ఎలాంటి డేటా నష్టం జరగలేదని ఆమె స్పష్టం చేశారు. శనివారం ఉదయం 10:08 గంటల సమయంలో ల్యాబ్ కార్యాలయంలోని సీజ్డ్ ప్రాపర్టీస్ విభాగంలో మంటలు చెలరేగాయి. అక్కడి సిబ్బంది గమనించి వెంటనే అప్రమత్తమైనప్పటికీ, మంటలు వేగంగా ల్యాబ్‌తో పాటు శిక్షణా కేంద్రానికి వ్యాపించాయి. ఈ ప్రమాదంలో కొన్ని అనాలసిస్ డాక్యుమెంట్ ఫైళ్లు మాత్రమే దగ్ధమయ్యాయని, వాటిని కూడా రికవరీ చేసే ప్రక్రియ కొనసాగుతోందని శిఖా గోయల్ వివరించారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని, ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. ముఖ్యంగా, తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు రేపిన 2015 నాటి 'ఓటుకు నోటు' కేసుకు సంబంధించిన ఆధారాలు ధ్వంసమయ్యాయని వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని ఆమె తేల్చిచెప్పారు. ఆ కేసుకు సంబంధించిన 16 మెటీరియల్ ఆబ్జెక్టులను 2015లోనే స్వీకరించి, పరీక్షించిన తర్వాత 2021 మార్చిలోనే ఏసీబీ కోర్టుకు తిరిగి సమర్పించామని స్పష్టం చేశారు. ప్రమాదం జరిగినప్పుడు ఈ కేసుకు సంబంధించిన ఒక్క ఆధారం కూడా ఎఫ్ఎస్ఎల్‌లో లేదని ఆమె తెలిపారు. అదేవిధంగా, ఇటీవలి ఫోన్ ట్యాపింగ్ కేసుకు (పంజాగుట్ట పీఎస్ క్రైమ్ నెం. 243/2024) సంబంధించి మార్చి 2024 నుంచి జనవరి 2026 మధ్య అందిన 132 మెటీరియల్ ఆబ్జెక్టులను పూర్తిగా పరిశీలించామని, వాటన్నింటినీ సురక్షితంగా వెలికితీశామని గోయల్ చెప్పారు. వాటి నివేదికలు ఇప్పటికే కొన్ని కోర్టుకు సమర్పించగా, మరికొన్ని సిద్ధమవుతున్నాయని అన్నారు. ఒకవేళ ఏవైనా డాక్యుమెంట్లు కాలిపోయినా, వాటి డేటాను తిరిగి పొందే సాంకేతిక సామర్థ్యం తమ బృందానికి ఉందని, ఆధారాల భద్రత విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు. ల్యాబ్‌లో కాలిపోయినవి ఇప్పటికే కోర్టులకు సమర్పించిన డాక్యుమెంట్ల కాపీలేనని, ఒరిజినల్స్ కోర్టు వద్ద భద్రంగా ఉంటాయని ఆమె పునరుద్ఘాటించారు. ఈ అగ్నిప్రమాదంపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## పొలాల్లో కూలిపోయిన విమానం...
## ముందే దూకేసిన కెప్టెన్, ట్రైనీ పైలట్!

కర్ణాటక, ఫిబ్రవరి 8 (భారత శక్తి ప్రతినిధి) : కర్ణాటకలో ఆదివారం ఓ ప్రైవేట్ శిక్షణా విమానం కుప్పకూలింది. విజయపుర జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో విమానం పొలాల్లో క్రాష్ ల్యాండ్ అయింది. ఈ ప్రమాదంలో కెప్టెన్, ట్రైనీ పైలట్ గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే, రెడ్ బర్డ్ ఏవియేషన్‌కు చెందిన తేలికపాటి శిక్షణా విమానం కలబురగి నుంచి బెలగావికి బయలుదేరింది. మార్గమధ్యలో విజయపుర జిల్లా పరిధిలోని మంగళూరు సమీపంలోకి రాగానే ఇంజిన్‌లో సమస్య తలెత్తింది. దీంతో పైలట్లు విమానాన్ని పొలాల్లో అత్యవసరంగా దించే ప్రయత్నం చేయగా, అది అదుపుతప్పి కూలిపోయింది. ప్రమాద తీవ్రతకు విమానం ముందు భాగం నుజ్జునుజ్జయింది. ప్రమాద సమయంలో విమానంలో కెప్టెన్, ట్రైనీ పైలట్ ఇద్దరు మాత్రమే ఉన్నారు. సమాచారం అందుకున్న బాబలేశ్వర్ పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. స్థానికుల సహకారంతో గాయపడిన ఇద్దరినీ అంబులెన్స్‌లో సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిని కెప్టెన్ కునాల్ మల్హోత్రా, ట్రైనీ పైలట్ గౌతమ్ శంకర్‌గా కొన్ని నివేదికలు చెబుతున్నప్పటికీ, ఈ వివరాలను అధికారులు ఇంకా అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. ప్రాథమికంగా ఇంజిన్ వైఫల్యమే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. కాగా, విమానం కూలిపోవడానికి ముందే కెప్టెన్, ట్రైనీ పైలట్ దూకేసినట్టు తెలుస్తోంది.

## భారత్-మలేషియా బంధానికి తమిళమే వారధి

ఢిల్లీ, ఫిబ్రవరి 8 (భారత శక్తి ప్రతినిధి) : భారత్, మలేషియా మధ్య సాంస్కృతిక సంబంధాలను తమిళ భాష బలంగా పెనవేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇరు దేశాల మధ్య తాజాగా కుదిరిన ఆడియో విజువల్ ఒప్పందం ద్వారా తమిళ చిత్రాలు, సంగీతం మన హృదయాలను మరింత దగ్గర చేస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కౌలాలంపూర్‌లో మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో కలిసి ఆదివారం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. మలేషియా విద్య, మీడియా, సాంస్కృతిక జీవనంలో తమిళ భాషకు బలమైన, సజీవమైన ఉనికి ఉందని మోదీ ప్రశంసించారు. అంతకుముందు శనివారం జరిగిన 'సెలమత్ దతాంగ్ మోదీజీ' కార్యక్రమంలో 12,000 మందికి పైగా ప్రవాస భారతీయులు, స్నేహితులు పాల్గొన్నారు. ఈ సభకు మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం కూడా హాజరయ్యారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ప్రవాస భారతీయ సమాజం మలేషియాలో ఉందని, ఇరు దేశాల ప్రజల హృదయాలను కలిపే అంశాలు చాలా ఉన్నాయని ప్రధాని పేర్కొన్నారు. మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంకు లెజెండరీ నటుడు ఎంజీఆర్ పాటలంటే ఎంతో ఇష్టమని మోదీ గుర్తుచేశారు. బటు కేవ్స్‌లో జరిగిన తైపూసం వేడుకలు, మలేషియాలో గర్బా నృత్యం ప్రాచుర్యం పొందడం మన సాంస్కృతిక బంధానికి నిదర్శనమని అన్నారు. తమిళం ప్రపంచానికి భారత్ ఇచ్చిన గొప్ప బహుమతి అని, తమిళ సాహిత్యం శాశ్వతమైనదని కొనియాడారు. భారత ఉపరాష్ట్రపతి, విదేశాంగ, ఆర్థిక మంత్రులు తమిళనాడుకు చెందినవారేనని ఆయన సభలో ప్రస్తావించారు. ఈ చారిత్రక స్ఫూర్తితో, ఇప్పటికే ఉన్న తిరువళ్లువర్ చైర్‌కు అదనంగా మలయా యూనివర్సిటీలో 'తిరువళ్లువర్ సెంటర్'ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు.

## యథాతథంగా ప్రజావాణి కలెక్టరేట్ లోని రూమ్ నెంబర్ 25 లో

**: అదనపు కలెక్టర్ విక్టర్**



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఫిబ్రవరి 08: మున్సిపల్ ఎన్నికల నేపథ్యం ఉన్నప్పటికీ, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం యథాతథంగా కొనసాగుతుందని అదనపు కలెక్టర్ విక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నప్పటికీ, ప్రజల సమస్యలు, ఫిర్యాదుల స్వీకరణకు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రజావాణి కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులకు సంబంధించిన దరఖాస్తులను కలెక్టరేట్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడిఓసి) లో ఉన్న రూమ్ నెంబర్-25లో యథావిధిగా సమర్పించవచ్చని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ విక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## యాసంగి రైతు భరోసాపై కీలక అప్‌డేట్..
## నిధుల విడుదల ఎప్పుడంటే..!

కర్ణాటక, ఫిబ్రవరి 8 (భారత శక్తి ప్రతినిధి) : తెలంగాణ రైతులకు యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా నిధులను అందించేందుకు ప్రభుత్వం భారీ కసరత్తు ప్రారంభించింది. నిధుల సమీకరణ కోసం బహిరంగ మార్కెట్ నుంచి ఏకంగా రూ.9,000 కోట్లు రుణం తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు (ఆర్బీఐ) ఇండెంట్ సమర్పించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద మొత్తంలో ఒకేసారి రుణం సేకరించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ నెల 10వ తేదీన ఆర్బీఐ నిర్వహించే ఈవేలం ద్వారా ఈ రుణాన్ని సమీకరించనున్నారు. 13 ఏళ్ల కాలపరిమితితో రూ.2,000 కోట్లు, 16 ఏళ్లకు మరో రూ.2,000 కోట్లు, 21 ఏళ్ల కాలపరిమితితో రూ.2,500 కోట్లు, 27 ఏళ్లకు రూ.2,500 కోట్ల చొప్పున ప్రభుత్వం రుణం తీసుకోనుంది. ఈవేలం ప్రక్రియ పూర్తయిన తర్వాత నిధులు ప్రభుత్వ ఖజానాకు చేరతాయి. అనంతరం రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియను ప్రారంభించే అవకాశముంది. ఇప్పటికే యాసంగి సీజన్‌కు సంబంధించి అర్హులైన రైతుల జాబితా కూడా సిద్ధమైనట్లు సమాచారం. అయితే, ఈ నిధుల విడుదలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవలే ఒక స్పష్టత ఇచ్చారు. మిర్యాలగూడలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు పూర్తయిన వెంటనే రైతు భరోసా నిధులను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. దీంతో నిధుల సమీకరణ ప్రక్రియ పూర్తయినా, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడానికి మరికొంత సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది. తమ ప్రభుత్వం పార్టీలకతీతంగా, ఎలాంటి వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని సీఎం తెలిపారు. ఇప్పటికే పంట రుణాల మాఫీ కింద రైతులకు రూ.21 వేల కోట్లు అందించామని, సన్న వడ్లకు రూ.500 బోనస్ కూడా ఇచ్చామని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

## కామారెడ్డిలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచార భేరి షబ్బీర్ అలీ, అజారుద్దీన్ బిజెపి బిఆర్ఎస్ పార్టీలపై ధ్వజం

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఫిబ్రవరి 08: పట్టణంలోని 19, 20, 21, 22, 23, 24, 25 వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి మద్దతుగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజహారుద్దీన్ ఉధృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్న నాయకులు, హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ, అహంకారం వీడితేనే అభివృద్ధి సాధ్యం అని సూచించారు. స్థానిక ఎమ్మెల్యేపై నిప్పులు చెరిగారు. ఎమ్మెల్యే గెలిచినప్పటి నుండి ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదు. గతంలో ఏమీ చేయని వ్యక్తి, రేపు చేస్తాడనే నమ్మకం మాకు లేదు, ప్రజలకు అసలే లేదు. అధికార గర్వం ఇద్దరు ముఖ్యమంత్రులను ఓడించానని చెప్పుకోవడం తప్ప, కామారెడ్డి కోసం ఆయన సాధించిన ఘనత ఒక్కటీ లేదు. అధికార అహం నెత్తికెక్కితే చిన్న, పెద్ద అనే వ్యత్యాసం ఉండదు. కేసీఆర్ అంతటి వాడే తన అహంకారంతో నేడు కనుమరుగయ్యే పరిస్థితి వచ్చిందని గుర్తుంచుకోవాలి. ప్రజా సేవకులే గెలవాలి ఎన్నికల్లో గెలిచే అభ్యర్థులు మృదు స్వభావులై ఉండాలి. వార్డులోని ప్రతి సమస్యను తమ ఇంటి సమస్యగా భావించి పరిష్కరించే వారికే ప్రజలు పట్టం కట్టాలి. అభివృద్ధికి ఓటు వేయండి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. ఇతర పార్టీల అభ్యర్థులు గెలిస్తే సమన్వయ లోపంతో అభివృద్ధి కుంటుపడుతుంది. ప్రతి ఒక్కరూ ఆలోచించి, అభివృద్ధిని కోరుతూ కాంగ్రెస్‌కు ఓటు వేయాలి.

రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ స్వర్ణయుగం అని చాటారు. మంత్రి మహమ్మద్ అజహారుద్దీన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం నడుస్తోందని అన్నారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారంటీలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలు సామాన్యుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు. రైతు భరోసా రైతులకు ఎకరాకు రూ. 6,000 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తూ వ్యవసాయాన్ని పండుగ చేస్తున్నారు. ఉద్యోగ నియామకాలు: గత రెండేళ్లలో దాదాపు 51,000 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగుల ఆశాజ్యోతిగా నిలిచారు. మైనారిటీ సంక్షేమం కోసం మైనారిటీల విద్య, ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించి, వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. అభివృద్ధి కొనసాగాలంటే స్థానిక సంస్థల్లో కూడా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని అజారుద్దీన్ ప్రజలకు పిలుపునిచ్చారు. నేరెళ్ల శారద మాట్లాడుతూ నాడు ఇందిరమ్మ పాలనలో మహిళలకు అండగా ఉన్న కాంగ్రెస్ పార్టీ, నేడు తెలంగాణలో మళ్ళీ అభయహస్తం, ఆరు గ్యారంటీల ద్వారా మహిళా సాధికారతకు బాటలు వేస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మన ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితం



కాకుండా, చేతల్లో మహిళల ఆర్థిక, సామాజిక భద్రతను చాటుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ అభ్యర్థులు, స్థానిక నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిల్డ్ నౌ' కాదు.. బ్రైబ్ నౌ'!







**(పరిశోధనాత్మక పాత్రికేయులు ఎం.వేణుగోపాల్ "వీ.జీ" )**

**హైదరాబాద్ - భారత శక్తి:** "గంటల్లో పర్మిషన్.. సాఫ్ట్‌వేరే సుప్రీం.. పైసా లంచం అడిగేటోడే ఉండడు" అని సర్కారు ఊదరగొట్టిన 'బిల్డ్ నౌ' (BuildNow) పోర్టల్ ఇప్పుడు అవినీతికి అసలైన చిరునామాగా మారింది. టెక్నాలజీ అంటే పారదర్శకత అనుకుంటే, ఇక్కడ మాత్రం అధికారుల జేబులు నింపే 'ఏటీఎం'లా మారింది. సాఫ్ట్‌వేర్ ముసుగులో క్షేత్రస్థాయి అధికారులు ఆడుతున్న చదరంగంలో అటు సామాన్యుడు, ఇటు బిల్డర్ బలైపోతున్నారు. అక్రమ సంపాదనకు అలవాటు పడ్డ కొందరు అధికారులు AIని అడ్డం పెట్టుకొని కొత్త రకం దోపిడీకి తెరలేపారు.

* **షార్ట్‌ఫాల్.. అధికారుల 'షార్ట్‌కట్' సంపాదన!**

గతంలో ఉన్న DPMS, TGbPASS సాఫ్ట్‌వేర్లలో కనీసం ఫైల్ ఎక్కడుందో, ఏ అధికారి దగ్గర ఆగిందో తెలిసేది. కానీ 'బిల్డ్ నౌ'లో ఆ పత్తా లేకుండా పోయింది. అప్లికెంట్ తన ఫైల్ మూవ్‌మెంట్ టైమ్, డేట్ చూసుకునే అవకాశం లేకుండా డిజైన్ చేయడమే పెద్ద కుట్ర అని ఆరోపణలు వస్తున్నాయి.

ఒకేసారి చెప్పరు: ఫైల్‌లో ఏవైనా లోపాలు ఉంటే ఒకేసారి చెప్పాల్సి ఉండగా, కావాలనే 'వన్ టైం షార్ట్‌ఫాల్' ఆప్షన్‌ను దుర్వినియోగం చేస్తున్నారు.

కలవకపోతే కట్: సదరు అధికారిని కలిసి 'కమిషన్' మాట్లాడకపోతే, ఉన్న లోపాలను సగం సగం పెట్టి ఫైల్‌ను హోల్డ్‌లో ఉంచుతున్నారు.

అన్నీ సరిచేసినా, ఆఫీసర్‌కు ఫోన్ కలవకపోయినా.. వెంటనే 'రిజెక్ట్' కొడుతున్నారు.

ఏజెంట్ల రాజ్యం: ఆఫీసు చుట్టూ తిరిగితే పనికాదు కానీ, బయట తిరిగే ఏజెంట్ల ద్వారా 'రేటు' కుదుర్చుకుంటే మాత్రం గంటల్లోనే గ్రీన్ సిగ్నల్ వస్తోంది.

* **ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (OC).. బిల్డర్లకు యమపాశం!**

నిర్మాణం పూర్తయ్యాక ఇచ్చే OC కోసం బిల్డర్లు నరకం చూస్తున్నారు. ప్లాన్ ప్రకారం కట్టినా సరే, టేపు పట్టుకొచ్చి 'ఇంచీ' తేడా ఉందంటూ లక్షల్లో డిమాండ్ చేస్తున్నారు.

"మేము తప్పు చేస్తే బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు సరే.. కానీ అంతా కరెక్ట్‌గా ఉన్నా సాఫ్ట్‌వేర్ లోపం అని సాకులు చెప్పి ఎందుకు ఆపుతున్నారు? బ్యాంక్ వడ్డీలు కట్టలేక మేం చావాలా?" అని మధ్యతరగతి బిల్డర్లు కన్నీరు పెడుతున్నారు.

**అడిగితే 'బ్లాక్‌మెయిల్' రివర్స్ అటాక్!**

DTCP, HMDA కార్యాలయాల్లోని సపోర్టింగ్ టీమ్ లేదా అధికారులను నిలదీస్తే.. "మీరేదో తప్పు చేశారు అందుకే భయపడుతున్నారు" అంటూ రివర్స్ బ్లాక్‌మెయిల్‌కు దిగుతున్నారు. అధికారులు తెలిసి తప్పు చేస్తూ, అడిగితే టెక్నాలజీ మీద నెట్టేయడం వీరికి పరిపాటిగా మారింది. 2025లో ఏసీబీ ఎన్ని దాడులు చేసినా, బినామీల ద్వారా వందల కోట్లు వెనకేస్తున్న అధికారుల తీరులో మాత్రం మార్పు రావడం లేదు.

* **సర్కారు ఏం చేయాలి? (భారత శక్తి సూచనలు)**

>> ట్రాకింగ్ సిస్టమ్: ఫైల్ ఏ టేబుల్ మీద, ఏ టైమ్‌లో ఉందో అప్లికెంట్‌కు లైవ్ ట్రాకింగ్ ఇవ్వాలి.

>> అనవసర రిజెక్షన్లపై ఆడిట్: థర్డ్ పార్టీ సంస్థతో అసలు రిజెక్షన్లకు కారణాలేంటో విచారణ జరపాలి.

>> ఆఫీసర్లకు పెనాల్టీ: కారణం లేకుండా ఫైల్ ఆపితే, ఆ అధికారి జీతం నుండే బిల్డర్ కట్టే వడ్డీ పెనాల్టీగా వసూలు చేయాలి.

>> ఏజెంట్ల ఏరివేత: కార్యాలయాల్లో ప్రైవేట్ వ్యక్తుల జోక్యాన్ని పూర్తిగా నిషేధించాలి.

>> తెలంగాణ రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలక ముందే ప్రభుత్వం కళ్ళు తెరవాలి. 'బిల్డ్ నౌ'ను నిజమైన పారదర్శక వ్యవస్థగా మార్చకపోతే, ఇది పాలనా సంస్కరణ కాదు.. కేవలం 'అవినీతి ఆధునికీకరణ'గానే మిగిలిపోతుంది.

**>>బిల్ నౌ లో జరుగుతున్న అవినీతి అక్రమాలు ఒక్కొక్కటిగా మీ ముందుకు తదుపరి కథనంలో...**




| అంశం | పాత సాఫ్ట్‌వేర్ (TG-bPASS) | కొత్త 'బిల్డ్ నౌ' (BuildNow) |
|---|---|---|
| ట్రాన్స్‌పరెన్సీ | ఫైల్ ఏ అధికారి దగ్గర ఉందో తెలిసేది | ఫైల్ మూవ్‌మెంట్ అప్లికెంట్‌కు కనబడదు |
| షార్ట్‌ఫాల్స్ | స్పష్టమైన వివరాలు ఉండేవి | కావాలనే సగం వివరాలిచ్చి ఆపేస్తున్నారు |
| క్లియరెన్స్ | నిర్ణీత గడువు ఉండేది | ఆఫీసర్ కరుణిస్తేనే పని జరుగుతోంది |
| జవాబుదారీతనం | కొంతవరకు ఉండేది | AI పేరుతో అధికారుల బాధ్యతారాహిత్యం |



## బి.ఎన్. రెడ్డి నగర్ ఫేజ్3లో
# సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన

* **రూ. 14 లక్షలతో అభివృద్ధి పనులు: కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి**

వనస్థలిపురం, ఫిబ్రవరి 8: భారత శక్తి : కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని బి.ఎన్. రెడ్డి నగర్ ఫేజ్3 కాలనీలో రూ. 14 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సి.సి. రోడ్ల నిర్మాణ పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీవాసుల చిరకాల కోరిక మేరకు నిధులు మంజూరు చేయించామని, త్వరలోనే పనులు ప్రారంభించి నాణ్యతతో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు సాయి నికేతన్ (అధ్యక్షులు), సురేష్ కుమార్ (ఉపాధ్యక్షులు), భరత్‌లాల్ రాథోడ్ (ప్రధాన కార్యదర్శి), శ్రీనివాసరావు (కోశాధికారి), సుమని నాయక్ (జాయింట్ సెక్రటరీ) పాల్గొన్నారు. వీరితో పాటు విజయ్ కుమార్, సత్యనారాయణ, మోహన్ రెడ్డి, యాదగిరిరావు, రవి ప్రకాష్, లింగం గౌడ్, భూషణ్, శ్రీనివాస్ గౌడ్, రాజు, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియను
# ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలి

* **మున్సిపాలిటీ ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలి.**
* **జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు**

వనపర్తి జిల్లా భారత శక్తి. ప్రతినిధి. ఫిబ్రవరి 8: మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వనపర్తి మున్సిపల్ కార్యాలయం, కొత్తకోట ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ సరళిని పరిశీలించి, విధుల్లో ఉన్న అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటు వేయడానికి వచ్చే ఓటర్లతో తప్పనిసరిగా ప్రభుత్వం సూచించిన





గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసిన వారి వివరాలను ఓటరు జాబితాలో స్పష్టంగా మార్క్ చేయాలన్నారు. ఓటు వేసిన ప్రతి ఓటరుకు నిబంధనల ప్రకారం తప్పనిసరిగా సిరా చుక్కను పెట్టాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ అంతా అత్యంత పారదర్శకంగా జరగాలని, ఇందుకోసం ప్రతి పోలింగ్ కేంద్రాన్ని తప్పనిసరిగా వీడియో రికార్డింగ్ చేయాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ముగిసిన అనంతరం, నమోదైన ఓట్ల వివరాలను సంబంధిత అభ్యర్థులకు లేదా వారి ఏజెంట్లకు తెలియజేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసిల్దారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# కాంగ్రెస్‌తోనే మున్సిపాలిటీల వికాసం

* **పటాన్‌చెరు అభివృద్ధికి నడుం బిగించాలి**
* **మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో చిగురింత పారిజాత నరసింహారెడ్డి స్పీచ్ తో ఇంద్రేశంలో హోరెత్తిన కార్నర్ మీటింగ్**

పటాన్‌చెరు, ఫిబ్రవరి 8: భారత శక్తి : మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జీ నీలం మధు ముదిరాజ్, పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జీ కాటా శ్రీనివాస్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఇంద్రేశం మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం స్థానిక నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన భారీ 'కార్నర్ మీటింగ్'లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

* **ప్రజాక్షేత్రంలో పారిజాత నర్సింహారెడ్డి చురుకైన పాత్ర**

మున్సిపాలిటీ ఎన్నికల కోఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టిన మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశం దిగ్విజయంగా జరిగింది. క్షేత్రస్థాయిలో పార్టీని



బలోపేతం చేస్తూ, ఓటర్లను చైతన్యపరచడంలో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించే సత్తా కాంగ్రెస్‌కే ఉందన్నారు. గత పాలనలో జరిగిన వైఫల్యాలను ఎండగడుతూ, ఇంద్రేశాన్ని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

* **నేతల ఐక్యమత్యం.. కార్యకర్తల ఉత్సాహం:**

ఈ కార్నర్ మీటింగ్‌కు భారీ సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు, స్థానిక ప్రజలతో ఇంద్రేశం వీధులన్నీ సందడిగా మారాయి. నీలం మధు, కాటా శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో నాయకులంతా ఏకతాటిపైకి వచ్చి ప్రచారం నిర్వహించడం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. స్థానిక నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యులు

* నీలం మధు ముదిరాజ్ (మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జీ)
* కాటా శ్రీనివాస్ గౌడ్ (పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ)
* చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి (ఎన్నికల కోఆర్డినేటర్, మాజీ మేయర్)
* స్థానిక కాంగ్రెస్ నేతలు మరియు అనుబంధ సంఘాల ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్..
## రెండు పార్టీలు ఒక్కటే: రామచందర్‌రావు

నల్గొండ, , ఫిబ్రవరి 8: భారత శక్తి : రాష్ట్రంలో కాంగ్రెస్‌కి ఓటేసినా.. బీఆర్ఎస్‌కు వేసినా ఒక్కటేనని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఎద్దేవా చేశారు. ఒకరు దొంగ అయితే.. మరొకరు దోపిడీ దొంగ అని ఆరోపించారు. బీఆర్ఎస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలు ఇప్పుడు ఎక్కడున్నారని ప్రశ్నించారు. అదే భాజపా నేతలు ఓడినా.. గెలిచినా ఒకే పార్టీలో ఉంటారని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పులనే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. నల్గొండ క్లాక్ టవర్ సెంటర్లో ఏర్పాటు చేసిన కార్పొరేషన్ ఎన్నికల విజయ సంకల్ప సభలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం దారి మళ్లిస్తోందని విమర్శించారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో భాజపా జెండా ఎగరబోతోందని జోస్యం చెప్పారు. నల్గొండలో ఇప్పటికీ అండర్



గ్రౌండ్ డ్రైనేజీ లేదన్నారు. భాజపాను గెలిపిస్తే నల్గొండను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు అవకాశాలు ఇచ్చారు.. ఒక్కసారి భాజపాకు అవకాశం ఇవ్వాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. భాజపాకు అవకాశం ఇస్తే తెలంగాణను అవినీతి లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు.

# సైబర్ నేరగాళ్లపై హైదరాబాద్ పోలీసుల ఉక్కుపాదం

హైదరాబాద్: సైబర్ నేరాలను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు పనిచేస్తున్నారు. గత నెలలో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్లలో దేశ వ్యాప్తంగా 7 రాష్ట్రాలకు చెందిన 37 మంది సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సైబర్ నేరాలకు సంబంధించి 26 కీలక కేసులను ఛేదించామని హైదరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ అరవింద్‌బాబు తెలిపారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు జనవరిలో 117 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. అందులో అందులో 15 ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, 2 డిజిటల్ అరెస్ట్ కేసులు, 4 సోషల్ మీడియా ఆధారిత పోక్సో కేసులు, 5 బిజినెస్, గేమింగ్, జాబ్ ఫ్రాడ్ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేయడంతో బాధితులకు రూ.71.91లక్షలు రీఫండ్ చేశామని చెప్పారు. వివిధ కేసుల్లో అరెస్ట్ అయిన నిందితులు దేశవ్యాప్తంగా 86 కేసులతో సంబంధం ఉన్నట్లు విచారణలో తేలింది. అందులో తెలంగాణలో 19, ఆంధ్రప్రదేశ్ 14, రాజస్థాన్12, మహారాష్ట్ర 14, కర్ణాటక15, కేరళ 5, గుజరాత్ 7, తమిళనాడు 7, పశ్చిమ బెంగాల్ 2, మధ్యప్రదేశ్ 1, బిహార్ 2, ఢిల్లీ 6, ఉత్తరప్రదేశ్ 5, హరియాణా 2, ఒడిశా 2 కేసుల్లో నిందితుల పాత్ర ఉన్నట్లు గుర్తించారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.